ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 306 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | ఆదివారం 1 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### మధ్యప్రాచ్యానికి మారిన భారత చమురు కొనుగోళ్లు

భారత్ ముడి చమురు కొనుగోలు విధానాల్లో మార్పులు చేస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా రష్యా చమురు కొనుగోలు క్లిష్టంగా మారిన నేపథ్యంలో భారత్ ఇప్పుడు సురక్షితమైన వనరులను ఎంచుకుంటోంది. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ డేటా ప్రకారం, రష్యన్ ముడి చమురు దిగుమతి జనవరి మొదటి మూడు వారాల్లో రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది, ఇది గత నెలలో సగటున 1.21 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది.

### త్వరలో యాపిల్ డిజిటల్ చెల్లింపుల సేవలు ప్రారంభం

డిజిటల్ చెల్లింపులకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. ప్రధానంగా యూపీఐ లాంటి డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ కారణంగా లావాదేవీలు అత్యంత సులభంగా, త్వరగా జరుగుతున్నాయి. అయితే, ఈ విభాగంలో దేశీయంగా ఇప్పటికీ గూగుల్, మెటా, అమెజాన్ లాంటి గ్లోబల్ కంపెనీలు, ఫోన్‌పే, పేటీఎమ్, భారత్‌పే లాంటి దేశీయ చెల్లింపుల యాప్‌ల హవా జోరుగా సాగుతోంది.



### గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు

- వ్యోమగాముల భద్రత దృష్ట్యా మానవరహిత రాకెట్ల ప్రయోగం
- మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడి
- రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామన్న ఇస్రో ఛైర్మన్

## అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం

# ప్రదర్శించవద్దు

- బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా మన అభ్యర్థులు ఉండాలి
- అమెరికా నుంచి జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్న ముఖ్యమంత్రి
- ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే
- రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలి



హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ జూమ్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అన్నారు. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే అన్నారు. రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలని స్పష్టం - మిగతా3లో



## నోటీసు ద్వారా నా గౌరవానికి

# భంగం కలిగించారు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో నందినగర్‌లో కేసీఆర్ విచారణ
- జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ లేఖ
- తమకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదని వెల్లడి
- అధికారులతో సిట్ చీఫ్ సమావేశం
- సిట్ విచారణకు మాజీ సీఎంగా సహకరిస్తాను
- మాకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదు
- సిట్ నోటీసులపై నేతలు, న్యాయవాదులతో కేసీఆర్ సమాలోచనలు
- సిట్ విచారణకు కేసీఆర్ హాజరయ్యే అవకాశం
- జూబ్లీహిల్స్ ఏసీపీకి మాజీ సీఎం కేసీఆర్ లేఖ

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసుల విచారణకు హాజరు అవుతానని మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో విచారణకు అందుబాటులో ఉంటానని కేసీఆర్ చెప్పినట్లు సమాచారం. మధ్యాహ్నం మూడు గంటల నుంచి పోలీసులు విచారించనున్నారు. ఐతే రెండోసారి ఇచ్చిన నోటీసును నందినగర్‌లోని నివాసం గోడకు అతికించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. - మిగతా3లో

## భారత్‌పై ట్రంప్ 50 శాతం సుంకాలు

- అమెరికా రిటైర్డ్ అధికారి కీలక వ్యాఖ్యలు
- సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశం కూడా ఇతర దేశాలతో చర్చలు జరపబోదని వ్యాఖ్య
- 50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖత్వపు మనస్తత్వానికి నిదర్శనమని ఆగ్రహం
- భారత్, రష్యా దశాబ్దాలుగా మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని వ్యాఖ్య

3లో



### మోదీ ప్రభుత్వంతో సయోధ్య కోరుకుంటున్నాం

- బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి
- బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి నిధులు వచ్చేలా కృషి చేయాలని సూచన
- బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలన్న పొన్నం ప్రభాకర్



### ఒక్క రోజులో కిలో వెండికి లక్ష రూపాయల నష్టం



- షాక్ అవుతున్న ఇన్వెస్టర్లు!
- నిన్న 25% పతనమైన వెండి ధర
- వెండిని హోల్డ్ చేయాలా లేదా ప్రాఫిట్ బుక్ చేయాలా అనే సందిగ్ధంలో ఇన్వెస్టర్లు
- డాలర్ బలపడటంతో బంగారం, వెండి ధరలు పతనం



## ముగిసిన మేడారం జాతర

- జనాన్ని వీడి వనంలోకి వన దేవతల ప్రవేశం
- డప్పు, డోలు వాయిద్యాలతో వనదేవతల వనప్రవేశం
- గద్దెల వద్ద పూజల అనంతరం వనదేవతల వనప్రవేశం
- ఈనెల 28న వనం వీడి జనంలోకి వచ్చిన వనదేవతలు

మేడారం

మేడారం మహాజాతర నాలుగో రోజు ముగిసింది. శనివారం గద్దెల వద్ద పూజల అనంతరం రాత్రి వనదేతవలు వన ప్రవేశం చేశారు. డప్పు, డోలు వాయిద్యాలతో పూజారులు వనదేవతలను గద్దెల నుంచి కన్నెపల్లి, చిలకల గూడ ప్రాంతాలకు తీసుకెళ్లారు. చిలుకలగుట్టకు సమ్మక్కను, కన్నెపల్లికి సారలమ్మను, పూనుగుండ్లకు (మహబూబాబాద్) పగిడిద్దరాజు తరలించారు. గద్దెల పరిసరాల్లో విద్యుత్ దీపాలు నిలిపివేసి పూజారులు వన ప్రవేశం చేయించారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి భక్తులు లక్షలాదిగా తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. జంపన్నవాగులో - మిగతా3లో

## పురపోరులో

# రియల్ గురి

- ఛైర్మన్ పదవులపై కన్ను!
- పురపాలిక ఎన్నికల్లో స్థిరాస్తి వ్యాపారుల పెరుగుతున్న ప్రభావం
- రాజకీయ రంగప్రవేశానికి భూమిక
- ఛైర్మన్ పదవులపై కన్ను
- హైదరాబాద్‌తో బలమైన అనుసంధానం
- రాజకీయాలపై వ్యాపార ముద్ర




హైదరాబాద్

పురపాలిక ఎన్నికలు సమీపించిన వేళ వికారాబాద్ జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకే కాకుండా స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారుల పాత్ర మరింత కీలకంగా మారిందని తెలుస్తోంది. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పురపాలికల్లో మొత్తం వందకు పైగా వార్డులు ఉండగా, వాటిలో 30 నుంచి 40 వార్డుల్లో స్థిరాస్తి వ్యాపారుల ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. నేరుగా బరిలోకి దిగడం, లేదా అనుచరులను రంగంలోకి దించడం ద్వారా ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని - మిగతా3లో




### చరిత్ర సృష్టించనున్న నిర్మలా సీతారామన్!

- వరుసగా 9వసారి బడ్జెట్
- కేంద్ర బడ్జెట్-2026కు సర్వం సిద్ధం
- ఆదివారం పద్దు ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి
- మొరార్జీ దేశాయ్ రికార్డుకు చేరువలో
- చిదంబరం రికార్డు సమం

### టీఎంసీ ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతిమయం

- మమత ప్రభుత్వంపై అమిత్ షా ఫైర్..
- దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం మమతా బెనర్జీదే
- ఇంత అవినీతికి పాల్పడే ప్రభుత్వం మరొకటి లేదు
- ప్రమాదం జరిగిన 32 గంటల తర్వాతగానీ మంత్రి అక్కడకు చేరుకోలేదు



## సంపాదకీయం

# సాంకేతిక రంగంలో చైనా దూకుడు

చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) దృఢమైన దీక్షతో, చైనా ప్రపంచ ఫ్యాక్టరీగా మారింది. 'మేడ్ ఇన్ చైనా–2025"తో వందశాతం ఆటోమేషన్ (స్వయంచాలితం) దిశగా హై–ఎండ్ సాంకేతికతల్లో పాగా వేస్తోంది. "కృత్రిమ సూర్యుడి"ని సృష్టించి, పదికోట్ల డిగ్రీల వేడిని, 17.76 నిమిషాల పాటు చైనా నిర్వహించింది. చైనా "కృత్రిమ సూర్యున్ని", అడ్వాన్స్డ్ న్యూక్లియర్ ఫ్యూజన్ రీసెర్చ్ ప్రాజెక్ట్ లేదా "ఎక్స్పెరి మెంటల్ అడ్వాన్స్ సూపర్ కండక్టింగ్ టోకామాక్ (ఇ.ఏ.ఎస్.టి), హెచ్.ఎల్–2.ఎం. టోకామాక్ అంటారు. అత్యంత సంక్లిష్టమైన శాస్త్ర, సాంకేతిక ప్రక్రియ ద్వారా కృత్రిమ సూర్యుడిని భూమిపై సృష్టించింది. స్వచ్ఛమైన అనంతమైన విద్యుత్తు తయారీ ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఈ ప్రాజెక్టును హెఫీ ప్రావిన్స్‌లో నెలకొల్పారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ నిర్వహించింది. 2021లో 120 మిలియన్ డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో 101 సెకండ్ల పాటు అత్యాధునిక శాస్త్ర సాంకేతిక ప్రక్రియలు నిర్వహించారు. అలాగే 160 మిలియన్ డిగ్రీ సెల్సియస్, 20 సెకండ్ల పాటు చైనా నిర్వహించింది. ఇంటర్నేషనల్ థర్మోన్యూక్లియర్ ఎక్స్పెరిమెంటల్ రియాక్టర్ (ఐ.టి.ఇ.ఆర్) సహాయంతో ప్లాస్మా ప్రవర్తనను నిశితంగా పరిశీలించడమే దీని లక్ష్యం. హైడ్రోజన్, డుటీరియం ఐసో టోపులను దీనిలో ఇందనంగా వాడుతారు. 1) సుస్థిరమైన ప్లాస్మా, నెట్ ఎనర్జీ, అవసరమైన దానికంటే శక్తి అత్యధికంగా ఉత్పత్తి జరుగుతుంది. 2)అత్యధిక ఉష్ణోగ్రత, రేడియేషన్‌లను నిర్వహిస్తుంది. ఐటిఇఆర్ సహకారంతో అంతర్జాతీయ ఫ్యూజన్ ప్రాజెక్టు ఫ్రాన్స్‌లో కొనసాగుతోంది. దీనికి 30 దేశాలతో పాటు చైనా కీలకమైన భాగస్వామిగా ఉంది. ఈ ప్రక్రియ ద్వారా అనంతమైన స్వచ్ఛమైన విద్యుత్తును ఉత్పత్తి చేయడం. భూమండలాన్ని డీకార్బనైజ్ చేయడం లక్ష్యం. ఫ్యూజన్ విద్యుత్తు ఏ రకమైన గ్రీన్‌హౌస్ గ్యాసెస్‌ను, రేడియో యాక్టివ్ వేస్ట్‌ను ఉత్పత్తి చేయవు. ప్రపంచ మానవాళికి అవసరమైనంత స్వచ్ఛమైన విద్యుత్తు అందిస్తుంది. సంపూర్ణ స్వచ్ఛ మైన ఇంధన భద్రతను ఇస్తుంది.శిలాజ ఇంధనానికి బదులు అనంతమైన శక్తి ఈ కృత్రిమ సూర్యుడిలో లభిస్తుంది. ప్లాస్మా స్థిరత్వం, అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద సాంకేతిక పరికరాల మన్నిక, అత్యధిక ఖర్చు, అంతర్జాతీయ భాగస్వామ్యమనేవి అతిపెద్ద సవాళ్లు. హైడ్రోజన్ ఐసోటోప్‌లు అయిన డ్యూటీరియం(డి)– ట్రీటియం(టి)లను సంలీనం చేయడం ద్వారా కృత్రిమ సూర్యుడిని భూమిపై సృష్టించారు. అనంతమైన, స్వచ్ఛమైన శక్తి వెలువడుతుంది. సూర్యుడు, నక్షత్రాలలో నిరంతరం జరిగే ప్రక్రియ ఇదే. ఇక్కడ హైడ్రోజన్ అణువులు కలిసి హీలియంగా మారుతాయి. రెండు అణువుల సంలీన క్రమంలో అనంతమైన శక్తి విడుదల అవుతుంది. ఈ కృత్రిమ సూర్యుడి ప్రయోగం అణు సంలీనాన్ని మానవాళి ఆచరణీయ శక్తి వనరుగా మార్చే దిశలో ఒక ముందడుగు. సుస్థిరమైన ప్లాస్మాను సాధించడం చాలా కీలకమని ఈఎఎస్‌టి డైరెక్టర్ సాంగ్ ఉంటావో పేర్కొన్నారు. విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి ఫ్యూజన్ పరికరాలు వేల సెకండ్ల పాటు పదికోట్ల డిగ్రీల వేడిలో స్థిరంగా పనిచేయాలి. అయితే అటువంటి తీవ్రమైన పరిస్థితులను తట్టుకోగల రియాక్టర్‌ను సృష్టించడం అనే పెద్ద సవాళ్లను చైనా శాస్త్రవేత్తలు చేదించారు. అనంతమైన ప్రకృతికి హానిలేని విద్యుత్తును అందించే విధంగా, "కృత్రిమ సూర్యుడు ప్రక్రియను ఒక భారీ ఫ్యాక్టరీగా"చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేపట్టింది. ఇది మానవాళి శాస్త్ర, సాంకేతిక చరిత్రలో అత్యంత అద్వితీయ ఘట్టం. శీతోష్ణస్థితి విధ్వంసం సాగుతుంటే, దీనికి పూర్తి భిన్నంగా భారత్‌లో మోడీ బొగ్గుబ్లాకులు ఆదానీ, బడా పెట్టుబడిదారులకు అప్పగిస్తోంది. చైనా అభివృద్ధి చేసిన కృత్రిమ మేధస్సు (ఎఐ) ఉత్పత్తి అయిన డీప్ సీక్ యాప్, అమెరికాలోని ఆపిల్ యాప్ స్టోర్‌లో ఉచిత డౌన్లోడ్‌లలో, అమెరికన్ కంపెనీ ఓపెన్ ఎఐ యొక్క చాట్ జిపిటిని అధిగమించింది. ఫలితంగా అనేక అమెరికా ఎఐ టెక్నాలజీ స్టాక్ లు కుప్పకూలిపోయాయి. ప్రపంచ ఎఐ రేసులో డీప్‌సీక్‌ను, అమెరికా పరిశ్రమలకు "ఒక మేలుకొలుపు(హెచ్చరిక)గా"అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వర్ణించారు. డీప్‌సీక్ అమెరికాలో ఎందుకంత ఆందోళనను సృష్టించింది. స్టాక్ మార్కెట్‌లో భయాందోళనలను రేకెత్తించింది. డీప్‌సీక్ అత్యుత్తమ పనితీరుతో ఎఐ పరిశ్రమ ప్రవేశ అడ్డంకులను తగ్గిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రోగ్రామర్లు ఆ వ్యవస్థను ఉపయోగించడానికి, మెరుగుపరచడానికి అనుమతించే పూర్తి ఉచిత ఓపెన్ సోర్సు. మైక్రోసాఫ్ట్ చాట్ జిపిటి, గూగుల్ జెమిని లాంటి ఎఐ మోడళ్లతో పోలిస్తే, డీప్‌సీక్ ఖర్చు చాలా తక్కువ. మైక్రోసాఫ్ట్ చాట్ జిపిటి ఎఐ ఖర్చు 41 మిలియన్ డాలర్ల నుండి 78 మిలియన్ డాలర్లనీ, గూగుల్ జెమిని ఎఐ 191 మిలియన్ డాలర్లు. ఓపెన్ ఎఐ(సాఫ్ట్ బ్యాంక్)పెట్టుబడులు 40 బిలియన్(బి)డాలర్లు. ఓపెన్ ఎఐ ఆర్అండ్‌డి మౌలిక సదుపాయాలకు 115 బి. డాలర్లు (2029 వరకు). గూగుల్ జెమిని ఎఐ మౌలిక సదుపాయాలు 75 బిలియన్ డాలర్లు. చైనా డీప్‌సీక్ ఆర్1 ఎఐ శిక్షణ ఖర్చు కేవలం 2,94,000 డాలర్లు మాత్రమే. చాలా తక్కువని ప్రపంచం ఆశ్చర్యపోయింది. కొన్ని అంచనాలు డీప్‌సీక్ వి3 ఎఐ శిక్షణ ఖర్చు కేవలం 5.5 మిలియన్ డాలర్లనీ నాచురల్ జర్నల్ ప్రకటించింది. ఎఐ రంగంలో చైనాను తన ప్రాథమిక పోటీదారుగా అమెరికా గుర్తించింది. ఎఐ రంగంలో అమెరికా స్థానాన్ని బలోపేతం చేయడానికి గత జో బైడెన్ కానీ నేటి డోనాల్డ్ ట్రంప్ భారీ ఎత్తున అనేక సహాయాలను ప్రకటించారు. 2025 జనవరి 21న ట్రంప్ అమెరికా సాంకేతిక భవిష్యత్తును భద్రతకు 500 బిలియన్ డాలర్ల స్టార్ గేట్ ఎఐ మౌలిక సదుపాయాల కల్పనకు మద్దతు ప్రకటించాడు. అమెరికా సాంకేతిక స్టాక్ కంపెనీలు కుప్పకూలుతుంటే. డీప్ సీక్ సైబర్ దాడులను ఎదుర్కొంది. ఈ నాల్గవ (స్మార్ట్ టెక్నాలజీ) పారిశ్రామిక విప్లవం మానవ సమాజం విభిన్న అవసరాలను లాభాపేక్ష లేకుండా అత్యంత ప్రజా స్వామ్యయుతంగా తీర్చడానికి రూపొందించబడిన సాంకేతిక పురోగతి విప్లవాత్మక రూపమే చైనా డిప్‌సీక్. వైవిధ్యంతో కూడిన మిశ్రమ నమూనాలను ఉపయోగించడం డీప్ సీక్ ప్రత్యేకత. ఇది పని తీరు, సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి బహుళ నిపుణుల, దేశాల నమూనాలు, ఆయా వైవిధ్యాలను కలిగి ఉండాలనె ఆలోచనను ప్రభావితం చేసే అత్యాధునిక యంత్ర అభ్యాస నిర్మాణం. డీప్‌సీక్ ప్రధాన ప్రయోజనం, వినియోగదారులకు ఖర్చులను తగ్గించే సామర్థ్యంలో ఉంది. అమెరికా ఎఐ కంపెనీల ఆధిపత్యానికి భిన్నంగా, డీప్‌సీక్ ఎఐ సాంకేతికతలో ప్రజాస్వామిక విలువలను పరిరక్షిస్తుంది. ఆంగ్లభాష అధిపత్యానికి భిన్నంగా ప్రపంచ ప్రజల అన్ని భాషలలో సమాచారాన్ని క్షణాల్లో అందిస్తుంది. ఆ దేశ ప్రజల భాష హక్కులను డీప్‌సీక్ గౌరవిస్తుంది. భాషాధిపత్యాన్ని బద్దలు కొడుతుంది. డీప్‌సీక్ అమెరికా బడా సాంకేతిక కంపెనీల స్టాక్‌ల్లో సునామీని రేకెత్తించింది. ఎఐ విప్లవంలో నిజమైన ఓపెన్ సోర్స్ లీడర్‌గా నిలిచింది. తన పోటీదారుల కంటే అత్యంత మెరుగైన ఫలితాలతో వినియోగిస్తున్న ప్రజల ముందు నిలిచింది. తక్కువ ఖర్చుతో అద్భుతమైన వేగం, సామర్థ్యం, పనితీరును ప్రదర్శించింది. డీప్ సీక్ అనే కొత్త కంపెనినీ చైనాలో 140 మంది యువ ప్రతిష్టాత్మక అగ్రసేని ప్రతిభావంతులు సృష్టించారు. వీరిలో ప్రధాన సభ్యులు చైనాలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల నుండి పట్టభద్రులయ్యారు. కృత్రిమ మేధా ఏఐ ప్రపంచ మానవాళికి సేవ చేయడం తప్ప, దోపిడీ చేయడం కాదని చైనా యువకులు బడా కంపెనీలకు భారీ గుణపాఠం చెప్పారు. ఎఐని ఆయుధంగా చేసుకుని ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించడం సరికాదని హెచ్చరించారు. క్లోజ్ ఎండ్ డెవలప్మెంట్ ఎఐ ఇతరులకు నిషేధితం. ఓపెన్ సోర్స్ డెవలప్మెంట్ అందరి ప్రయోజనాల కొరకని నిరూపించారు. ఓపెన్ సోర్స్ ఎఐ, వ్యక్తులు, కంపెనీలు, సంస్థలు, దేశాలు, సంస్కృతులు, నాగరికతల మధ్య ఉన్న "ఎఐ విభజనను", వివక్షను తగ్గించడానికి, తొలగించడానికి ఉత్తమ మార్గం. ప్రపంచ ప్రజలందరినీ ఐక్యంగా సంధానం చేసే రహదారి. అధిక ఖర్చులతో కాకుండా అతి తక్కువ ఖర్చుతో ఎఐని మరింత సరసమైనదిగా డీప్‌సీక్ చేసింది. అత్యాధునిక చిప్‌లపై అమెరికా విధించిన కఠిన ఆంక్షలు, నిషేధాలను (అత్యాధునిక ఎన్వీడియా చిప్‌లు)ఎదిరించి అనేక సవాళ్ల మధ్య డీప్ సీక్ ఎఐ అద్భుతాన్ని సృష్టించడం

# స్మగ్లింగ్ నిరోధంలో తీరరక్షణ దళం పాత్ర కీలకం



1977 ఫిబ్రవరి 1వ తేదీ భారత తీర రక్షణదళం ఉనికిలోకి వచ్చిన దినం. భారత తీర రక్షణ దళం.. నావికాదళం, మత్స్య శాఖ, రెవెన్యూ శాఖ (కస్టమ్స్), కేంద్ర, రాష్ట్ర పోలీసు దళాల సహకారంతో పని చేస్తుంది. 1960లలో స్మగ్లింగ్ కార్యకలాపాలు ఎక్కువ అవటం కారణంగా కస్టమ్స్ శాఖ వారికి... తీర గస్తీకి నౌక దళం అవసరం ఏర్పడింది. స్మగ్లింగ్ నిరోధక ప్రయత్నంలో పెట్రోలింగ్ సహాయం కోసం భారత కస్టమ్స్ విభాగం తరచూ భారత నావికాదళాన్ని పిలిపించేది. క్రమంగా భారతీయ ప్రభుత్వం నౌక, వైమానిక దళ అధికారులతో సమితిని ఏర్పాటు చేసింది. భారత తీర రక్షణ దళ స్థాపన కోసం భారత నావికాదళం మొదట దేశానికి సైనిక రహిత సముద్ర సేవలను అందించడానికి ప్రతిపాదిం చింది. సమస్యను అధ్యయనం చేయడానికి భారత నావికా దళం, భారత వైమానిక దళం భాగస్వామ్యంతో నాగ్‌చౌధురి కమిటీని ఏర్పాటు చేశారు. ఆగష్టు 1971 లో, భారతదేశం లోని విస్తారమైన తీర ప్రాంతంలో పెట్రోలింగ్ చేయవలసిన అవసరాన్ని కమిటీ గుర్తించింది. అక్రమ కార్యకలాపాలను గుర్తించడానికి ఆఫ్‌షోర్ ఫిషింగ్ ఓడల రిజిస్ట్రీని ఏర్పాటు చేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాలలో నిమగ్నమైన ఓడలను అడ్డగించడానికి సమర్థవంతమైన, సుసంపన్నమైన రక్షణ శక్తిని ఏర్పాటు చేసింది. ఆ సేవలను అందించడానికి అవసరమైన పరికరాలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది సంఖ్య, స్వభావాన్ని కూడా కమిటీ పరిశీలించింది. 1973 నాటికి, భారతదేశం పరికరాలను సంపాదించడానికి ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం నిబంధనల ప్రకారం, స్మగ్లింగ్ నిరోధక మరియు చట్ట అమలు పనుల కోసం భారత నావికా దళానికి చెందిన సిబ్బందిని నియమించడం ప్రారంభించింది. అప్పటి నావికాదళ సిబ్బంది చీఫ్ అడ్మిరల్ సౌరేంద్ర నాథ్ కోహ్లీ రక్షణ కార్యదర్శికి ఒక సిఫారసు చేసారు. రక్షణ విధులను చేపట్టడానికి ప్రత్యేక సముద్ర సేవ ఆవశ్యకతను, దాని స్థాపనలో నేవీ సహాయాన్ని అందించాల్సిన అవసరాన్ని వివరించారు. అడ్మిరల్ కోహ్లీ సిఫారసుపై, రక్షణ కార్యదర్శి 1974 ఆగస్టు 31 న కేబినెట్ కార్యదర్శికి నోట్ సమర్పించారు. పర్యవసానంగా, 1974 సెప్టెంబరులో, భారత మంత్రివర్గం ఖుస్రో ఫరాముర్జ్ రుస్తాంజీ అధ్యక్షతన రుస్తాంజీ కమిటీని ఏర్పాటు చేసింది. నేవీ, వైమానిక దళం, రెవెన్యూ శాఖల భాగస్వామ్యంతో భద్రత మరియు చట్ట అమలులో అంతరాలను పరిశీలించడానికి భారత నావికాదళం, కేంద్ర మరియు రాష్ట్ర పోలీసు దళాలు, బొంబాయి హై నుండి చమురు ఆవిష్కరణ సముద్ర చట్ట అమలు మరియు రక్షణ సేవ యొక్క అవసరాన్ని మరింత నొక్కి చెప్పింది. ఈ కమిటీ 31 జూలై 1975 న రక్షణ మంత్రిత్వ శాఖలో ఇండియన్ కోస్ట్ గార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసింది. కేబినెట్ కార్యదర్శి ఈ సేవను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్రింద ఉంచాలని సిఫారసు చేశారు. అప్పుడు ప్రధాని ఇందిరా గాంధీ కేబినెట్ కార్యదర్శిని తప్పుపట్టి, ఈ సేవను రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద ఉంచడానికి రుస్తాంజీ కమిటీ అసలు సిఫార్సును అంగీకరించాలని నిర్ణయించుకున్నారు. 1 ఫిబ్రవరి 1977 న తాత్కాలిక ఇండియన్ కోస్ట్ గార్డ్ అమలు లోనికి వచ్చింది. ఇందులో రెండు చిన్న కొర్వెట్టలు మరియు ఐదు పెట్రోల్ బోట్లు నేవీ నుండి బదిలీ చేయబడ్డాయి.కోస్ట్ గార్డ్ చట్టంలో రక్షణ దళం విధులు అధికారికంగా నిర్వచించ బడ్డాయి, దీనిని భారత పార్లమెంట్ 18 ఆగస్టు 1978 న ఆమోదించింది. తద్వారా వెంటనే అమలులోకి వచ్చింది. భారత నావికా దళానికి చెందిన వైస్ అడ్మిరల్ వి.ఎ.కామత్‌ను వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. సేవ ప్రారంభోత్సవంలో ప్రధాని మొరార్జీ దేశాయ్ గార్డ్ ఆఫ్ ఆనర్ ను పరిశీలించారు. వైస్ అడ్మిరల్ కామత్ 1984 నాటికి ఐసిజిని శక్తివంతమైన శక్తిగా అభివృద్ధి చేయటానికి ఐదేళ్ల ప్రణాళికను ప్రతిపాదించాడు, కాని ఆర్థిక వనరుల సంక్షోభం కారణంగా ఈ ప్రణాళిక పూర్తి లక్ష్యం నెరవేరలేదు. ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారికంగా 18 ఆగస్టు 1978 న భారత పార్లమెంట్ యొక్క కోస్ట్ గార్డ్ చట్టం, 1978 చేత స్థాపించ బడింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) ఒక ప్రత్యేక సముద్ర నేవీ చట్టం కలిగి ఉంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ సెర్చ్ అండ్ రెస్క్యూ ఏజెన్సీ. రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద పనిచేస్తుంది. ఇది భారతదేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షిస్తుంది, సముద్ర చట్టాన్ని అమలు చేస్తుంది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐ.సి.జి) ప్రపంచం లోని ఇతర కోస్ట్‌గార్డ్లతో కలిసి సమన్వయంతో పని చేస్తుంది. మే 2005లో, పాకిస్తాన్ మారిటైమ్ సెక్యూరిటీ ఏజెన్సీ (పిఎంఎస్ఎ) తో సంబంధాలు ఏర్పరచు కోవడానికి ఐసిజి అంగీకరించింది. 2006 లో, ఇండియన్ కోస్ట్ గార్డ్ తన జపనీస్, కొరియన్ సహచరులతో కలిసి కార్యకలాపాలు నిర్వహించింది. 2008 ముంబై దాడుల తరువాత, భారత ప్రభుత్వం ఐసిజి ఫోర్స్, ఆస్తులు, మౌలిక సదుపాయాలను విస్తరించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇండియన్ కోస్ట్‌గార్డ్ డైరెక్టర్ జనరల్ కోస్టల్ కమాండ్ తీర భద్రతకు సంబంధించిన అన్ని విషయాలలో కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయానికి బాధ్యత వహిస్తారు. కృత్రిమ ద్వీపాల రక్షణ, సముద్రంలో మత్స్యకారులు, నావికులకు రక్షణ, సహాయం, కాలుష్య నియంత్రణతో సహా సముద్ర పర్యావరణం, పర్యావరణ పరిరక్షణ, తీరం గురించి శాస్త్రీయ సమాచార సేకరణ, స్మగ్లింగ్ నిరోధక చర్యలలో కస్టమ్స్ శాఖ, ఇతర అధికారులకు సహాయం, రక్షణ, ప్రాదేశిక మరియు అంతర్జాతీయ జలాల్లో చట్ట అమలు, తదితర కార్యమాలను నిర్వహిస్తుంది.

# ఆసియా తొలి మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా




కల్పనాచావ్లా.. భారతదేశ గర్వించదగ్గ వ్యోమగామి. ప్రపంచ వ్యాప్తం గాఎందరికో స్ఫూర్తిగా నిలిచిన మహిళ. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ, అంతేకాక ఇండో –అమెరికన్ మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా. పట్టుదల, కృషి, అంకితభావం ఉంటే సాధించ లేనిది ఏదీ ఉండదని ఆమె నిరూపిం చారు. ఎందరో యువతులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. కల్పనా చావ్లా, భారత దేశం లో హర్యానా లోని కర్నాల్ అనే ఊరులో సంప్రదాయ శాఖాహార ఒక పంజాబీ కుటుంబం లో మార్చి17, 1962 లో పుట్టారు. తండ్రి బనారసీ లాల్ చావ్లా. సోదరుడు సంజయ్ చావ్లా కమర్షియల్ పైలట్ కావాలని కలలు కనేవాడు. తన గదిలో విమా నాల బొమ్మలుంచేవాడు. అవి కల్ప నలో స్ఫూర్తిని రగిలించాయి. కల్ప నా చావ్లా ముందుగా, కర్నాల్ లో ఉన్న టాగోర్ పబ్లిక్ స్కూల్లో చదువుకున్నారు. పంజాబ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన కల్పనా చావ్లా ఎంఎస్ కోసం 1982లో అమెరికాకు వలస వెళ్లారు. 1982 లో ఈమె అమెరికా వెళ్లి అక్కడ "ఏరోస్పేస్ ఇంజనీరింగ్"లో మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని, అర్లింగ్టన్‌లో ఉన్న టెక్సాస్ విశ్వ విద్యాలయం నుంచి 1984 లో పొందారు. 1986లో, చావ్లా రెండవ మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని మరియు ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో పిహెచ్డి ని బౌల్డెర్‌లో ఉన్న కోలోరాడో విశ్వ విద్యాలయం నుంచి పొందారు. ఆమె 1983 లో విమానయాన శిక్షకుడు మరియు విమాన చోదక శాస్త్ర రచయిత ఐన జీన్–పియర్ హారిసన్ ను వివాహం చేసుకున్నారు. భారత దేశంలో మొట్టమొదటి విమానాన్ని నడిపిన జె.ఆర్.డి. టాటా యే తనకు స్ఫూర్తి, అందుకనే ఏరోనాటిక్స్ ఇంజనీరింగ్ ను కెరీర్ గా తీసుకున్నానని చెపుతుండేవారు. లింగ వివక్షతను అధిగమించి తల్లి సహకారంతో ఆమె తన కలలను సాకారం చేసుకున్నారు. కల్పన అంటే ఆలోచన లేదా ఊహ. చిన్న నాటి నుంచే ఆకాశంలో విహరిం చాలనే కోరికతో కల్పన తన పేరును సార్థకం చేసుకున్నారు. టెక్సాస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తయిన తర్వాత, 1988లో కొలరాడో యూనివర్సిటీ నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో పీహెచ్ పట్టాను స్వీకరించారు. 1988లో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ఏమ్స్ రిసెర్చ్ సెంటర్లో ఉద్యోగంలో చేరారు. ఏడాది నాసా పరిశోధన కేంద్రంలో చేరిన కల్పన పవర్ లిఫ్ట్ కాంప్యూటే షనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ విభాగంలో వైస్–ప్రెసిడెంట్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత నాసాకు వైస్–ప్రెసిడెంట్‌గా సేవలు అందించారు. 1991లో ఆమెకు అమెరికా పౌరసత్వం లభించింది. తొలిసారిగా 1997లో కొలంబియా నౌక ద్వారా అంతరిక్ష యానం చేసిన కల్పనా చావ్లా చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలో 376 గంటలు గడిపి భూమిచుట్టూ 252 సార్లు పరిభ్రమించి 6.5 మైళ్లు తిరిగారు. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మహిళగానే కాదు, తొలి ఆసియా మహిళగానూ కల్పన రికార్డులకెక్కారు. తన మొదటి స్పేస్ మిషన్‌లో భాగంగా కొలంబి యా ఎస్‌టీఎస్–87 అంతరిక్ష నౌకలో ప్రయాణించేటప్పుడు ఆమెఅప్పటి భారత ప్రధాని ఐకే గుజ్రాల్‌తో మాట్లాడారు. ఆ సమయంలో అంతరిక్షం నుంచి తీసిన హిమాల యాల ఫోటోలను గుజ్రాల్‌కు చూపించారు. 2003 జనవరిలో రెండోసారి అంతరిక్షంలోకి వెళ్లి 16 రోజులు గడిపి 80 ప్రయోగాలను విజయ వంతంగా నిర్వహించారు. భారత మూలాలు ఉన్న కల్పన 40 ఏళ్ల వయసులో, 2003లో చనిపోయారు. 2003 ఫిబ్రవరి 1 న అంతరిక్షం నుంచి తిరిగివస్తూ ఆమె ప్రయాణిస్తున్న అంతరిక్ష నౌక భూమి వాతావరణం లోకి ప్రవేశిస్తు న్నప్పుడు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో కల్పనతో పాటు ఆమె తో కలిసి ప్రయాణిస్తున్న మరో ఆరుగురు సిబ్బంది కూడా మరణిం చారు. కొలంబియా అంతరిక్ష నౌక షెడ్యూల్ ల్యాండింగ్‌కు 16 నిమిషాల ముందు అమెరికాలోని టెక్సాస్ ప్రాంతంలో కూలిపోయింది. ఆమె గౌరవార్థం తమిళనాడు ప్రభుత్వం కల్పనా చావ్లా పురస్కారాన్ని 2003 నుంచి ఏటా ప్రకటిస్తోం ది. దీన్ని వివిధ రంగాల్లో 15 మంది శక్తివంతమైన మహిళకు అంద జేస్తుంది. కల్పన గౌరవార్థం దేశం లోని ఎన్నో విద్యాసంస్థలకు, అవార్డులకు ఆమె పేరు పెట్టారు. యువ మహిళా శాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు కర్ణాటక ప్రభు త్వం 2004లో కల్పనా చావ్లా అవార్డును ఏర్పాటు చేసింది. భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం 2003లో ప్రయోగించిన మెట్ శాట్‌కు కల్పనా చావ్లా పేరు పెట్టారు. తండ్రి బనారసీలాల్ చావ్లా సాధారణ వ్యాపారి. కల్పనపై ఆయన ప్రభావం ఎక్కువ. పేదరికం నుంచే ఆయన పైకెదిగీ, పట్టుదల, అందుకు తగిన కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన వ్యక్తి ఆయన. చిన్నగా టైర్ల వ్యాపారాన్ని ప్రారంభించిన ఆయన తొలుత ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారు. అయినా దాన్ని వదలకుండా అనుకున్నది సాధించేందుకు ముందుకు సాగిపోయారు. అప్పటి వరకూ టైర్ల తయారీకి విదేశీ యంత్రాన్ని ఉపయోగించేవారు. ఆ క్రమంలో ఆయన దేశీయంగానే ఆ యంత్రా న్ని రూపొందించారు. బనారసీలాల్ శ్రమ ఫలించింది. రాష్ట్రపతి నుంచీ అభినందనలు అందుకున్నారు. తర్వాత డబ్బుకోసం బనారసీ కుటుంబం ఇబ్బంది పడింది లేదు. ఆడపిల్లే అయినా జీవితంలో ఏదో సాధించాలన్న తపన కల్పనలో పాదుకోవడానికి తండ్రేకారణం. "పరిస్థితులు ఎలాగున్నా... కన్న కలల్ని నిజం చేసుకోవడమే అంతిమ లక్ష్యం అన్న మాటలు నా తండ్రి జీవితంలో నిజమయ్యాయి. ఫలితంగా అవే నాలోనూ జీర్ణించుకు పోయాయి. అందుకు నాన్నే కారణం." అంటూ తొలి అంతరిక్షయానం తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆలోచనలు ఏ విధంగా ప్రభావితమయిందీ కల్పన వివరించారు. ఏదో ఒకటి చేయండి, కానీ దాన్ని మీరు మనఃస్ఫూర్తిగా చేయాలను కోవాలి. ఎందుకంటె ఏదైనా పనిని కేవలం ఒక లక్ష్యం కోసం చేయడం కాక,... దానిలో లీనమై అనుభవిం చాలి" అని యువతులకు సందేశం ఇచ్చేవారు.

ధర్మఘంట

# పోలీసుల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం



**లక్నో:** పోలీసులు జరుపుతున్న ఎన్‌కౌంటర్లపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పోలీసులు పలువురు నిందితుల కాళ్లపై కాల్పులు జరిపి, వాటిని ఎన్‌కౌంటర్లుగా చిత్రీకరించే ధోరణిపై అలహాబాద్ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నిందితుల కాళ్లపై కాల్పులు జరపవచ్చని పోలీసు అధికారులకు ఏవైనా మౌఖిక లేదా లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారా? అని రాష్ట్ర డీజీపీ, హోం సెక్రటరీని కోర్టు ప్రశ్నించింది. ఈ తరహా ఘటనలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని యూపీ ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడానికో లేదా నిందితులకు బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో శిక్షగా వారి కాళ్లపై కాల్పులు జరుపుతున్నట్లు కనిపిస్తున్నదని ధర్మాసనం పేర్కొంది. చట్టాన్ని పరిరక్షించాల్సిన వారే ఇలాంటి చర్యలకు పాల్పడటం గమనార్హమని వ్యాఖ్యానించింది. శిక్షించే అధికారం కేవలం న్యాయస్థానాలకే ఉంటుందని, పోలీసులకు కాదని కోర్టు స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థల విధులు స్పష్టంగా నిర్వచించారని కోర్టు గుర్తుచేసింది. న్యాయ వ్యవస్థ పరిధిలోకి పోలీసులు చొరబడటం ఎంతమాత్రం సహించబోమని, ఇది రాజ్యాంగ విరుద్ధమని కోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది.

**చిన్నపాటి నేరాలకూ తూటాలేనా?**

దొంగతనం లాంటి చిన్నపాటి నేరాల్లో కూడా పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరుపుతూ, వాటిని ఎన్‌కౌంటర్లుగా సృష్టిస్తున్నారని న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ ఎన్‌కౌంటర్లలో గాయపడిన ముగ్గురు నిందితుల బెయిల్ పిటిషన్లను విచారించే సందర్భంలో ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఈ ఘటనల్లో ఏ ఒక్క పోలీసు అధికారికి కూడా గాయం కాలేదనే విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. .

# చరిత్ర సృష్టించనున్న నిర్మలా సీతారామన్!




కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భారత పార్లమెంటరీ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించడానికి సిద్ధమయ్యారు. ఆదివారం (ఫిబ్రవరి 1, 2026) ఆమె పార్లమెంట్‌లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇది ఆమెకు వరుసగా తొమ్మిదో బడ్జెట్ కావడం విశేషం. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ ఆర్థిక మంత్రి కూడా వరుసగా తొమ్మిది సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్ట లేదు. ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా, తొలి మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ చరిత్రకెక్కను న్నారు. దేశంలో అత్యధిక కాలం నిరంతరాయంగా ఆర్థిక మంత్రిగా కొనసాగుతున్న రికార్డును కూడా ఆమె సొంతం చేసుకున్నారు.

**వరుసగా 9వ సారి**

నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది తొమ్మిదోసారి. ఇప్పటివరకు మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ అత్యధికంగా 10 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అయితే ఆయన వరుసగా ప్రవేశపెట్టలేదు. వేర్వేరు సమయాల్లో అందించారు. మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం మొత్తం 9 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. కానీ ఆయన కూడా వరుసగా చేయలేదు. నిర్మలా సీతారామన్ రేపు బడ్జెట్ ప్రవేశపెట్టడం ద్వారా చిదంబరం రికార్డును సమం చేయనున్నారు. అంతేకాదు, వరుసగా బడ్జెట్‌లు ప్రవేశపెట్టే విషయంలో మొరార్జీ దేశాయ్ (6 వరుస బడ్జెట్‌లు), మన్మోహన్ సింగ్ (5 వరుస బడ్జెట్‌లు), యశ్వంత్ సిన్హా, అరుణ్ జైట్లీ వంటి దిగ్గజాలను ఆమె ఎప్పుడో దాటేశారు.

**సుదీర్ఘ కాలం ఆర్థిక మంత్రిగా**

నిర్మలా సీతారామన్ మరో అరుదైన రికార్డును కూడా సొంతం చేసుకున్నారు. ఆమె 2019 మే 31న ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2026 జనవరి 31 నాటికి ఆమె ఈ పదవిలో 6 ఏళ్ల 8 నెలలు పూర్తి చేసుకున్నారు. గతంలో సి.డి. దేశ్‌ముఖ్ సుమారు 6 ఏళ్ల 2 నెలల పాటు నిరంతరాయంగా ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు నిర్మల ఆ రికార్డును బద్దలు కొట్టి, అత్యధిక కాలం వరుసగా ఆర్థిక మంత్రిగా పనిచేసిన వ్యక్తిగా నిలిచారు. మన్మోహన్ సింగ్ 5 ఏళ్లు, అరుణ్ జైట్లీ 4 ఏళ్ల 8 నెలలు, యశ్వంత్ సిన్హా 4 ఏళ్ల 4 నెలలు ఈ పదవిలో ఉన్నారు. నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టిన సమయంలో ప్రపంచాన్ని కొవిడ్-19 కుదిపేసింది. ఆ తర్వాత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తాయి. ఈ సవాళ్లన్నింటినీ ఎదుర్కొని ఆమె భారత ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించారు. ఆమె హయాంలోనే భారత్ ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరించింది.

**మధురై నుంచి నార్త్ బ్లాక్ వరకు**

నిర్మలా సీతారామన్ వ్యక్తిగత ప్రస్థానం విషయానికి వస్తే, ఆమె 1959 ఆగస్టు 18న తమిళనాడులోని మధురైలో జన్మించారు. తిరుచిరాపల్లిలోని సీతాలక్ష్మి రామస్వామి కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. ఢిల్లీలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్, ఎంఫిల్ చేశారు. లండన్‌లో పీడబ్ల్యూసీ, బీబీసీ వరల్డ్ సర్వీస్‌లో పనిచేశారు. హైదరాబాద్‌లో 'ప్రణవ' అనే పాఠశాలను స్థాపించారు. 2008లో బీజేపీలో చేరి, 2010లో అధికార ప్రతినిధి అయ్యారు. 2014లో కామర్స్ మంత్రిగా, 2017లో రక్షణ మంత్రిగా, 2019లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆమె భర్త ప్రముఖ ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్. వారికి ఒక కుమార్తె ఉంది.

**బడ్జెట్ ముచ్చట్లు - రికార్డులు**

బడ్జెట్ ప్రసంగాల విషయంలోనూ నిర్మలమ్మది ప్రత్యేక శైలి. 2020 ఫిబ్రవరి 1న ఆమె ఏకంగా 2 గంటల 40 నిమిషాల పాటు బడ్జెట్ ప్రసంగం చేశారు. ఇది ఇప్పటికీ రికార్డే. 1977లో హిరుభాయ్ ఎం.పటేల్ కేవలం 800 పదాలతో బడ్జెట్ ప్రసంగం ముగించారు. ఇది అతి చిన్న ప్రసంగం. 2019లో ఆమె బ్రిటిష్ సంప్రదాయమైన 'బ్రీఫ్‌కేస్'ను పక్కనపెట్టారు. భారతీయ సంప్రదాయమైన ఎర్రటి వస్త్రంతో కూడిన 'బహీ ఖాతా'ను తీసుకొచ్చారు. 2021 నుంచి పేపర్ వాడకం తగ్గించి, 'ట్యాబ్లెట్' ద్వారా డిజిటల్ బడ్జెట్‌ను చదవడం ప్రారంభించారు.

**సమయం మారింది, తేదీ మారింది**

బడ్జెట్ చరిత్రలో జరిగిన కీలక మార్పులను ఒకసారి పరిశీలిద్దాం. 1999 వరకు బడ్జెట్‌ను సాయంత్రం 5 గంటలకు ప్రవేశపెట్టేవారు (బ్రిటిష్ కాలమానం ప్రకారం). యశ్వంత్ సిన్హా దానిని ఉదయం 11 గంటలకు మార్చారు. అప్పటి నుంచి అదే కొనసాగుతోంది. 2016 వరకు ఫిబ్రవరి చివరి రోజున బడ్జెట్ ఉండేది. కానీ అరుణ్ జైట్లీ హయాంలో (2017లో) దానిని ఫిబ్రవరి 1వ తేదీకి మార్చారు. దీనివల్ల ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలయ్యే సరికి నిధుల కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుంది.

# మహా ఉపముఖ్యమంత్రిగా సునేత్ర ప్రమాణస్వీకారం



మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ శుక్రవారం (జనవరి 31)న ప్రమాణ స్వీకారం చేశారు. మహారాష్ట్ర ఇన్‌చార్జ్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేతో పాటు ఎన్‌సీపీకి చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. దివంగత అజిత్ పవార్ ఆకస్మిక మృతితో ఖాళీ అయిన ఉప ముఖ్యమంత్రి పదవికి ఆయన భార్య సునేత్రా పవార్‌ను ఎంపిక చేశారు. దీంతో ఆమె మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. సునేత్ర మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్నప్పుడు, ఎన్‌సీపీ నాయకులు 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. మరోవైపు, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సునేత్ర పవార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. "మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఎన్నికైన సునేత్ర పవార్‌కు శుభాకాంక్షలు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళ కావడం విశేషం. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఆమె అవిశ్రాంతంగా కృషి చేస్తారని, దివంగత అజిత్‌దాదా పవార్ ఆశయాలను నెరవేరుస్తారని నేను విశ్వసిస్తున్నాను" అని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**ప్రభుత్వ స్థిరత్వాన్ని కొనసాగించేందుకు ఈ నిర్ణయం**

అయితే, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు విధానభవన్‌లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో సునేత్రా పవార్‌ను ఎన్‌సీపీ శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ నాయకత్వం తీసుకున్న నిర్ణయం అనంతరం సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌లో ఆమె ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణం చేయించగా, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. దివంగత అజిత్ పవార్ మరణానంతరం ఏర్పడిన రాజకీయ పరిస్థితుల్లో పార్టీ ఐక్యతను కాపాడుతూ, ప్రభుత్వ స్థిరత్వాన్ని కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌సీపీ నేతలు తెలిపారు. సునేత్రా పవార్‌కు రాజకీయ అనుభవం ఉన్న కుటుంబ నేపథ్యం ఉండటంతో పాటు, పార్టీ కార్యకలాపాల్లో కూడా ఆమె చురుకుగా పాల్గొంటూ వచ్చారు.

అనేక ప్రచారాలకు నాయకత్వం వహించిన సునేత్ర

సునేత్రా పవార్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా రాజకీయ బరిలోకి దిగారు. ఆమె పెద్ద కుమారుడు పార్థ్ పవార్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో మావల్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు. చిన్న కుమారుడు జయ్ వ్యాపారవేత్తగా కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా, 2010లో సునేత్రా 'ఎన్విరాన్‌మెంట్ ఫోరం ఆఫ్ ఇండియా' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి, ఎకో విలేజ్ మోడల్ అమలు వంటి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. నీటి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, కరవు నివారణపై అనేక ప్రచారాలకు నాయకత్వం వహించారు. అదే విధంగా శరద్ పవార్ స్థాపించిన విద్యా సంస్థ 'విద్యా ప్రతిష్ఠన్'కు ట్రస్టీగా కూడా ఆమె సేవలందిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో సస్టెయినబిలిటీ, సామాజిక ఆవిష్కరణలపై భారత్ తరపున ప్రాతినిధ్యం వహించారు. బారామతి హైటెక్ టెక్స్‌టైల్ పార్క్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తూ 15 వేలకుపైగా గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించారు. అలాగే నిర్మల్ గ్రామ పథకం ద్వారా 86 గ్రామాల్లో స్వయం సహాయక బృందాల ఉద్యమానికి నేతృత్వం వహించారు. కాగా ఇప్పుడు సునేత్రా పవార్ ఇప్పుడు ఎన్‌సీపీని ఏకతాటిపై నిలబెట్టే సవాలును ఎదుర్కొంటున్నారు. బీజేపీ, ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనతో సమన్వయం కొనసాగిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆమెపై ఉంది.

## గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు



తొలి మానవరహిత అంతరిక్ష ప్రయాణ మిషన్ 'గగన్‌యాన్'కు సిద్ధమవుతున్నామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన 8 వేలకు పైగా ప్రయోగాలు సఫలమయ్యాయని తెలిపారు. వ్యోమగాముల భద్రత దృష్ట్యా మూడు మానవ రహిత రాకెట్‌లను ప్రయోగిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామని, గగన్‌యాన్ మిషన్ విజయవంతం చేయడమే అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. రెండో మానవరహిత రాకెట్ ప్రయోగం ఈ ఏడాది చివరలో ఉంటుందని తెలిపారు. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఇస్రో ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ చేపట్టగా, ఈ ప్రాజెక్టు తుది దశకు చేరిందని అన్నారు. మానవ సహిత స్పేస్ మిషన్‌లో భాగంగా మార్చిలో వ్యోమమిత్ర రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. కాగా, 2027లో చేపట్టనున్న గగన్‌యాన్ మిషన్ కోసం వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా ఎంపికైన విషయం తెలిసిందే.

## ఒక్క రోజులో కిలో వెండికి లక్ష రూపాయల నష్టం..

వెండి మార్కెట్‌లో ఒక్క రోజులోనే భారీ దెబ్బ తగిలింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజఠ)లో వెండి ధరలు 25% పడిపోయి, కిలోకు దాదాపు రూ.1 లక్ష నష్టం జరిగింది. రికార్డు గరిష్ట స్థాయికి చేరిన తర్వాత వెంటనే ఈ పతనం ఇన్వెస్టర్లను తీవ్రంగా కంగారు పెట్టింది. ఇప్పుడు వెండిని హోల్డ్ చేయాలా, లాభాలు బుక్ చేయాలా లేదా మరిన్ని హెచ్చరికలు తీసుకోవాలా అని అందరూ ఆలోచనలో పడ్డారు. ఎంసీఎక్స్ వెండి ధరలు ఈ వారం ప్రారంభంలో రూ.4 లక్షల స్థాయికి చేరుకున్నాయి. కానీ నిన్న ఒక్క రోజులోనే రూ.3 లక్షల స్థాయికి దిగివచ్చాయి. ఇది వెండి చరిత్రలోనే అతిపెద్ద రోజువారీ పతనాల్లో ఒకటి. అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్ వెండి 28% తగ్గి 85 డాలర్లకు చేరింది (గరిష్ఠం 121.60 డాలర్లు). బంగారం కూడా 9% పడిపోయింది. ఈ పతనానికి ప్రధాన కారణం... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫెడ్ చైర్‌గా కెవిన్ వార్ష్‌ను ఎంపిక చేయడంతో ఫెడ్ స్వతంత్రతపై భయాలు తగ్గాయి. దీంతో, డాలర్ ఇండెక్స్ గత సంవత్సరం మే తర్వాత అతిపెద్ద రోజువారీ పెరుగుదల నమోదు చేసి 97కి చేరింది. బలమైన డాలర్ వల్ల బంగారం, వెండి ధరలు తగ్గాయి. ఇవి డాలర్ ధర పరిధిలో ఉండటం వల్ల విదేశీ కొనుగోలుదారులకు ఖరీదైనవి అవుతాయి. బంగారం పతనం వెండిని మరింత దెబ్బతీసింది. జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ రిపోర్ట్ ఏం చెబుతోందటే... ఇప్పటికే వెండిని హోల్డ్ చేస్తున్న వారు రూ.3 లక్షల కింద స్టాప్ లాస్ ఉంచాలని సూచిస్తోంది.

## భారత్‌పై ట్రంప్ 50 శాతం సుంకాలు



భారతదేశం తన సొంత ప్రయోజనాలను కాదని, అమెరికా చెప్పే ప్రతిదానికి తలాడించదని యూఎస్ రిటైర్డ్ ఆర్మీ కల్నల్, రక్షణ రంగ నిపుణుడు డగ్లస్ మాక్‌గ్రెగర్ అన్నారు. సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశం కూడా ఇతర దేశాలతో చర్చలు జరపబోదని అన్నారు. రష్యాతో వ్యాపారం చేస్తోందన్న కారణంతో భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు 50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. కొంతకాలంగా అమెరికా, భారత్ మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలపై డగ్లస్ స్పందిస్తూ, అమెరికా ఎప్పుడూ కూడా ప్రపంచ దేశాలు తమకు అనుకూలంగా ఉండాలని కోరుకుంటుందని, లేదంటే వ్యతిరేకంగా ఉన్నాయని భావిస్తుందని అన్నారు. అమెరికా చెప్పే ప్రతి అంశంతో లేదా అమెరికా చేసే ప్రతి దానితో భారత్ ఎప్పుడూ ఏకీభవించాలని చూడవద్దని అన్నారు. దశాబ్దాలుగా భారత్, రష్యా మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని, ఇప్పుడు వాటిని కలిసి వ్యాపారం చేయవద్దంటే అవి అమెరికాను వ్యతిరేకించే అవకాశం ఉందని అన్నారు. "మీరు రష్యాతో వ్యాపారం చేస్తే కనుక మేం మీకు వ్యతిరేకం" అనేది మూర్ఖత్వమని అన్నారు. మలేసియా వంటి దేశాలు అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం తమ ముఖ్య విధానాల విషయంలో కూడా రాజీపడాల్సి వచ్చిందని అన్నారు. ప్రపంచ దేశాలపై బెదిరింపులకు పాల్పడుతూ ఇష్టారీతిన సుంకాలు విధిస్తే అది అమెరికాకే నష్టమని అన్నారు.

## టీఎంసీ ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతిమయం




పశ్చిమ బెంగాల్‌లోని, మమతా బెనర్జీ ఆధ్వర్యంలో నడుస్తున్న టీఎంసీ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం మమతా బెనర్జీదే అని వ్యాఖ్యానించారు. ప.బెంగాల్, సిలిగురిలో శనివారం జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీ పాలనను తీవ్రంగా తప్పుబట్టారు. "భారత సరిహద్దు (పశ్చిమ బెంగాల్) ప్రాంతంలో కంచె ఏర్పాటు చేసేందుకు బీఎస్‌ఎఫ్‌కు భూమి అవసరం. సరిహద్దులో కంచె ఏర్పాటు చేసేందుకు స్థలం కావాలని మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కోరాం. ఈ అంశంపై ఇప్పటికే మమతకు ఏడుసార్లు లేఖలు రాశాం. చివరకు నేనే నేరుగా మమత కార్యాలయానికి వెళ్లి మరీ భూమి గురించి అడిగా. కానీ, ఇంతవరకు భూమి కేటాయించలేదు. బెంగాల్‌లోని ప్రతి వర్గం ఒకరితో ఒకరు గొడవ పడేలా చేసి, ఐకమత్యాన్ని దెబ్బతీయడంలో మమత సిద్ధహస్తురాలు. దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం మమతా బెనర్జీది. ఇంత అవినీతికి పాల్పడే ప్రభుత్వం మరొకటి లేదు. ఆనందపూర్ వేర్ హౌజ్‌లోని మోమో ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన వారికి నా నివాళులు. ఇది ప్రమాదవశాత్తు జరిగింది కాదు. మమతా బెనర్జీ అవినీతి వల్ల జరిగిన ఘటన. ఈ ఫ్యాక్టరీలో ఎవరి డబ్బు ఉంది..? ఫ్యాక్టరీ ఓనర్ విదేశాలకు ఎలా వెళ్లారు..? ఆయనను ఎందుకు అరెస్టు చేయలేదు..? ప్రమాదం జరిగిన 32 గంటల తర్వాతగానీ మంత్రి అక్కడకు చేరుకోలేదు. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మమత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా' అని అమిత్ షా వ్యాఖ్యానించారు. కాగా.. ఈ ఘటనలో 21 మంది కూలీలు మరణించారు.

ధర్మఘంట

# నోటీసు ద్వారా నా గౌరవానికి భంగం కలిగించారు

-మొదటిపేజీ తరువాయి

ఈ తరుణంలో జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ లేఖ రాశారు. తమకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. తనకు ఇచ్చిన నోటీసు అక్రమమని, నోటీసు ద్వారా తన గౌరవానికి భంగం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. నందినగర్‌లో తన నివాసానికి నోటీసు అంటించడం చెల్లదని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం నోటీసులు అంటించడం అక్రమమని మాజీ సీఎం అన్నారు. 160 పీఆర్‌సీ ప్రకారం తనకు నోటీసులు ఇచ్చే పరిధి ఏసీపీకి లేదని, తాను ఉండే ఎర్రవల్లిలో తన స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సిట్ విచారణకు మాజీ సీఎంగా, ప్రతిపక్షనేతగా నేను విచారణకు సహకరిస్తానని, రేపు మధ్యాహ్నం మూడు గంటలకు అందుబాటులో ఉంటానని లేఖలో పేర్కొన్నారు. రేపు ఉదయం ఎర్రవల్లి నుంచి హైదరాబాద్‌కు కేసీఆర్ రానున్నారు.

**అధికారులతో సిట్ చీఫ్ సమావేశం**

కేసీఆర్ లేఖ నేపథ్యంలో మరోసారి సిట్ సమావేశమైంది. రేపు మధ్యాహ్నం మూడు గంటలకు కేసీఆర్ విచారణ దృష్ట్యా అధికారులతో సిట్ చీఫ్ సమావేశమయ్యారు.

**ప్రశ్నావళి సిద్ధం**

ఒకవేళ కేసీఆర్ విచారణకు హాజరైతే అడగాల్సిన ప్రశ్నావళిని సిట్ ఇప్పటికే సిద్ధం చేసుకున్నట్లుగా సమాచారం. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు పునర్నియామకానికి సంబంధించిన నోట్ ఫైల్ ఆధారంగా ఆయన్ని ప్రశ్నించే అవకాశం ఉంది. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో విశ్రాంత అధికారిని ఇంటెలిజెన్స్ విభాగానికి ఓఎస్డీగా నియమించడంలోనే కుట్ర ఉందనే కోణంలో సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కేసులో సిట్ జారీ చేసిన నోటీసులపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆ పార్టీ నేతలు, లాయర్లతో ఎర్రవల్లిలో సమాలోచనలు చేశారు. కేటీఆర్, హరీశ్‌రావులు నిన్నటి నుంచి ఎర్రవల్లిలోనే ఉన్నారు. రేపటి సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) విచారణ అంశంపై చర్చిస్తున్నారు.

**జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ లేఖ**

ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్‌లోని నివాసంలో కేసీఆర్ విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంలో జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ లేఖ రాశారు. తమకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదని అన్నారు. తనకు ఇచ్చిన నోటీసు అక్రమమని, నోటీసు ద్వారా తన గౌరవానికి భంగం కలిగించారని లేఖలో పేర్కొన్నారు. రేపు ఉదయం ఎర్రవల్లి నుంచి హైదరాబాద్‌కు కేసీఆర్ రానున్నారు.

**నల్ల జెండాలతో నిరసనలు, ధర్నాలు**

మరోవైపు రేపు శాంతియుత పద్ధతిలో నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. సిట్, ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. బైక్ ర్యాలీలు, నల్ల జెండాలతో నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా జిల్లాల నేతలు ఎక్కడికక్కడే నిరసన చేపట్టాలని ఆదేశించింది. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు తెలంగాణ భవన్‌కు రావాలని సూచనలు చేసిది.

**సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు**

నోటీసులను నందినగర్‌లోని కేసీఆర్ నివాసం గోడకు సిట్ అతికించడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆయన స్వయంగా తానుంటున్న నివాసం అడ్రస్‌తో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అతికించి పైశాచిక ఆనందాన్ని పొందడం దారుణమని అన్నారు. ఇది అహంకారం కాకపోతే మరింకేమిటి! అని కేటీఆర్ మండిపడ్డారు.

**పోలీసులకు ఎస్‌వోపీపై అవగాహన ఉందా?**

65 సంవత్సరాలు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలనేటువంటి నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ అసహనం వ్యక్తం చేశారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ) మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా సీఎం చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నింటినీ ఛేదిస్తామని ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని కేటీఆర్ తెలిపారు. సమయం వచ్చినప్పుడు ప్రజాక్షేత్రంలోనే వారికి బుద్ధి చెబుతారని తెలిపారు.

# ఎర్రవల్లి వర్సెస్ జూబ్లీహిల్స్



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో గురువారం చోటుచేసుకున్న పరిణామాలు అత్యంత వేగంగా, నాటకీయంగా సాగాయి. గురువారం ఉదయం సిట్ అధికారులు నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లి నోటీసులు అందజేయడంతో మొదలైన ఈ ప్రక్రియ, సాయంత్రానికి కేసీఆర్ ఇచ్చిన ఘాటైన సమాధానంతో కొత్త మలుపు తీసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు కోరగా, కేసీఆర్ మాత్రం తన లిఖితపూర్వక సమాధానంలో చట్టపరమైన అంశాలను ప్రస్తావిస్తూ నో చెప్పారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం చివరి దశలో ఉండటంతో తానే అభ్యర్థులకు బి-ఫారాలు కేటాయించాల్సి ఉందని, అందుకే హాజరుకాలేనని స్పష్టం చేశారు.కేసీఆర్ తన సమాధానంలో కేవలం ఎన్నికల బిజీనే కాకుండా, చట్టంలోని కీలక నిబంధనలను గుర్తు చేశారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు పిలవకూడదని, వారి నివాసంలోనే విచారించాలని ఉన్న నిబంధనను ఆయన తన రక్షణ కవచంగా మార్చుకున్నారు. తాను ప్రస్తుతం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే నివసిస్తున్నానని, అక్కడికే వచ్చి విచారించుకోవచ్చని ఆయన ఆఫర్ ఇచ్చారు. దీంతో పోలీసులు ఆయనను జూబ్లీహిల్స్ ఏసీబీ కార్యాలయానికి రప్పించాలనే ప్రాథమిక ఆలోచనను తాత్కాలికంగా పక్కన పెట్టాల్సి వచ్చింది.కేసీఆర్ ఇచ్చిన సమాధానం కేవలం సమాచారం మాత్రమే కాదు, అందులో లోతైన న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. ఆయన నివాస స్థలం ఎక్కడ? విచారణ ఎక్కడ జరపాలి? అనే విషయాలపై స్పష్టత కోసం సిట్ అధికారులు ఇప్పుడు న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. శుక్రవారం విచారణ ఉండదని స్పష్టమైపోయింది. సిట్ ఈ మేరకు కేసీఆర్ కు సమాచారం ఇచ్చింది. అయితే, తదుపరి నోటీసులు ఎప్పుడు ఇస్తారు? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకునే లోపే విచారణ ముగించాలని ప్రభుత్వం భావిస్తుందా, లేక ఎన్నికల తర్వాతే దీనిపై దృష్టి పెడుతుందా అనేది వేచి చూడాలి.బీఆర్ఎస్ ఈ నోటీసులను రాజకీయ కక్షసాధింపుగా మలిచి సానుభూతి పొందాలని చూస్తుంటే, కాంగ్రెస్ మాత్రం అక్రమాలను బయటపెడుతున్నామనే సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. నామినేషన్ల చివరి రోజైన శుక్రవారాన్ని కేసీఆర్ ఎంచుకోవడం వెనుక, క్యాడర్‌లో నైతిక బలాన్ని పెంచే ఉద్దేశం కూడా ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మొత్తానికి, విచారణ వాయిదా పడటం అనేది ప్రస్తుతానికి కేసీఆర్‌కు తాత్కాలిక ఊరటనిచ్చినప్పటికీ, సిట్ మాత్రం ప తదుపరి నోటీసుల కోసం రంగం సిద్ధం చేస్తోంది. మరో వైపు కేసీఆర్ తన సమాధానంలో కేవలం రాజకీయ కారణాలనే కాకుండా, చట్టంలోని కీలక నిబంధనలను కూడా ప్రస్తావించారు.సీఆర్‌పీసీ సెక్షన్ 160ని ఉటంకిస్తూ, దర్యాప్తు అధికారులు సాక్షులను లేదా విచారించాల్సిన వ్యక్తులను ఎక్కడ విచారించాలనే విషయాన్ని గుర్తు చేశారు. 65 ఏళ్లు పైబడిన వాళ్లను దివ్యాంగులను, నివసించే ప్రాంతం కాకుండా ఇతర చోట్ల విచారణ నిమిత్తం పిలవకూడదని చట్టం చెబుతోందని ఆయన తెలిపారు. చట్టం ప్రకారం 65 ఏళ్లు పైబడిన వ్యక్తిని దర్యాప్తు బృందం వారు నివసించే చోటే విచారించాల్సి ఉంటుందని అన్నారు. ఈ నిబంధన మేరకు తనను విచారించాలనుకుంటే సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామంలోని తన నివాసానికి రావాలని పోలీసులకు సూచించారు. అధికారుల వీలును బట్టి మరో తేదీని ఖరారు చేయాలని, ముందస్తు నోటీసుతో తన నివాసానికి వచ్చి విచారణ జరపవచ్చని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేశానని, ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్నానని కేసీఆర్ తన లేఖలో నొక్కి చెప్పారు. ఈ దేశపు బాధ్యతాయుతమైన పౌరుడిగా దర్యాప్తుకు తన పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా దర్యాప్తు సంస్థలు అడిగే ప్రశ్నలకు సమాధానమిచ్చేందుకు తాను సిద్ధమని, అయితే అది చట్టం కల్పించే వెసులుబాటు మేరకు తన ఇంట్లోనే జరగాలని ఆయన కోరారు. భవిష్యత్‌లో నోటీసులు ఏవైనా ఉంటే తన ఎర్రవల్లి నివాసానికే పంపాలని సూచించారు.

# రిజిస్ట్రేషన్ల శాఖలో కీలక మార్పులు




**నిజామాబాద్ :** తెలంగాణ రిజిస్ట్రేషన్ల శాఖలో దశాబ్దాల నాటి పాత పద్ధతులకు ప్రభుత్వం స్వస్తి పలికింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఎత్తైన గద్దెలపై కూర్చునే సంప్రదాయాన్ని రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై అధికారులు సామాన్యుల తరహాలోనే నేలపై టేబుల్, కుర్చీ వేసుకుని విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రజలకు, అధికారులకు మధ్య దూరాన్ని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే.. అద్దె భవనాల్లో నడుస్తున్న కార్యాలయాలను తక్షణమే ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని కేంద్రాల్లో ఇప్పటికే గద్దెలను తొలగించి, సొంత భవనాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేశారు.తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పాత సంప్రదాయాలకు స్వస్తి పలుకుతూ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉన్నతాధికారుల హోదాను ప్రదర్శించే గద్దె సంప్రదాయాన్ని రద్దు చేయడంతో పాటు.. అన్ని కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోకే తరలించాలని నిర్ణయించింది. ప్రజలకు, అధికారులకు మధ్య దూరాన్ని తగ్గించి పారదర్శకమైన పాలన అందించడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశం.రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ కూర్చునే చోట ఒక ఎత్తైన గద్దెను నిర్మించి.. దాని చుట్టూ ఎరుపు రంగు వస్త్రం కప్పడం బ్రిటిష్ కాలం నాటి ఆచారంగా వస్తోంది. డాక్యుమెంట్ల పరిశీలన సమయంలో అధికారులు ఎత్తులో కూర్చోవడం వల్ల సామాన్య ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమైంది. దీనిపై స్పందించిన రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హన్మంతు, రెండు వారాల క్రితమే కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ఇకపై సాధారణ టేబుల్, కుర్చీ వేసుకుని నేలపైనే కూర్చొని విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో ఇప్పటికే ఈ గద్దెలను తొలగించారు.రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల వల్ల ఖజానాపై భారీగా భారం పడుతోంది. దీనిని నివారించేందుకు ఇకపై ఏ శాఖా కార్యాలయం కూడా అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, భీమ్‌గల్ వంటి పలు ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లోనే నడుస్తున్నాయి. వీటన్నింటికీ ప్రభుత్వ భవనాలను కేటాయించాలని జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన ఇప్పటికే కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ భవనాల్లోకి మారడం వల్ల కేవలం అద్దె ఆదా అవ్వడమే కాకుండా.. ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించే వీలుంటుంది. పార్కింగ్ సమస్యలు, వెయిటింగ్ హాల్స్ లేకపోవడం వంటి ఇబ్బందులకు తావుండదు. నిజామాబాద్ అర్బన్ వంటి కొన్ని చోట్ల సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరుగుతున్నప్పటికీ.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ.. డిజిటల్ సేవలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. కార్యాలయాల తరలింపు పూర్తయితే సామాన్యులకు సేవలు మరింత వేగంగా అందుతాయని భావిస్తున్నారు.

## ముగిసిన మేడారం జాతర

-మొదటిపేజీ తరువాయి

పుణ్యస్నానాలు చేసి పులకించారు. చివరిరోజు కావడంతో భక్తులతో మేడారం కిటకిటలాడుతోంది. ఈ నెల 28న వనం వీడి జనంలోకి వచ్చిన వనదేవతలు ఇవాళ మళ్లీ వారివారి స్థానాలకు చేరుకున్నారు. రేపు ఆదివారం కావడంతో మేడారంలో రేపు కూడా రద్దీ కొనసాగనుంది.

## మోదీ ప్రభుత్వంతో సయోధ్య కోరుకుంటున్నాం

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంతో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సయోధ్య కోరుకుంటోందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించేలా రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమేం కావాలో ఎప్పటి నుంచో అడుగుతున్నామని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతున్నామని అన్నారు. తెలంగాణ పట్ల ప్రధాని నరేంద్ర మోదీ చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. గతంలో తెలంగాణ పుట్టుకనే ఆయన అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి ఏమీ అడగబోమని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారం ప్రదర్శించిందని, తాము మాత్రం సఖ్యత కోరుకుంటున్నామని అన్నారు. బడ్జెట్‌లో తమ ప్రతిపాదనలకు కేంద్రం అంగీకరించాల్సిందేనని స్పష్టం చేశారు. భారత ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నిలిచిపోయిన ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలపాలని అన్నారు.

## అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దు

-మొదటిపేజీ తరువాయి

చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## పురపోరులో 'రియల్' గురి

-మొదటిపేజీ తరువాయి

సమాచారం. ఎన్నికల్లో నేరుగా పోటీ చేసి గెలవకపోయినా, రిజర్వేషన్ విధానం ప్రకారం ఛైర్మన్ పదవులు దక్కించుకోవచ్చన్న లెక్కలతో చాలామంది వ్యాపారులు ముందడుగు వేస్తున్నారు. వార్డుల ఫలితాల ఆధారంగా బలమైన కౌన్సిలర్ల మద్దతు సాధిస్తే, తర్వాత ఛైర్మన్ ఎన్నికలో కీలక పాత్ర పోషించవచ్చన్నది వారి వ్యూహం. అందుకే ఇప్పటి నుంచే అన్ని విధాలా సిద్ధమవుతూ రాజకీయ సమీకరణాలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**తాండూరులో హడావుడి**

తాండూరులో ఒక ప్రముఖ స్థిరాస్తి వ్యాపారి ఎన్నికల గోదాలోకి దిగకముందే తన వ్యూహాన్ని అమలు చేశారు. పోటీ చేయనున్న వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి, స్థానిక సమస్యలపై చర్చించారు. ఓటు బ్యాంకు ఉన్న నాయకులను గుర్తించి వారికి తాయిలాలు ముట్టజెప్పినట్లు ప్రచారం సాగుతోంది. ఇదే పట్టణంలో ప్రధాన పార్టీ అభ్యర్థికి దీటుగా మరో పార్టీ నుంచి స్థిరాస్తి వ్యాపారి బరిలోకి దిగుతున్నారని సమాచారం. దీంతో తాండూరులో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది.

**వికారాబాద్‌లో ఖర్చుల భారం**

వికారాబాద్ పట్టణంలో కొన్ని వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులను స్థిరాస్తి వ్యాపారులు భరిస్తున్నారన్న ప్రచారం జోరుగా వినిపిస్తోంది. ప్రచారం, సభలు, వాహనాలు, కార్యకర్తల నిర్వహణ వంటి అంశాలకు భారీగా ఖర్చు అవుతుండటంతో అభ్యర్థులు వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. దీని ద్వారా వ్యాపారులు భవిష్యత్తులో పురపాలిక నిర్ణయాల్లో తమ మాట చెల్లుబాటు అయ్యేలా చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**కొడంగల్, పరిగిల్లోనూ అదే దృశ్యం**

కొడంగల్, పరిగి పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కొన్నిచోట్ల వ్యాపారులు స్వయంగా పోటీ చేస్తుండగా, మరికొన్నిచోట్ల అనుచరులను బరిలోకి దింపుతున్నారు. స్థానిక రాజకీయ నాయకులతో పొత్తులు పెట్టుకుని, గెలుపు కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు పురపాలిక రాజకీయాలపై స్థిరాస్తి రంగం ఎంత ప్రభావం చూపుతోందో సూచిస్తున్నాయి.

**హైదరాబాద్‌తో బలమైన అనుసంధానం**

వికారాబాద్ జిల్లా పురపాలికలకు హైదరాబాద్‌తో ఉన్న అనుసంధానం స్థిరాస్తి వ్యాపారుల రాజకీయ ఆసక్తికి ప్రధాన కారణంగా మారింది. హైదరాబాద్ నుంచి 78 నుంచి 119 కిలోమీటర్ల దూరంలోనే ఈ పట్టణాలు ఉన్నాయి. రాజధాని పరిసరాల్లో ఎకరం భూమి ధర రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా, ఈ పురపాలికల సమీపంలోని భూములు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు మాత్రమే ఉన్నాయి. ఈ ధరల తేడానే పెట్టుబడిదారులను ఇక్కడికి ఆకర్షిస్తోంది. హైదరాబాద్ వ్యాపారులు స్థానికులతో కలిసి భూములు కొనుగోలు చేసి, వెంచర్లు అభివృద్ధి చేసి భారీ లాభాలు పొందుతున్నారు.

**అనుచరుల గెలుపే లక్ష్యం**

కొందరు స్థిరాస్తి వ్యాపారులు నేరుగా ఎన్నికల్లో పోటీ చేయకుండా, వెనకుండి తంతు నడుపుతున్నారు. తమకు నమ్మకమైన అనుచరులను బరిలోకి దింపి, అవసరమైన ఆర్థిక వనరులను సమకూరుస్తున్నారు. అనుచరులు గెలిచిన తర్వాత కీలక సందర్భాల్లో ఛైర్మన్ అభ్యర్థికి మద్దతు ఇచ్చి, భవిష్యత్తులో పురపాలిక ద్వారా లాభాలు పొందాలన్నది వారి ఆలోచన.

**రాజకీయాలపై వ్యాపార ముద్ర**

మొత్తంగా చూస్తే, వికారాబాద్ జిల్లా పురపాలిక ఎన్నికల్లో స్థిరాస్తి వ్యాపారుల ప్రభావం ఈసారి మరింత పెరిగింది. రాజకీయాలు, వ్యాపారం ఒకదానితో ఒకటి ముడిపడుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, భవిష్యత్తులో పురపాలికల పాలనపై స్థిరాస్తి రంగం ఎంత ప్రభావం చూపుతుందన్నది మాత్రం ఆసక్తికరంగా మారింది.

## రోడ్ మ్యాప్ రెడీ చేస్తున్న కవిత


**హైదరాబాద్ :** తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూతురు కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. శాసనమండలిలో ప్రసంగించిన కవిత..ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నా..శక్తిగా తిరిగి చట్టసభల్లో అడుగు పెడతానంటూ శపథం చేసి వెళ్లారు. అసెంబ్లీ ముందున్న గన్ పార్క్‌లో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి.. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తానని ఆమె ప్రకటించారు.మరోవైపు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ ద్వారానే పోటీ చేస్తామని కవిత చెబుతూ వస్తున్నారు. తాను పెట్టబోయే పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేస్తానని కవిత ప్రకటించారు. రాజకీయ పార్టీ ఏర్పాటు ఆలస్యం అవుతుండటంతో..ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు కవిత.బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమం పేరుతో జిల్లాల పర్యటన చేస్తున్నారమె. మాజీ సీఎం జయలలితను గుర్తు చేసేలా..ఏకంగా కట్టు, బొట్టు అంతా లుక్‌నే మార్చేసి..జిల్లాల టూర్ చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ టార్గెట్ చేస్తూ కవిత ముందుకెళ్తున్నారు.ఇక ఇప్పుడు సొంత రాజకీయ పార్టీపై కవిత కసరత్తును వేగవంతం చేశారు. మెజార్టీ నేతలు తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చాలని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. మరికొందరు కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్టీలో టీఆర్ఎస్ వచ్చేలా చూడాలని కవితను కోరినట్టు సమాచారం. కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిన నేపథ్యంలో..పాత టీఆర్ఎస్‌ను కొత్త పార్టీలో ఉండేలా చూడాలని సూచించారట. అందరి అభిప్రాయాలు తీసుకున్న కవిత..మార్చిలోనే కొత్త రాజకీయపార్టీని ప్రకటించనున్నట్లు జాగృతి వర్గాల టాక్.ఇప్పటికే జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో మెజార్టీ జిల్లాలను చుట్టేసిన కవిత.. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని భావిస్తున్నారట. ఈ క్రమంలోనే ఫిబ్రవరి నెలాఖరులో మంచిర్యాలలో పెద్దఎత్తున జనం బాట ముగింపు సభను నిర్వహించాలని కవిత నిర్ణయించారు.మంచిర్యాల సభలో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించాలా, లేదంటే హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం దగ్గర ప్రకటించాలా అన్నదానిపై ఇంకా ఓ డెసిషన్‌కు రాలేదంటున్నారు.


# సడెన్‌గా కాఫీ తాగడం మానేస్తే.. శరీరంలో జరిగే మార్పులు



ప్రస్తుత రోజుల్లో పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది కాఫీ, టీ వంటి పానియాలను తాగుతూ ఉంటారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి జీవితంలో ఇవి ఒక భాగమైపోయాయి. అయితే కాఫీలో కెఫిన్ ఉంటుంది. దీన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. చాలా మంది మధ్య తరగతి వారికి టీ, కాఫీ అనేది కేవలం ఒక పానియం మాత్రమే కాదు.. ఇదొక ఎమోషన్. అలానే వారి డే మొత్తాన్ని సరిగ్గా నడిపించే ఇందనం. వీటిని మితంగా తీసుకుంటే ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. కెఫిన్ ఎక్కువగా తీసుకోవడం మన ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో చాలా మంది టీ, కాఫీ లాంటి అలవాట్లను తగ్గించుకోవాలని చూస్తున్నారు. కానీ సడెన్‌గా ఈ అలవాటును మానుకోవడం వల్ల వచ్చే సమస్యలను దృష్టిలో ఉంచుకొని చాలా మంది వెనక్కి తగ్గుతారు. ఫేమస్ డైటీషియన్, డయాబెటిస్ నిపుణుడు డాక్టర్ అర్చన బాత్రా ప్రకారం.. ఒకేసారి కాఫీ మానేయడం వల్ల మంచి జరగడం కంటే చెడే ఎక్కువ జరుగుతుందని అంటున్నారు. కెఫిన్ మన నాడీ వ్యవస్థకు ప్రోత్సహించడంతో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి అకస్మాత్తుగా దానిని ఆపడం వల్ల మెదడుకు రక్త ప్రవాహంలో మార్పులు వస్తాయి. దీని వల్ల మనం అనేక రకాల సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని చెబుతున్నారు. తీవ్రమైన తలనొప్పి: శరీరానికి తగినంత కెఫిన్ లభించనప్పుడు రక్త నాళాలు వ్యాకోచించడం జరుగుతుంది.. తర్వాత తలనొప్పి రావడం జరుగుతుంది. అలసట, నిద్రలేమి: సడెన్‌గా కాఫీ మానేడం వల్ల శరీరంలో కేఫిన్ పరిమాణం తగ్గి శరీరం దాని సహజ శక్తిని కనుగొనడంలో ఇబ్బంది పడుతుంటుంది. దీని వల్ల నిద్రలేమి సమస్యలు, ఎప్పుడూ అలసటగా అనిపించడం జరుగుతుంది. మానసిక స్థితి మార్పులు: సడెన్‌గా కాఫీ మానేయడం వల్ల మీరు మానసికంగా సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. అంటే అనవసరైమన ఆందోళన, ఏకాగ్రత కోల్పోవడం.. దేనిపై సరిగ్గా దృష్టిపెట్టలేకపోవచ్చు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు మీరు రోజుకు నాలుగు కప్పుల కాఫీ తాగితే, దాన్ని సడెన్‌గా తగ్గించకుండా.. మెల్లమెల్లగా తగ్గిస్తూ రండి. అంటే మొదటి వారంలో మూడు, రెండో వారంలో రెండు, చివరకు ఒకటి ఇలా నెమ్మదిగా కాఫీని తగ్గించండి. ఇలా చేసే సందర్భంగా మీ శరీరంలో కెఫిన్ శాతం తగ్గుతుంది. కాబట్టి మీరు శరీరాన్ని హైడ్రేడ్‌గా ఉంచడం చాలా ముఖ్యం. ఇందుకోసం మీరు పుష్కలంగా నీరు తాగడం అలవాటు చేసుకోండి. కాఫీకి బదులుగా, మీరు తక్కువ కెఫిన్ కంటెంట్ ఉన్న గ్రీన్ టీ లేదా హెర్బల్ టీని అలావాటు చేసుకోండి. ఇలా మీరు క్రమం తప్పకుండా వీటిని పాటిస్తే.. ఎలాంటి సమస్యలు లేకుండా కాఫీని మానేవచ్చు.


# అరటిపండ్లు, ఖర్జూరం తక్షణ శక్తి కోసం ఏది తినాలి?





అలసటను వదిలించుకోవడానికి వ్యాయామం, త్వరగా శక్తిని పొందడానికి చాలా మంది అరటిపండ్లు లేదా ఖర్జూరాలు తీసుకుంటూ ఉంటారు. కానీ వీటిలో ఏది ఉత్తమమో, ఏ సమయంలో ఏది తినాలో తప్పక తెలుసుకోవాలి. తద్వారా మీరు రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరిలో అలసట, బలహీనత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ సమస్య ఉదయం నిద్రలేచిన వెంటనే ప్రారంభమైతే.. మళ్లీ రాత్రి నిద్రపోయే వరకు ఉంటుంది. దీనికి అనేక కారణాలు ఉన్నప్పటికీ అటువంటి సమస్యల నుంచి బయటపడటానికి సులభమైన మార్గాన్ని నిపుణులు చెబుతున్నారు. అదేంటంటే.. ఈ అలసటను వదిలించుకోవడానికి వ్యాయామం, త్వరగా శక్తిని పొందడానికి చాలా మంది అరటిపండ్లు లేదా ఖర్జూరాలు తీసుకుంటూ ఉంటారు. కానీ వీటిలో ఏది ఉత్తమమో, ఏ సమయంలో ఏది తినాలో తప్పక తెలుసుకోవాలి. తద్వారా మీరు రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. ఒక అరటిపండులో దాదాపు 105 కేలరీలు ఉంటాయి. ఇందులో కార్బోహైడ్రేట్లు, పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. అరటిపండ్లతో పోలిస్తే, ఖర్జూరం కేలరీలు ఎక్కువగా ఉంటాయి. కేవలం మూడు లేదా నాలుగు ఖర్జూరాలు తినడం వల్ల మీకు 90 నుంచి 120 కేలరీల శక్తి లభిస్తుంది. అంతే కాదు వాటిలో ఫైబర్, ఐరన్, మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటాయి. ఎక్కువసేపు వ్యాయామం చేయాలనుకునేవారికి లేదా రోజంతా ఉత్సాహంగా పనిచేయాలనుకునే వారికి, అరటిపండ్లు మంచివి. వాటిలోని ఫైబర్ చక్కెరను నెమ్మదిగా రక్తంలోకి విడుదల చేస్తుంది. తద్వారా ఎక్కువ సమయం శక్తిని అందించడానికి సహాయపడుతుంది. వ్యాయామం తర్వాత అలసిపోయినా లేదా నీరసంగా అనిపించినా తక్షణ శక్తి కోసం ఖర్జూరం తినడం మంచిది. ఎందుకంటే వాటిలో అధిక మొత్తంలో సహజ చక్కెర ఉంటుంది. శరీరానికి వెంటనే గ్లూకోజ్‌ను అందిస్తుంది. అందుకే ఉపవాసం ఉన్నవారు ఖర్జూరాన్ని తినేందుకు ఇష్టపడతారు. కానీ డయాబెటిస్ ఉన్నవారు వీలైనంత వరకు ఖర్జూర వినియోగాన్ని నియంత్రించుకోవాలి. కండరాల తిమ్మిరితో బాధపడేవారు కూడా ఖర్జూరం తినవచ్చు. ఇందులో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది కండరాలు త్వరగా కోలుకోవడానికి సహాయపడుతుంది.

# రాత్రి లైట్ వేసుకుని పడుకుంటున్నారా?



మీకు రాత్రిపూట లైట్లు వెలిగించి నిద్రపోయే అలవాటు ఉందా? చీకటి అంటే భయంతోనో లేదా అజాగ్రత్తతోనో లైట్లు ఆర్పకుండా పడుకుంటున్నారా? అయితే మీరు ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నట్లే.. రాత్రిపూట వెలుతురులో నిద్రపోవడం వల్ల కేవలం నిద్రలేమి మాత్రమే కాదు.. ఊబకాయం, గుండె జబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్లు కూడా వచ్చే ముప్పు ఉందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. రోజంతా కష్టపడి పనిచేశాక.. హాయిగా నిద్రపోతేనే కదా రేపటి పనులకు శరీరం సిద్ధమయ్యేది.. కానీ చాలామంది రాత్రిపూట లైట్లు వెలిగించి నిద్రపోతుంటారు. చీకటి అంటే భయంతోనో లేదా భద్రతా కారణాలతోనో ఈ అలవాటును కొనసాగిస్తుంటారు. అయితే ఈ చిన్న అలవాటు మీ ప్రాణాల మీదకు తెస్తుందని మీకు తెలుసా..? రాత్రిపూట వెలుతురులో నిద్రపోవడం వల్ల ఊబకాయం నుంచి క్యాన్సర్ వరకు అనేక ముప్పులు ఉన్నాయని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. మంచి నిద్ర కేవలం విశ్రాంతి మాత్రమే కాదు.. అది ఆరోగ్యానికి పునాది. మనం నిద్రపోతున్నప్పుడే మన శరీరం, మనస్సు దెబ్బతిన్న కణాలను సరిచేసుకుంటాయి. సరిగ్గా నిద్ర లేకపోతే చిరాకు, మానసిక ఒత్తిడి కలగడమే కాకుండా.. దీర్ఘకాలంలో గుండె జబ్బులు, మధుమేహం, ఆందోళన వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. మన శరీరంలో సిర్కాడియన్ రిథమ్ అనే ఒక సహజ గడియారం ఉంటుంది. చీకటి పడగానే మన శరీరం మెలటోనిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇది మనల్ని గాఢ నిద్రలోకి తీసుకెళ్తుంది. కానీ రాత్రిపూట ప్రకాశవంతమైన వైట్ లైట్లు లేదా మొబైల్ నుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల ఈ హార్మోన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఫలితంగా నిద్ర నాణ్యత తగ్గి, హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. వెలుతురులో నిద్రించడం వల్ల శరీర మెటబాలిజం తగ్గి బరువు పెరుగుతారు. మాటిమాటికీ మేల్కొలుపు రావడం వల్ల నిద్రలేమి సమస్య వేధిస్తుంది. మెలటోనిన్ స్థాయిలు తగ్గడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.ఒకవేళ చీకటిలో నిద్రపోలేకపోతే.. మృదువైన పసుపు లేదా ఆరెంజ్ రంగు లైట్లను వాడండి. ఇవి నిద్రపై తక్కువ ప్రభావాన్ని చూపుతాయి. నేటి వేగవంతమైన జీవితంలో నిద్రను నిర్లక్ష్యం చేయకండి. రాత్రిపూట లైట్లు ఆర్పడం అనే ఒక చిన్న మార్పు మీ ఆరోగ్యాన్ని ఎంతో మెరుగుపరుస్తుంది.



# గుండె సమస్యల్ని దూరం చేసే స్ట్రాబెర్రీస్

మనం రోజూ తీసుకునే పసుపు, మిరియాలు, ఆకుకూరలు, క్యారెట్స్, నెయ్యి, అరటిపండ్లు, పల్లీలు ఇవన్నీ కూడా మన అనారోగ్య సమస్యల్ని దూరం చేసి ఆరోగ్యాన్ని కాపాడేవే. అందుకోసమే, కచ్చితంగా వీటిని తీసుకోవాలి. అయితే, తీసుకున్నంత మాత్రాన అవి సరైన విధమైన రిజల్ట్ చూపిస్తుందని లేదు. ఎందుకంటే, అవి హెల్దీ ఫుడ్స్ అయినప్పటికీ వాటిని సరైన విధంగా తీసుకుంటేనే మనం అనుకున్న ఫలితాలని అందిస్తుంది. అందుకోసం ఏయే ఫుడ్స్‌ని ఎలా తీసుకోవాలో హెల్త్ కోచ్ మిరుణ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేస్తున్నారు. పసుపు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలతో పాటు మరెన్నో పోషకాలు ఉంటాయి. అందుకే, దీనిని మన వంటల్లోనూ భాగం చేయడమే కాకుండా ఆయుర్వేదంలోనూ వాడుతుంటారు. అయితే, ఈ పసుపులోని గుణాలన్నింటిని అందుకోవాలంటే మాత్రం పసుపుని నల్ల మిరియాల పొడితో కలిపి తీసుకోవాలి. దీంతో పసుపులోని కర్కుమిన్ అనేది మన శరీరానికి చక్కగా అందుతుంది. ఇది పవర్‌ఫుల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పనిచేసి జాయింట్ పెయిన్స్, కీళ్ళ నొప్పుల వంటివన్నీ దూరమవుతాయి. కాబట్టి, పసుపుని మనం తీసుకున్నప్పుడు అందులో కొద్దిగా మిరియాల పొడిని కలిపి తీసుకోండి. ఇలా తీసుకుంటే దాని పనితీరు 2వేల శాతం పెరుగుతుందట. దీని వల్ల బాడీలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గి నొప్పులు చాలా వరకూ దూరమవుతాయి. క్యారెట్స్ తింటే కళ్ళకి మంచిది. ఇంకా ఎన్నో లాభాలు. అయితే, వీటిని మనం హెల్దీ ఫ్యాట్స్‌తో కలిపి వండి తీసుకున్నప్పుడే ఆ బెనిఫిట్స్ మనకి లభిస్తాయి. అందుకోసం క్యారెట్స్‌ని మనం ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనె, నెయ్యి వంటి హెల్దీ ఫ్యాట్స్‌తో కలిపి వండడం మంచిది. దీంతో క్యారెట్స్‌లోని బీటా కెరోటిన్ బాడీకి అందుతుంది. దీంతో కంటి చూపుకి హెల్ప్ అవ్వడమే కాకుండా చర్మం కూడా ఆరోగ్యంగా మారుతుంది. అరటిపండ్లు, పల్లీలు రెండూ మంచివే. అయితే, వీటిని విడివిడిగా తీసుకునే బదులు కలిపి తీసుకుంటే మంచిది. వీటి కాంబినేషన్ మంచి ప్రోటీన్ రిచ్‌గా మారుతుంది. ఎవరైతే బరువు పెరగాలనుకుంటారో అలాంటి వారు ఈ రెండింటిని కలిపి తీసుకుంటే మంచి రిజల్ట్ ఉంటుంది. అంతేకాకుండా, మజిల్స్ కూడా బాగా పెరుగుతాయి. అదే విధంగా, విటమిన్ సి కోసం ఉసిరిని మన డైట్‌లో యాడ్ చేస్తుంటారు. వీటిని నేరుగా అలానే తీసుకోవడం కంటే తేనెతో కలిపి తీసుకోవాలి. దీంతోపాటు, కొద్దిగా మిరియాల పొడి కలిపి చూడండి. అప్పుడు ఇది సూపర్‌ఫుడ్‌గా మారి బ్రెయిన్ ఫోకస్ పెరిగేలా చేస్తుంది. జ్ఞాపకశక్తిని కూడా పెంచుతుంది. స్ట్రాబెర్రీస్ తీసుకోవడం వల్ల మన బాడీకి యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా అందుతాయి. అయితే, వాటిని నేరుగా తీసుకోవడం కంటే డార్క్ చాక్లెట్‌తో కలిపి తీసుకోవడం మంచిది. దీంతో మనకి యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్ అంది బ్లడ్ ప్రెజర్ తగ్గుతుంది. దీంతో గుండె పనితీరు మెరుగ్గా మారుతుంది. కాబట్టి, ఎప్పుడైనా సరే డార్క్ చాక్లెట్‌ని స్ట్రాబెర్రీస్‌తో కలిపి తీసుకోండి.

ధర్మఘంట

# రంగారెడ్డిలో పీఠం...నీదా... నాదా...






**రంగారెడ్డి :** మున్సిపల్ పీఠం నీదా నాదా అన్నట్లుగా ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రచారం ప్రారంభిం చాయి. జిల్లాలోని వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల నుండి కౌన్సిలర్ పోటీ చేసేందుకు అభ్యర్థుల నుండి పెద్ద మొత్తంలో డిమాండ్ ఉండటంతో ఈ రెండు పార్టీలు టికెట్లు కేటాయించే విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. నామినేషన్ల ఘట్టం ముగిసిన కూడా ఇంకా ఎవరికీ అధికారికంగా టికెట్లు కేటాయిస్తునట్లు చెప్పలేదు. కొన్ని చోట్ల మాత్రం ప్రచారం ప్రారంభించుకోవాలని ఆశావాహులకు సూచిస్తున్నారు. మునిసిపల్ ఎన్నికల్లో బిజెపి, ఎంఐఎం పార్టీలు కూడా తమ బలాన్ని చూపించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. గత ఎన్నికల్లో గెలిచిన బిజెపి అభ్యర్థులకు ఈసారి తిరిగి టికెట్ ఇచ్చి గెలిపించుకోవడంతో పాటు జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీ లో కౌన్సిలర్ సీట్లను ఘననీయంగా పెంచుకోవాలని బిజెపి అధిష్టానం స్థానిక నాయకులను ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు బిజెపి ప్రయత్నాలు ప్రారంభించింది. ఇక ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రతి చోట ఎంఐఎం అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవాలని ఎంఐఎం అభ్యర్థులు వ్యూహాలు పన్నుతున్నారు. మున్సిపల్ పీఠాన్ని ఆశిస్తున్న ప్రధాన పార్టీలకు మన తోడు తప్పనిసరి అయ్యేలా సీట్లు సాధించాలనే ప్రయత్నంలో ఎంఐఎం నాయకులు ఉన్నారు. వికారాబాద్ మునిసిపల్ చైర్మన్ పీఠం ఈసారి ఎవరు దక్కించుకుంటారనే దానిపై ఓటర్లు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. వికారాబాద్ మునిసిపల్ మొత్తం 34 వార్డులు ఉండగా 58, 117 మంది ఓటర్లు ఉన్నారు. 2020లో వికారాబాద్ మునిసిపల్ చైర్మన్ జనరల్ మహిళకు కేటాయించగా ఈ దఫా ఎస్సీ మహిళకు కేటాయించారు. వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఎస్సీ ఉండటంతో ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ల సన్నిహితుల్లో ఎవరో ఒకరికి ఈ పదవి దక్కనుందని ప్రచారం జరుగుతుంది. చైర్మన్ పదవి దక్కించుకోవడం ఇద్దరూ నాయకులకు సవాలుగా మారిందికాంగ్రెస్ పార్టీ తరపున చైర్మన్ రేసులో స్పీకర్ కుమార్తె అనన్య ఉన్నట్లు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చా రు. బీఆర్ఎస్ నుండి చైర్మన్ రేస్ లో ఎవరున్నారనే విషయంపై ఇంకా తుది నిర్ణయానికి రాలేదు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత పోటీలో ఉంటున్నట్లు ప్రచారం జరుగుతున్నా అధికారికంగా ఎక్కడ ప్రకటించడం లేదు. అయితే బిఆర్ఎస్ ప్రకటించే చైర్మన్ అభ్యర్థి ఎవరనే దానిపైనే గెలుపోటములు నిర్ణయించబడతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతు న్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వికారాబాద్ బిఆర్ఎస్ చైర్మన్ గిరిని దక్కించుకోగా తదనంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల కారణంగా చైర్మన్ అభ్యర్థి హస్తం చెంతకు చేరింది.జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలలో తాండూర్ పెద్ద మున్సిపాలిటీ 36 వార్డులు ఉండగా 77,110 మంది ఓటర్లు ఉన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జరిగిన రెండుసార్లు మున్సిపల్ ఎన్నికల్లో ఇక్కడ మహిళలే చైర్మన్ పీఠంపై కూర్చున్నారు. ఈసారి మాత్రం బీసీ జనరల్ కావడంతో అధికార ప్రతిపక్ష పార్టీల నుండి చైర్మన్ ఆశావాహుల సంఖ్య భారీగా ఉంది. తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గం జనరల్ ఉండటంతో అధికార ప్రతిపక్షాల మధ్య ఎప్పుడు రాజకీయ ఆధిపత్య పోరు కొనసాగుతుంది. ఇక్కడ అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ తో పాటు బిజెపి, ఎంఐఎంల కు కూడా బలమైన క్యాడర్ ఉంది. 2020 మునిసిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పదికి పైగా కౌన్సిల్ స్థానాలు గెలిచి అధికార పార్టీకి చెమటలు పట్టించింది.మునిసిపల్ ఎన్నికలను కూడా ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గత రెండుసార్లు బీఆర్ఎస్ బల్దియా పీఠాన్ని దక్కించుకోవడంతో ఈసారి కూడా విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాలని చూస్తున్నారు. అయితే అధికార కాంగ్రెస్ మాత్రం ఎలాగైనా మునిసిపల్ చైర్మన్ పదవిని అస్తగతం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. కాంగ్రెస్ తరపున చైర్మన్ రేస్ లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. బిఆర్ఎస్ నుండి మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింలు, బిజెపి నుండి యు. రమేష్ కుమార్లు పోటీలో ఉన్నారు. వీరిలో చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.కొడంగల్ మున్సిపల్ 12 వార్డులు, 27,614 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ చైర్మన్ జనరల్ కావడంతో అధికార కాంగ్రెస్ లో పోటీ తీవ్రంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఎవరు చైర్మన్ అయినా అభివృద్ధి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆశతో అభ్యర్థులు ఉన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ నుండి తాజా మాజీ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి మరోసారి చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్నారు. ఆయన మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డి తనయుడు కావడం కొంత కలిసి వచ్చే అవకాశం ఉంది.ఆయనతో పాటు మరో సీనియర్ నాయకుడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ గుప్తా చైర్మన్ పీఠాన్ని బలంగా ఆశిస్తున్నారు. ఈయనకు కూడా రాజకీయ నేపథ్యం ఉంది. ప్రశాంత్ గుప్తా తాత నంద్యాల వెంకటయ్య చిన్నాన్న నందారం సూర్యనారాయణ ఇద్దరు గతంలో కొడంగల్ ఎమ్మెల్యేలుగా పని చేసిన వారే. జగదీశ్వర్ రెడ్డి, ప్రశాంత్ గుప్తలు ఇద్దరు కాంగ్రెస్ వారే కావడంతో అధిష్టానం ఎవరి వైపు ముగ్గు చూపుతుందో వేచి చూడాల్సి ఉంది. బీఆర్ఎస్ నుండి చైర్మన్ పోటీలో ఎవరున్నారనే విషయంపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు.పరిగి మునిసిపాలిటీ ఈసారి బీసీ జనరల్ కు కేటాయించబడింది. ఈ మునిసిపాలిటీలో 18 వార్డులు ఉండగా 27,614 మంది ఓటర్లు ఉన్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఈసారి స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఎలాగైనా పరిగి మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే పట్టుదలతో ఉన్నారు. గెలిచే అవకాశం ఉన్న నాయకులకే కౌన్సిలర్ టికెట్లు ఇస్తున్నట్లు స్థానిక నాయకులు చెబుతున్నారు. గెలుపు వ్యూహం లో భాగంగానే చైర్మన్ అభ్యర్థి ఎవరనే విషయాన్ని గోప్యంగా ఉంచి ఎన్నికలకు పోతున్నారు. ఇది ఇలా ఉండగా బీఆర్ఎస్ పార్టీ సైతం రెండోసారి మున్సిపల్ పీఠాన్ని దక్కించుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు ప్రారంభించింది. బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థిగా చివన్నోళ భాస్కర్ ను ప్రకటించి ఇప్పటికే ఎన్నికల ప్రచారం ప్రారంభించింది.

# డేంజర్‌లో మేడిగడ్డ



**కరీంగనర్ :** దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జలాశయాల జాబితాలో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీ చేరినట్లు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ 2025 తనిఖీల ఆధారంగా దీనిని కేటగిరీ–1 అత్యంత ప్రమాదకరం కింద వర్గీకరించింది. మేడిగడ్డతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. మరమ్మతులు తక్షణమే చేపట్టకపోతే భద్రతకు పెను ముప్పు పొంచి ఉందని కేంద్రం హెచ్చరించింది. దేశవ్యాప్తంగా 50 ఏళ్లు దాటిన డ్యామ్‌లు 1,681 ఉన్నాయని, డ్యామ్ సేఫ్టీ యాక్ట్–2021 ప్రకారం వీటిపై రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించింది.దేశవ్యాప్తంగా ఉన్న జలాశయాల భద్రతపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో కీలక గణాంకాలను వెల్లడించింది. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న మొదటి మూడు డ్యామ్‌ల జాబితాలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. లోక్‌సభలో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) 2025 వర్షాకాలం తర్వాత నిర్వహించిన తనిఖీల్లో మూడు ప్రధాన జలాశయాలను 'కేటగిరీ–1' (అత్యంత ప్రమాదకరం) కింద వర్గీకరించారు. అందులో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీ, ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి డ్యామ్, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీ.ఈ జలాశయాల భద్రత విషయంలో తక్షణమే నివారణ చర్యలు , మరమ్మతులు చేపట్టకపోతే భారీ రిస్క్ పొంచి ఉందని కేంద్రం స్పష్టం చేసింది. మేడిగడ్డ విషయంలో తలెత్తిన లోపాలను సరిదిద్దేందుకు మరియు బ్యారేజీ రక్షణ కోసం ఎన్‌డీఎస్‌ఏ సూచించిన జాగ్రత్తలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది.డ్యామ్ సేఫ్టీ యాక్ట్–2021 ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలం ముందు మరియు తర్వాత జలాశయాల భద్రతను తనిఖీ చేయడం తప్పనిసరి. 2025లో వర్షాకాలం ముందు 6,524 డ్యామ్‌లను, వర్షాకాలం తర్వాత 6,553 డ్యామ్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. భారతదేశంలో ప్రస్తుతం 50 ఏళ్లు పైబడిన జలాశయాలు 1,681 ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఇవి కాలం చెల్లిన నిర్మాణాలు కావడంతో వీటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.గతంలో మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగిపోవడం, పగుళ్లు రావడం వంటి ఘటనల నేపథ్యంలో కేంద్ర నిపుణుల కమిటీ పర్యవేక్షణ కొనసాగుతోంది. కేటగిరీ–1 కింద వర్గీకరించడమంటే.. నిర్మాణ పరంగా అది తీవ్రమైన వైఫల్యాలను ఎదుర్కొంటోందని అర్థం. మరమ్మతులలో జాప్యం జరిగితే దిగువన ఉన్న గ్రామాలపై దాని ప్రభావం పడే అవకాశం ఉంటుంది. జలాశయాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిరంతర పర్యవేక్షణ ఉండాలని కేంద్రమంత్రి సూచించారు

## హౌసింగ్ కార్పొరేషన్ కు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల బాధ్యత



**ఖమ్మం :** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోన్న సర్కార్.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని భావిస్తోంది. ఈ మేరకు అన్ని డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలోకి బదిలీ చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు తాజాగా జారీ అయ్యాయి.తెలంగాణలోని పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రతిష్ఠాత్మక పథకాలు అమలు చేస్తోంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల గూడు కోసం రూ. 5 లక్షలు ఆర్థిక సాయం చేస్తోంది. అన్ని నియోజకవర్గాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ఊపందుకుంది. మరో రెండు, మూడు నెలల్లో తొలిదశ ఇండ్ల అందుబాటులోకి రానున్నాయి. ఇక రాష్ట్రంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలపైనా సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వివిధ ఇంజనీరింగ్ శాఖల పర్యవేక్షణలో ఉన్న అన్ని డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను ఇక నుంచి తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలోకి బదిలీ చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఆయా డబుల్ బెడ్ రూం ఇండ్లను మరింత వేగంగా నిర్మాణాలు చేపట్టే విధంగా.. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా రేవంత్ సర్కార్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి జీవో ఎంఎస్ నంబర్ 5ను శుక్రవారం విడుదల చేశారు. గత ప్రభుత్వ హయంలో ఇతర ఇంజనీరింగ్ శాఖలకు అప్పగించిన అన్ని డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను తక్షణమే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ స్వాధీనం చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు.ఈ మేరకు అన్ని జిల్లాల్లో ఉన్న డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను ప్రస్తుత ఏజెన్సీల నుంచి సంబంధిత హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లకు ( పీడీలు) బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రాజెక్టులను బదిలీ చేసే బాధ్యతను జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అప్పగించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పూర్తి, కేటాయింపు ప్రక్రియలో గతేడాది మార్చి 22న విడుదల చేసిన జీవో నంబర్ 33లోని పూర్తి మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశిం చింది. ఈ ప్రక్రియపై తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటుగా జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

**రాజన్న సిరిసిల్ల :** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో ముఖ్యాతిథులుగా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్ర చారి, సిఐ కృష్ణ,ఎస్ఐ లు పాల్గొని సిరిసిల్ల పట్టణంలో సుమారు 2000 మంది ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో మెగా ర్యాలీ నిర్వహించడం జరిగినాది జిల్లా రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవం జనవరి ఒకటవ తారీఖు నుండి 31 తారీకు వరకు జరిపిన కార్యక్రమాలలో చివరి రోజున పట్టణంలోని వివిధ పాఠశాల నుంచి సుమారు 2000 మంది విద్యార్థులతో బతుకమ్మ ఘాట్ నుండి పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు రోడ్డు భద్రతకు సంబంధించి ప్లే కార్డులు పట్టుకొని రోడ్డు భద్రత గురించి నినాదిలిస్తూ హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం వలన కలుగు ప్రాముఖ్యతలు వివరిస్తూ భారీ ర్యాలీ తీశారు. జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మద్యం సేవించి వాహనం నడపరాదని మొబైల్ మాట్లాడుతూ వాహనాన్ని ఎట్టి పరిస్థితుల్లో నడపరాదని కారు ఇతర వాహనాలు నడిపించే వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని ఓవర్ స్పీడ్ గా వెళ్లవద్దని తెలిపారు అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఈ దేశ భవిష్యత్తు పిల్లలేఅని రేపు రాబోయే తరంలో మీరంతా రోడ్డు ప్రమాదాలు జరగని రోడ్డు ఉండాలని తెలియజేస్తూ భావితరాలకు మీరే ఆదర్శం అని తెలిపారు. గత కొంతకాలంగా ఎక్కువగా రోడ్డు ప్రమాదాలతోనే చనిపోవడం జరుగుతుందని తెలిపారు. డి.ఎస్.పి మాట్లాడుతూ ర్యాలీ కి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి రోడ్డు మాది భవిష్యత్తు మాది అనే నినాదం చేసారు ఇలాంటి అవేర్నెస్ ప్రోగ్రాం ద్వారా అందరికీ తెలియజేసే బాధ్యత మీపై ఉంటుందని తెలిపారు.ర్యాలీ అనంతరం విద్యార్థులతో రోడ్డు పైన ఉన్న వాహనదారులతో రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటిస్తామని రవాణా శాఖ మోటార్ వాహనముల తనిఖీ అధికారి ప్రతిజ్ఞ చేపించారు కార్యక్రమానికి రవాణా శాఖ అధికారి వి. లక్ష్మణ్ సహాయక మోటారు వాహనంల తనిఖీ అధికారి రజని,పృథ్వీరాజ్ వర్మ, సిబ్బంది రమ్య, సౌమ్య, ప్రశాంత్,ఎల్లేష్, ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బంది రెండో

## విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

**ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఇంచార్జి కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్,మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణపరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ శనివారం పూర్తి చేశారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్,నోడల్ అధికారులు శ్రీనివాసాచారి జగన్ మోహన్ రెడ్డి జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, భారతి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## కోఠి ఎస్‌బీఐ ఏటీఎం వద్ద

## వ్యాపారిపై కాల్పుల కలకలం

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో సంచలనం సృష్టించిన కోఠి కాల్పుల ఘటనపై ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి కీలక వివరాలు వెల్లడించారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బట్టల వ్యాపారి రిన్షద్ మృతి చెందినట్లు ఆమె స్పష్టం చేశారు. నగరంలో పట్టపగలే జరిగిన ఈ దారుణ ఘటన వివరాలను ఆమె మీడియాకు వివరించారు.డీసీపీ శిల్పవల్లి కథనం ప్రకారం, నాంపల్లికి చెందిన బట్టల వ్యాపారి రిన్షద్, రూ.6 లక్షల నగదు డిపాజిట్ చేసేందుకు కోఠిలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వచ్చారు. ఉదయం 6:50 నుంచి 7 గంటల మధ్యలో, రిన్షద్ డబ్బు డిపాజిట్ చేస్తుండగా స్కూటర్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అతనిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పులతో రిన్షద్ అక్కడికక్కడే కుప్పకూలిపోయారని, ఆసుపత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారని ఆమె తెలిపారు. దాడి అనంతరం నిందితులు, రిన్షద్ వద్ద ఉన్న రూ.6 లక్షల నగదుతో పాటు అతని బైక్‌ను కూడా తీసుకుని పరారయ్యారని వివరించారు.ఈ ఘటనపై సుల్తాన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని, నిందితులను పట్టుకునేందుకు 5 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు డీసీపీ తెలిపారు. ఘటనా స్థలంలో రెండు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నామని, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు చాదర్‌ఘాట్ వైపు వెళ్లినట్లు గుర్తించామని చెప్పారు. రిన్షద్ కదలికలపై ముందుగానే రెక్కీ నిర్వహించి, పక్కా ప్రణాళికతోనే ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులు నగరం విడిచి వెళ్లకుండా పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. నగర నడిబొడ్డున జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు కారణమైంది.

## కేసీఆర్‌కు సిట్ నోటీసులపై

## కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ జారీ చేసిన నోటీసులపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. నందినగర్ లోని కేసీఆర్ నివాసం ముందు గోడకు నోటీసులు అతికించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. 'గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందారు' అంటూ ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు.తెలంగాణ రాష్ట్ర సాధకుడు, ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. సిట్ అధికారులకు కేసీఆర్ స్వయంగా తన చిరునామాను అందించారని కేటీఆర్ గుర్తుచేశారు. అయినప్పటికీ ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించడం పైశాచిక చర్యేనని మండిపడ్డారు. ఇది అహంకారం కాకపోతే మరేమిటని ప్రశ్నించారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారు ఉంటున్న ఇంటికే వెళ్లి విచారించాలని నిబంధనలు చెబుతున్నాయని కేటీఆర్ గుర్తుచేశారు.ఈ నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా..లేక ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా మారి ప్రతిపక్ష నేతలను వేధించడమే పనిగా పెట్టుకున్నారా అంటూ పోలీసులను నిలదీశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని కేటీఆర్ తెలిపారు.తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తొలిసారి అందించిన నోటీసులకు కేసీఆర్ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించిన అధికారులు.. రెండోసారి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా నోటీసులు అందించేందుకు నందినగర్ లోని కేసీఆర్ ఇంటికి వెళ్లిన అధికారులు అక్కడ ఎవరూ లేకపోవడం, ఇంటికి తాళం వేసి ఉండడంతో గోడకు నోటీసులు అతికించి వెళ్లారు

## కరీంనగర్‌లో ఘనంగా పోలీసు

## అధికారుల పదవీ విరమణ సన్మానం

**కరీంనగర్ :** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంపాటు విశేష సేవలందించిన ఐదుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం శనివారంనాడు కరీంనగర్ కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కమీషనరేటు కార్యాలయం నుండి ఏవో వై.వి. మునిరామయ్య, మహిళా పోలీసు స్టేషన్ నుండి ఎస్సై చల్ల రాజన్న, ట్రాఫిక్ పి.ఎస్. నుండి మహమ్మద్ ముస్తఫా, ఏ.ఆర్. పోలీస్ హెడ్ క్వార్టర్స్ విభాగం నుండి, ఏఆర్ ?ఎస్సైలు ఖలీల్, మహమ్మద్ బాషు పదవీ విరమణ పొందారు.?కరీంనగర్ అడిషనల్ డీసీపీ పరిపాలన వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ, అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.అడిషనల్ డీసీపీ స్వయంగా పదవీ విరమణ పొందిన ఇరువురికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.?ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లు వెంకటరమణ , సిఎస్బి ఏసీపీ శ్రీనివాస్ , సిఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రిజర్వు ఇన్స్పెక్టర్ అడ్మిన్ రజినీకాంత్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై శ్రీ మామిడి సురేందర్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## బిజినెస్

### కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ షాక్ ?




కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న కరువు భత్యం (ఆం)పై వారికి షాక్ తప్పేలా లేదు. ఈసారి కరువు భత్యం పెంపు విషయంలో కేంద్ర ప్రభుత్వం పిసినారిగా వ్యవహరించబోతున్నట్లు తెలుస్తోంది. 8వ వేతన సంఘం సిఫార్సుల కోసం ఎదురుచూస్తున్న కేంద్ర ఉద్యోగులకు ఈసారి కరువు భత్యం ఊరటనిస్తుందని భావించగా.. అలాంటిదేమీ లేదని తేలిపోతోంది. ఈ మేరకు కేంద్రం డీఏ పెంపును ఖరారు చేసినట్లు సమాచారం. ఈసారి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ కనిష్టంగా 2 శాతం, గరిష్టంగా 5 శాతం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులో 2 శాతం పెరిగితే ప్రస్తుతం ఉన్న మూలవేతనం (బేసిక్ పే) లో 58 శాతం నుంచి 60 శాతానికి పెరిగే ఛాన్స్ ఉంది. గరిష్టంగా 5 శాతం పెరిగినా అత్యధికంగా 63 శాతానికి మాత్రమే ఇది చేరనుంది. ఎందుకంటే కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ డిసెంబర్ 2025కి ప్రకటించిన అఖిల భారత వినియోగదారుల ధరల సూచీని 148.2 వద్దే ఉంచింది. ద్రవ్యోల్బణం ప్రభావం నుండి జీతాలు, పెన్షన్లను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం ఎప్పటికప్పుడు సవరిస్తారు. అయితే ఈ సవరణకు ప్రాతిపదికగా పారిశ్రామిక కార్మికుల కోసం అఖిల భారత వినియోగదారుల ధరల సూచీని తీసుకుంటారు. కానీ తాజాగా ప్రకటించిన సూచీని ఎలాంటి మార్పులు లేకుండా అలాగే ఉంచడంతో కరువు భత్యం గరిష్టంగా 5 శాతం పెరిగి 63 శాతానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం జూలై 2025లో 54 శాతంగా ఉన్న డీఏను 58 శాతానికి పెంచింది. ఇప్పుడు డీఏను ఖరారు చేసినా మార్చి లేదా ఏప్రిల్ లో కేంద్రం ఆమోదం తర్వాతే ఇది అమల్లోకి వస్తుంది. అయితే బకాయిలు మాత్రం చెల్లిస్తారు.

### ద్రవ్యలోటు రూ.8.55 లక్షల కోట్లు



దేశ ద్రవ్యలోటు 2025 డిసెంబరు చివరకు రూ.8.55 లక్షల కోట్లుగా నమోదైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు, జీడీపీలో 4.4% లేదా రూ.15.69 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్రం అంచనా వేసింది. ఈ అంచనాల్లో తాజా గణాంకాలు 54.5 శాతానికి సమానం. 2024-25 ఇదే సమయంలో ద్రవ్యలోటు బడ్జెట్ లక్ష్యంలో 56.7 శాతంగా ఉంది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గణాంకాల ప్రకారం.. డిసెంబరు చివరకు ప్రభుత్వానికి రూ.25.25 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. బడ్జెట్ అంచనాల్లో ఈ మొత్తం 72.2 శాతానికి సమానం. ఇందులో రూ.19.39 లక్షల కోట్లు పన్నుల రూపేణ, రూ.5.39 లక్షల కోట్లు పన్నేతర ఆదాయంగా లభించింది. రుణ రహిత పెట్టుబడి సాధనాల్లో రూ.46,047 కోట్లు సమకూరాయి. ఏప్రిల్- డిసెంబరు నెలల్లో పన్ను ఆదాయంలో వాటా రూపేణ రాష్ట్రాలకు రూ.10.38 లక్షల కోట్లు బదిలీ చేశారు. 2024-25 ఇదే కాలంలో బదిలీ చేసిన మొత్తం కంటే ఇది రూ.1.37 లక్షల కోట్లు అధికం. ఏప్రిల్-డిసెంబరులో మొత్తం ప్రభుత్వ వ్యయాలు రూ.33.8 లక్షల కోట్లకు చేరాయి. బడ్జెట్ అంచనాల్లో ఇవి 66.7 శాతానికి సమానం. ఇందులో రూ.25.93 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా.. రూ.7.87 లక్షల కోట్లు పెట్టుబడి వ్యయాలు. రెవెన్యూ వ్యయాల్లో రూ.9.11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు, రూ.3.17 లక్షల కోట్లు ప్రధాన రాయితీలకు వెచ్చించారు.

# ఉచితాలు ఎత్తేస్తారా?
# ఆర్థిక సర్వేలో కేంద్రం ఏం చెప్పింది?



ఉచిత పథకాలపై ఆర్థిక సర్వేలో అంచనాలు ఎలాంటి టార్గెట్లు లేకుండా క్యాష్ ట్రాన్స్‌ఫర్లు సరికాదు ఆర్థిక వ్యవస్థ గాడి తప్పే ప్రమాదముంటుందన్న సర్వేఇఇనీనినీఎతిఇ వాబీతీలవం: దేశంలో ఉచిత పథకాలకు సంబంధించి కేంద్ర ఎకనామిక్ సర్వేలో సంచలన విషయాలు వెలుగుచూశాయి. కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన ఎకనామిక్ సర్వేలో ఉచిత పథకాలు, ఎలాంటి టార్గెట్లు లేకుండా క్యాష్ ట్రాన్స్ ఫర్లు చేయడం లాంటి పథకాల వల్ల ఆర్థిక వ్యవస్థ గాడి తప్పే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఇలాంటి పథకాల కంటే కూడా బ్రెజిల్, మెక్సికో, ఫిలిప్పీన్స్ లో ఉన్న పథకాలను అమలు చేస్తే బెటర్ అని అభిప్రాయపడింది. దేశంలో ఈ మధ్య కాలంలో ఓటర్లను ఆకట్టుకోవడానికి పొలిటికల్ పార్టీలు ఇబ్బడిముబ్బడిగా వరాలు ప్రకటిస్తున్నాయి. ఆడవారికి 10వేలు ఇస్తాం. రైతులకు ఇవి ఇస్తాం.. చేనేతలకు అది ఇస్తాం.. పిల్లలకు ఇంకోటి ఇస్తాం.. నిరుద్యోగులకు ఫలానాది ఇస్తాం. ఇలా నోటికి వచ్చినట్టు హామీలు గుప్పిస్తున్నాయి. ఏ రాష్ట్రం కూడా వీటికి అతీతం కాదు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, అస్సాం, పశ్చిమ బెంగాల్.. ఇలా ఒకటేంటి ప్రతి రాష్ట్రం కూడా ఇలాంటి ఉచిత హామీల విషయంలో తగ్గేదేలే అన్నట్టుగా ఉన్నాయి. దేశంలో ఉచిత హామీలు, మనీ ట్రాన్స్ ఫర్లు ఏ రేంజ్ లో పెరిగిందంటే 2023 నుంచి 2026 నాటికి అది ఐదింతలు పెరిగింది. ప్రస్తుతం దేశ ఆర్థిక బడ్జెట్ మీద 1.7 లక్షల కోట్లు ఈ ఉచితాలు, మనీ ట్రాన్స్ ఫర్ల రూపంలో ప్రజలకు అందుతున్నాయి. ఏడు రాష్ట్రాల్లో నెలవారీ వచ్చే ఆదాయంలో 87 శాతం కేవలం ఈ ఉచితాలకు ఇవ్వడానికే సరిపోతుందంటే పరిస్థితి ఏం స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆర్థిక సర్వేతో పాటు ఇతర ప్రభుత్వ సర్వేలు, అంచనాలను గమనిస్తే ఈ ఉచిత పథకాలు, డబ్బులు ట్రాన్స్ ఫర్ల వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఆ స్థాయిలో పురోగతి కూడా సాధించలేదు. మహిళలకు గానీ, ఇతరులకు గానీ ఇస్తున్న ఉచిత హామీల డబ్బుల వల్ల పెద్దగా వారి జీవితాలలో మార్పులు తీసుకురాలేకపోయాయని సర్వేలు చెబుతున్నాయి. వాళ్లకు డబ్బులిస్తే ఏదో మంచి జరిగి వాళ్ల జీవితాలు మారతాయని ఆశించిన ఫలితం దక్కలేదు. మరోవైపు రాష్ట్రాల ఖజానాల మీద ఆర్థిక భారం తడిసి మోపెడవుతోంది. దీని వల్ల ఆర్థిక లోటు పెరుగుతోంది. జనాల చేతిలో డబ్బుల పెడుతున్నప్పుడు, ఉచితాల రూపంలో కాకుండా ఏదో ఒక టార్గెట్ ఓరియంటెడ్ గా ఉండాలని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంటే, ఫర్ ఎగ్జాంపుల్ మీ పిల్లలు స్కూలుకి వస్తేనే డబ్బులిస్తామని అంటే వాళ్లు స్కూలుకు వచ్చినప్పుడు వాళ్ల అటెండెన్స్ పూర్తిగా, ప్రాపర్ గా చెక్ చేసి వాళ్ల అకౌంట్లో డబ్బులు వేయడం. ఇది ఓ రకంగా బెటర్. ఎందుకంటే పిల్లలు చదువుకుంటారు. మెల్లగా వృద్ధిలోకి వస్తారు. ఇంకో ఎగ్జాంపుల్ ఏంటంటే, గర్భిణులు ప్రాపర్ గా చెకప్స్ చేయించుకోవడం, పిల్లలకు కచ్చితంగా వ్యాక్సిన్లు వేయించడం.. ఇలాంటి వాటికి మనీ ట్రాన్స్ ఫర్ చేస్తే ఆరోగ్య పరంగా దేశం బాగుపడుతుంది. మనిషి ఆరోగ్యంగా ఉంటే సగం సమస్యలు లేనట్టే. ఎందుకంటే ఇండియా లాంటి దేశంలో ఒక్క చిన్న జబ్బు వచ్చినా ఆస్పత్రుల్లో ఖర్చుల సంగతి తెలిసిందే. జీవితాంతం కష్టపడి సంపాదించిన సొమ్ము ఒక్కసారి ఆస్పత్రి పాలవుతుంది. కాబట్టి హెల్త్ లాంటి అంశాలపై ఉచితాలు, మనీ ట్రాన్స్ ఫర్లు చేస్తే బెటర్ అనే అభిప్రాయం ఎకనామిక్ సర్వే వెలిబుచ్చింది. ఉచితాలు, కండిషనల్ మనీ ట్రాన్స్ ఫర్ల లాంటి అంశాల్లో ఎలా పడితే అలా ఇచ్చేయకుండా బ్రెజిల్ ను ఫాలో అయితే బెటర్ అనే అభిప్రాయాన్ని ఎకనామిక్ సర్వే అభిప్రాయపడింది. బ్రెజిల్లో 2003లో బోల్సా ఫెమిలియా అనే స్కీమ్ తెచ్చారు. అక్కడ విద్య, వైద్యం (పైన చెప్పిన ఎగ్జాంపుల్స్) అంశాల్లో లబ్దిదారులకు బ్యాంకు అకౌంట్లకు మనీ ట్రాన్స్ ఫర్ చేస్తున్నారు. ఇది సత్ఫలితాలు ఇచ్చింది. ఈ రకంగా చేయడం వల్ల ఒకదశకు వచ్చాక ఆ విద్యార్థి చదువుకుని గ్రాడ్యుయేట్ అయ్యాక డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదు. అలాగే, స్త్రీలకు కూడా ఆ టార్గెట్ పూర్తయ్యాక డబ్బులు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. అలా కాకుండా 'ఫలానా కులం వారికి డబ్బులు ఇస్తాం.' అని ఎన్నికల హామీలు ఇస్తే వాళ్లకు జీవితాంతం ఇస్తూ పోవాలి. అలాగే, మెక్సికో, ఫిలిప్పీన్స్ లో కూడా ఇలాంటి కండిషన్ల మీదే మనీ ట్రాన్స్ ఫర్ పథకాలు ఉన్నాయి. దీని వల్ల అకౌంటబిలిటీ పెరుగుతుంది. అలాగే, సరైన దిశలోనే ప్రజల సొమ్ము ఖర్చవుతుంది. మొత్తానికి ఉచితాలు, డబ్బుల పంపిణీలు అనేవి కొన్ని కండిషన్ల ద్వారా జరగాలని ఎకనామిక్ సర్వే కచ్చితంగా అభిప్రాయపడింది. అలాగే, టైమ్ కండిషన్లు కూడా పెట్టుకోవాలని సూచించింది. లేకపోతే ఆర్థికంగా దెబ్బతింటామని స్పష్టం చేసింది.

## సాఫ్ట్‌వేర్ నుంచి ఏఐ సొల్యూషన్ల వైపు మారుతున్న భారతీయ ఐటీ పరిశ్రమ



భారత ఐటీ రంగం సాంప్రదాయ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి నుంచి వేగంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సొల్యూషన్ల వైపు పయనిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దశాబ్దాలుగా మన ఐటీ పరిశ్రమకు ఉన్న బలాన్ని, పాత సాఫ్ట్‌వేర్ అభివృద్ధి మోడల్‌కు బదులుగా, ఏఐ సొల్యూషన్స్ అందించేలా ఉపయోగిస్తున్నామని అన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. భారత్ ఇప్పటికే ఏఐ సంబంధిత రంగంలో 70 బిలియన్ డాలర్ల(రూ. 6.44 లక్షల కోట్ల) పెట్టుబడులను సాధించింది. వచ్చే నెలలో జరిగే ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఇది రెట్టింపు కావొచ్చని వెల్లడించారు. ఈ సమ్మిట్ ప్రపంచంలోనే నాల్గవ, అతిపెద్ద ఏఐ సదస్సు. భారత్ తన ఏఐ ఎకోసిస్టమ్‌ను సరైన క్రమంలో అభివృద్ధి చేసిందని, దీని ద్వారా ప్రపంచ ఏఐ అభివృద్ధిలో దేశాన్ని కీలకంగా మార్చిం దని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులకు కొత్త స్కిల్స్ కోసం శిక్షణ ఇస్తున్నాయని, క్లయింట్లతో తిరిగి సంబం ధాలు ఏర్పరచుకుంటున్నాయని, కొత్త మార్కెట్ అవకాశాలను అన్వేషిస్తున్నాయని మంత్రి అన్నారు. ఇప్పటికే 5,00,000 మందికి పైగా విద్యార్థులు ఏఐ స్కిల్స్‌ను అందిపుచ్చుకున్నారు. త్వరలో 500 విశ్వవిద్యాలయాలలో ఏఐ మౌలిక సదుపాయాలు, కోర్సు పాఠ్యాంశాలను అందిస్తామని, తద్వారా విద్యార్థులు ఏఐ అవకాశాలపై మెరుగైన శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు.

## స్పోర్ట్స్

## పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం..
# వరల్డ్‌కప్‌లో ఆడేది డౌటే?




టీ20 ప్రపంచకప్-2026కు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికలగా ఈ మెగా టోర్నీ ఆరంభం కానుంది. అయితే ఈ టోర్నీలో పాకిస్తాన్ ఆడుతుందా? లేదా అన్నది? ఇంకా క్లారిటీ లేదు. ఓ వైపు వరల్డ్‌కప్ కోసం తమ జట్టును శ్రీలంకకు పంపేందుకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వార్తలు వస్తుండగా.. మరోవైపు ప్రభుత్వ అనుమతి కోసం ఇంకా పీసీబీ ఎదురు చూస్తున్నట్లు ప్రచారం జరగుతోంది. ఒకవేళ ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే ఫిబ్రవరి 2న శ్రీలంకకు పాక్ పయనం కానుంది. అయితే ఈ మెగా టోర్నీ కోసం తమ కొత్త జెర్సీని ఆసీస్‌తో రెండో టీ20 సందర్భంగా విడుదల చేస్తామని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ముందుగా ప్రకటించింది. అయితే ఇప్పుడు తమ జెర్సీ కిట్ లాంచ్ కార్యక్రమాన్ని పీసీబీ రద్దు చేసింది. ఇందుకు ప్రధాన కారణం పాక్ ప్రభుత్వం నుండి ఇంకా అనుమతి లభించకపోవడమేనని తెలుస్తోంది. పాక్ వరల్డ్‌కప్‌లో పాల్గొనడంపై తుది నిర్ణయం సోమవారం (ఫిబ్రవరి 2) వెలువడే అవకాశం ఉంది. కాగా ఈ మెగా టోర్నీ నుంచి బంగ్లాదేశ్ ఇప్పటికే తప్పుకొన్న సంగతి తెలిసిందే. అయితే బంగ్లాదేశ్‌కు మద్దతుగా నిలుస్తూ పీసీబీ కూడా టోర్నీని బహిష్కరిస్తుమని ఉడత బెదిరింపులకు దిగింది. కానీ ఐసీసీ జోక్యం చేసుకోవడంతో పీసీబీ వెనుక్కి తగ్గింది. కానీ టోర్నీలో పాల్గోనడంపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. పాకిస్తాన్ ప్రస్తుతం స్వదేశంలో ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడుతోంది.

**వరల్డ్‌కప్ టోర్నీకి పాక్ జట్టు ఇదే**

సల్మాన్ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజం, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, ఖవాజా నఫే, మహ్మద్ నవాజ్, సల్మాన్ మీర్జా, నసీమ్ షా, సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, షాహీన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తారీక్

### కెప్టెన్‌గా సూర్యకుమార్‌కు సరైన గుర్తింపు లభించట్లేదు : ఇర్ఫాన్ పఠాన్



టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంశల జల్లు కురిపించాడు. అతని ఆట తీరులో రోహిత్ శర్మ ఛాయలున్నాయని కొనియాడారు. ఒక టీం లీడర్‌గా అతను జట్టును నడిపించటంలో సేమ్‌టు సేమ్ రోహిత్‌ను తలపిస్తాడని పఠాన్ అన్నారు. టి20 కెప్టెన్‌గా సూర్యకుమార్ అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నప్పటికీ అతనికి దక్కాల్సిన గుర్తింపు దక్కట్లేదన్నారు. 'రోహిత్ శర్మ తరువాత కెప్టెన్సీ బాధ్యలు తీసుకున్న సూర్య.. భారత జట్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు నడిపించాడు. అతని కెప్టెన్సీలో 41 టీ20లు ఆడిన భారత్ 31మ్యాచ్‌లు గెలిచింది. 2025 ఆసియా కప్‌ను సైతం స్వాధీనం చేసుకుంది. సూర్య కుమార్ జట్టు కెప్టెన్‌గా అద్భుత ఫలితాలు సాధించినప్పటికీ అతను వ్యక్తిగతగా పరుగులు చేయడంలో విమర్శలకు గురయ్యాడు. ముఖ్యంగా 2025లో ఆడిన మ్యాచ్‌లలో అతను చెప్పుకోదగిన పరుగులు చేయలేకపోయాడు. వాబతీఝునిబఝతీ ఘఝుజ । మొత్తం 21 మ్యాచ్‌లు ఆడిన సూర్య కేవలం 218 పరుగులు సాధించాడు. టి20 ప్రపంచ కప్‌కు ముందు సూర్యకుమార్ అతని ఫామ్‌ను నిరూపించుకోవాల్సిన అవసరముంది' అని పఠాన్ అన్నాడు. కెప్టెన్‌గా అతను వరల్డ్‌కప్‌లో ఖచ్చితంగా ఆడతాడని పేర్కొన్నాడు. కానీ అంత కంటే ముందు అతను పరుగులు చేసి తన సత్తా ఏంటో నిరూపించుకోవాల్సిన అవసరముందని పఠాన్ అబిప్రాయపడ్డాడు.

### సామ్ కరన్ హ్యాట్రిక్.. శ్రీలంకపై ఇంగ్లండ్ ఘన విజయం



టీ20 వరల్డ్‌కప్-2026కు ముందు ఇంగ్లండ్ జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. శుక్రవారం పల్లెకెలె వేదికగా జరిగిన తొలి టీ20లో 11 పరుగుల తేడాతో(డక్ వర్త్ లూయిస్) ఇంగ్లండ్ విజయం సాధించింది. తొలుత వర్షం కారణంగా మ్యాచ్‌ను 17 ఓవర్లకు కుదించారు. ఈ క్రమంలో మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 16.2 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బ్యాటర్లలో కుశాల్ మెండిస్(37) టాప్ స్కోరర్‌గా నిలవగా.. పాతుమ్ నిస్సంక (23), షనక(20) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో సామ్ కరన్ హ్యాట్రిక్ వికెట్లతో మెరిశాడు. 16 ఓవర్ వేసిన కరన్ దాసున్ షనక, మహీష్ తీక్షణ, మతీష పతిరాణ వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. టీ20ల్లో హ్యాట్రిక్ సాధించిన రెండో ఇంగ్లండ్ బౌలర్‌గా నిలిచాడు. అతడితో పాటు అదిల్ రషీద్ మూడు, డాసన్ రెండు, ఓవర్టన్ తలా రెండు వికెట్లు సాధించారు. అనంతరం లక్ష్య చేధనలో ఇంగ్లండ్ 15 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. అయితే 15 ఓవర్ల తర్వాత భారీ వర్షం పడటంతో ఆట సాధ్యం కాలేదు. అప్పటికే డక్‌వర్త్ లూయిస్ పార్ స్కోర్ కంటే ఇంగ్లండ్ 11 పరుగులు ముందంజలో ఉండటంతో విజేతగా ప్రకటించారు. ఇంగ్లండ్ బ్యాటర్లలో ఓపెనర్ ఫిల్ సాల్ట్ (46) టాప్ స్కోరర్‌గా నిలవగా.. టామ్ బాంటన్ (29), బట్లర్(17) రాణించాడు. శ్రీలంక బౌలర్లలో ఇషాన్ మలింగ రెండు వికెట్లు సాధించాడు.

ధర్మఘంట



## సూర్య, వెంకీ సినిమా థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్!

కోలీవుడ్ యాక్టర్ సూర్య వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరితో చేస్తున్న సూర్య 46 ఈ చిత్రంలో ప్రేమలు ఫేం మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా.. సీనియర్ యాక్టర్లు రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్లు కీలక పాత్ర పోషిస్తోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. ఇంకా టైటిల్ ఫిక్స్ కానీ ఈ మూవీ ఏప్రిల్‌లో థియేటర్లలోకి వస్తుందంటూ ఇప్పటికే న్యూస్ నెట్టింట రౌండప్ చేస్తుండగా.. ఈ మూవీని జులై 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నారంటూ తాజాగా మరో అప్‌డేట్ తెరపైకి వచ్చింది. దీనిపై సూర్య టీం నుంచి అధికారిక ప్రకటన రావడమే ఆలస్యమని ఇన్‌సైడ్ టాక్. తాజా కథనాల ప్రకారం గజినీలో సంజయ్ రామస్వామి పాత్ర లైన్‌లో ఈ చిత్రంలో సూర్య రోల్ ఉండబోతుందని తెలుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం 45 ఏండ్ల వ్యక్తికి 20 ఏండ్ల యువతికి మధ్య రిలేషిన్ షిప్ నేపథ్యంలో ఉండబోతుందట.. ఏజ్ గ్యాప్ ఎక్కువగా ఉన్న వీరిద్దరి మధ్య ప్రేమ చిగురిస్తుందా..? ఇద్దరి మధ్య ట్రాక్ ఎలా ఉండబోతుందనే నేపథ్యంలో సినిమా సాగనున్నట్టు సూర్య 46 చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశి, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో సూర్య టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సూర్య మరోవైపు సుధాకొంగర డైరెక్షన్‌ల సూర్య 47లో నటిస్తున్నాడని తెలిసిందే.



## దుబాయ్‌లో అల్లు శిరీష్-నయనిక ప్రీ వెడ్డింగ్ సంబరాలు వైరల్ అయిన అల్లు అర్జున్ షర్ట్ రేటు!

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు, హీరో అల్లు శిరీష్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నాడు. తన ప్రేయసి నయనికను ఈ ఏడాది మార్చిలో పెళ్లి చేసుకోనున్న శిరీష్, పెళ్లికి ముందే దుబాయ్‌లో గ్రాండ్‌గా ప్రీ వెడ్డింగ్ పార్టీ నిర్వహించాడు. కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రులతో కలిసి జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మార్చిలో జరిగే వివాహానికి ముందు శిరీష్‌నయనిక జంట దుబాయ్‌లో ఫ్యామిలీ అండ్ ఫ్రెండ్స్ కోసం ప్రత్యేకంగా ఈ పార్టీని ప్లాన్ చేశారు. అల్లు అర్జున్  స్నేహారెడ్డి దంపతులతో పాటు అల్లు కుటుంబం మొత్తం ఈ సంబరాల్లో పాల్గొంది. జే1 బీచ్ ప్రాంతంలో, సముద్రంలో ప్రయాణిస్తున్న బోటులో జరిగిన పార్టీ వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పార్టీలో శిరీష్ షాంపైన్ బాటిల్ ఓపెన్ చేసి స్ప్రే చేయగా, చుట్టూ ఉన్న అతిథులంతా చప్పట్లతో హోరెత్తించారు. ఆ సమయంలో పక్కనే నిలబడ్డ అల్లు అర్జున్ నవ్వుతూ కనిపించాడు. శిరీష్, నయనిక ఇద్దరూ షాంపైన్‌ను షేర్ చేసుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వీడియోలు అభిమానులను బాగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ప్రీ వెడ్డింగ్ పార్టీకి సంబంధించిన మరో హాట్ టాపిక్‌డ అల్లు అర్జున్ ధరించిన షర్ట్. జే1 బీచ్‌లో తీసిన వీడియోలో స్నేహారెడ్డి వైట్ కలర్ డ్రెస్‌లో స్టైలిష్‌గా కనిపించగా, అల్లు అర్జున్ మాత్రం వెర్సాస్ (ఎవతీయిఎివ) ప్రింటెడ్ సిల్క్ ట్విల్ షర్ట్లో అదిరిపోయాడు. ఆ బ్రాండ్ అధికారిక వెబ్‌సైట్ సమాచారం ప్రకారం, ఈ షర్ట్ ధర రూ.1,39,600 కావడం విశేషం. దీంతో అల్లు అర్జున్ లుక్ మరోసారి ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షించింది.అల్లు శిరీష్ తన తాత, దిగ్గజ నటుడు అల్లు రామలింగయ్య జయంతి సందర్భంగా నయనికను వివాహమాడనున్నట్లు అక్టోబర్ 1, 2025న అధికారికంగా ప్రకటించాడు. ఈ జంట అక్టోబర్ 31, 2025న హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా ఎంగేజ్‌మెంట్ చేసుకుంది. మార్చి 6, 2026న శిరీష్‌నయనిక వివాహం జరగనుండగా, ఇదే రోజు అల్లు అర్జున్  స్నేహారెడ్డి మ్యారేజ్ డే కావడం మరో విశేషం. ఇటీవల ట్రెండింగ్‌లో ఉన్న ఓ రీల్ ద్వారా ఈ పెళ్లి తేదీని శిరీష్ స్వయంగా వెల్లడించాడు.మొత్తానికి, అల్లు కుటుంబంలో మరో పెళ్లి వేడుకకు కౌంట్‌డౌన్ మొదలవ్వగాడ దుబాయ్ ప్రీ వెడ్డింగ్ పార్టీతో సంబరాలకు ఇప్పటికే స్టార్ట్ పడిపోయింది.

## నాకు ముందే తెలుసు.. జననాయగన్ ఆలస్యంపై విజయ్ కామెంట్స్ వైరల్




కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం జన నాయగన్ తెలుగులో ప్రజల నాయకుడు టైటిల్‌తో వస్తోంది. ఈ చిత్రం ముందుగా నిర్ణయించిన ప్రకారం జనవరి 9నే ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉంది. అయితే జననాయగన్‌కు సెన్సార్ బోర్డ్ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో విజయ్ టీం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. రాజకీయ కారణాలతో జననాయగన్ సినిమాకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఇప్పటికే టీవీకే ఆరోపిస్తోంది. కాగా ఇటీవలే సెన్సార్ బోర్డు సుప్రీంకోర్టు కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఒకవేళ నిర్మాతలు ఏదైనా అప్పీలు చేస్తే తమ వాదనలు వినకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయొద్దని సెన్సార్ బోర్డు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. అయితే ఇప్పటివరకు సినిమా చిక్కులకు సంబంధించి ఎలాంటి కామెంట్ చేయలేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోతున్నాయి. తాజాగా దీనిపై క్లారిటీ ఇచ్చేశాడు విజయ్. ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నా పొలిటికల్ ఎంట్రీ కారణంగా నా జననాయగన్ మూవీ నిర్మాత ఇబ్బందులు పడుతుండటం బాధగా ఉంది. నా రాజకీయారంగేట్రం వల్ల నా సినిమా ప్రభావితమవుతుందని తెలుసు.

## చిట్టి ఇంతలా మారిపోయింది ఏంటి.. రొమాంటిక్ సీన్స్‌లో అయితే



'జాతిరత్నాలు'తో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఫరియా అబ్దుల్లా పేరు చెబితే ఇప్పటికీ చాలామందికి చిట్టి పాత్రే గుర్తొస్తుంది. ఆ సినిమాతో వచ్చిన క్రేజ్ తర్వాత ఆమె కెరీర్ గ్రాఫ్ ఊహించినంత వేగంగా ముందుకెళ్లకపోయినా, ఫరియా మాత్రం తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. మధ్యలో కొన్ని సినిమాలు చేసినా అవి పెద్దగా వర్కౌట్ కాలేదు. అయితే వెండితెరపై బ్రేక్ లేకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె యాక్టివిటీ ఎప్పుడూ తగ్గలేదు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ఫ్యాన్స్‌కు దగ్గరగానే ఉంటూ తన పాపులారిటీని కంటిన్యూ చేస్తోంది. ఇప్పటికే తిరువీర్ హీరోగా నటిస్తున్న 'భగవంతుడు' సినిమా టీజర్ విడుదల కావడంతో ఫరియా మళ్లీ చర్చలోకి వచ్చింది. ఈ టీజర్‌లో ఆమె లుక్, పాత్ర డిజైన్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఒకవైపు సంప్రదాయ పల్లెటూరి అమ్మాయిలా లంగా ఓణీలో కనిపిస్తూనే, మరోవైపు కథ డిమాండ్ మేరకు బోల్డ్ షేడ్స్ ఉన్న సీన్స్‌లోనూ ఆమె కనిపించడం హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్, లిప్‌లాక్ షాట్, చివర్లో రౌడీలకు ఎదురెళ్లే ధీటైన ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే, ఫరియాను ఇప్పటివరకు చూసిన ఇమేజ్‌కు పూర్తిగా భిన్నంగా చూపించారని చెప్పొచ్చు.కంటెంట్ బలంగా ఉంటే గ్లామర్ రోల్స్ చేయడంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫరియా ఇప్పటికే పలుమార్లు చెప్పింది. అదే మాటకు తగ్గట్టుగానే ఈ పీరియడ్ రూరల్ డ్రామాలో ఆమె పాత్రను డిజైన్ చేసినట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. గ్లామర్‌ను మాత్రమే కాకుండా, ఎమోషన్, ఆగ్రహం, అమాయకత్వం అన్నీ కలిపిన పాత్రగా ఇది కనిపిస్తోంది. మరీ అతిగా కాకుండా కథకు అవసరమైనంత వరకే బోల్డ్ ఎలిమెంట్స్ ఉండేలా జాగ్రత్త పడ్డారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.'జాతిరత్నాలు' తర్వాత సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఫరియాకు 'భగవంతుడు' కీలక మలుపుగా మారే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాలో ఆమెకు నటన పరంగా కూడా మంచి స్కోప్ ఉన్నట్టు టీజర్ స్పష్టంగా చెబుతోంది. ఒకవైపు పల్లెటూరి అమ్మాయి అమాయకత్వం, మరోవైపు ధైర్యంగా నిలబడే మహిళగా ఆమె చూపించబోయే షేడ్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి.జిజి విహారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాతో ఫరియా మళ్లీ ఫామ్‌లోకి వస్తుందా లేదా అన్నది చూడాలి. టీజర్‌తో అయితే సినిమాపై మంచి ఆసక్తి క్రియేట్ అయింది. సోషల్ మీడియాలో ఫోటోలతో మ్యాజిక్ చేస్తున్న చిట్టి, ఈసారి వెండితెరపై కూడా అదే మ్యాజిక్ రిపీట్ చేస్తుందేమోనని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



## ఓటీటీలోకి శివకార్తికేయన్ 'పరాశక్తి'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్, టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల జంటగా నటించిన భారీ పీరియాడికల్ పొలిటికల్ డ్రామా 'పరాశక్తి' డిజిటల్ విడుదలకు ముహూర్తం ఖరారైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు దక్కించుకోగా.. ఫిబ్రవరి 7 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. టాలెంటెడ్ దర్శకురాలు సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 10న థియేటర్లలో విడుదలైంది. 1960ల నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమం నేపథ్యంలో అద్భుతమైన నిర్మాణ విలువలతో ఈ సినిమాను రూపొందించారు. శివకార్తికేయన్ కెరీర్‌లో ఇది 25వ సినిమా కావడం, అలాగే సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్‌కు ఇది 100వ చిత్రం కావడం విశేషం. జయం రవి ప్రతినాయకుడిగా నటించగా, అథర్వ మురళి కీలక పాత్రలో కనిపించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనను అందుకుంది. సుమారు 150 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం థియేటర్లలో ఆశించిన స్థాయిలో వసూళ్లు రాబట్టలేకపోయింది. దీంతో సినిమా విడుదలైన కేవలం నాలుగు వారాల్లోనే ఓటీటీలోకి వస్తోంది. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఒకేసారి స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు జీ5 వేదికగా ఈ యాక్షన్ డ్రామాను వీక్షించవచ్చు.

## హీరోగా మారిన తమిళ స్టార్ దర్శకుడు.. 'విత్ లవ్' తెలుగు ట్రైలర్ విడుదల!

దర్శకుడి నుంచి హీరోగా మారడం ఇండస్ట్రీలో కొత్తేమీ కాకపోయినా, ఒక సెన్సేషనల్ డైరెక్టర్ హీరోగా ఎంట్రీ ఇస్తుంటే ఆ అంచనాలే వేరుగా ఉంటాయి. 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అభిషన్ జీవింత్, ఇప్పుడు 'విత్ లవ్' సినిమాతో కథానాయకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. మదన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ క్యూట్ లవ్ స్టోరీలో అభిషన్ జీవింత్ హీరోగా నటిస్తుండగా, మలయాళీ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాను సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 06న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన ప్రేమకథగా కనిపిస్తోంది. ట్రైలర్‌లో విజువల్స్ మరియు మ్యూజిక్ ఒక ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా యూత్ కనెక్ట్ అయ్యే ఎమోషన్స్ సినిమాలో పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సీన్ రోల్డాన్ సంగీతం అందిస్తుండగా, శ్రేయాస్ కృష్ణ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. కావ్య అనిల్, సచిన్ నాచిప్పన్, తేని మురుగన్, శరవణన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# మానవ జన్మ సార్ధకత...బుద్ధుడు,పూలే, అంబేద్కర్ మార్గం!



మానవ జన్మ ఎప్పుడు సార్ధకమవుతుంది అనే ప్రశ్నకు సమాధానం కనుగొనాలంటే,చరిత్రలోని మహానుభావుల జీవితాలు మనకు మార్గదర్శకాలుగా కనిపిస్తాయి.బుద్ధుడు,మహాత్మా జ్యోతిరావ్ పూలే,బీ.ఆర్.అంబేద్కర్ వంటి మహనీయులు తమ జీవితాలను సామాజికన్యాయం, సమానత,స్వీయ అన్వేషణకు అంకితం చేశారు.సామాజిక దృక్కోణంలో వారు సమాజ సంస్కరణల ద్వారా మార్పు తెచ్చారు.వ్యక్తిగత దృక్కోణంలో తమ బాధలు,అనుభవాల నుండి జ్ఞానం సాధించారు.సమాజ సంస్కరణలో సార్ధకత సామాజిక దృక్కోణంలో మానవ జన్మ సార్ధకమవడం అంటే,సమాజంలోని అసమానతలు,అన్యాయాలు తొలగించి,అందరికీ సమాన అవకాశాలు కల్పించడం. సమాజంలో అసమానతలు, పేదరికం,వివక్షలు ఉన్నప్పుడు, వాటిని పరిష్కరించడానికి కృషిచేయడం మానవ జన్మకు సార్ధకత తెస్తుంది.ఉదాహరణకు, మహిళల హక్కుల కోసం పోరాడిన మాలాలా యూసఫ్జాయ్ లాంటి వ్యక్తులు సమాజాన్ని మార్చారు.సామాజిక దృక్కోణంలో,మన జీవితం సమాజానికి భారం కాకుండా, ఆస్తి అయ్యేలా చేయాలి.బుద్ధుడు,పూలే, అంబేద్కర్ వంటి మహానుభావుల సంస్కరణలు ఇందుకు ఉదాహరణలుగా తీసుకోవాలి.

**గౌతమ బుద్ధుడు**

గౌతమ బుద్ధుడు (క్రీ.పూ.563 -483) కుల వ్యవస్థ,వర్ణాశ్రమ ధర్మాల నుండి విముక్తి కోసం బౌద్ధమతాన్ని స్థాపించారు.ఆయన అష్టాంగిక మార్గంలో సరైన దృక్పథం, సంకల్పం,వాక్కు,కర్మ,జీవనం, ప్రయత్నం,స్మృతి,సమాధి ద్వారా సమాజంలో దుఃఖాలు తీర్చడానికి మార్గం చూపారు. రాజకుమారుడిగా పుట్టిన బుద్ధుడు,దుఃఖాలు చూసి రాజ్యాన్ని వదిలి ధ్యానం చేశారు. బోధి వృక్షం కింద జ్ఞానోదయం పొంది,నాలుగు ఆర్య సత్యాలు (దుఃఖం,దుఃఖ కారణం,దుఃఖ నిరోధం,మార్గం) కనుగొన్నారు. వ్యక్తిగతంగా,ఆయన జన్మ సార్ధకతను ఆత్మ జ్ఞానంలో చూశారు. సామాజికంగా బుద్ధుడు అందరినీ సమానంగా చూడాలని బోధించారు,దీనివల్ల మిలియన్ల మంది జీవితాలు మారాయి.

**మహాత్మా జ్యోతిరావ్ పూలే**

మహాత్మా జ్యోతిరావ్ పూలే 19వ శతాబ్దంలో (1827-1890) మహారాష్ట్రలో పుట్టి,దళితులు, మహిళల విద్యా,హక్కుల కోసం పోరాడారు.ఆయన సత్యశోధక్ సమాజ్ స్థాపించి,కుల వ్యవస్థను వ్యతిరేకించారు.మహిళలకు విద్య అందించడానికి మొదటి బాలికల పాఠశాల స్థాపించారు. దిగువ కులంలో పుట్టిన పూలే, నిమ్న వర్గాలకు,మహిళలకు విద్యావకాశాలు లేకపోవడం వల్ల బాధపడ్డారు.తన అనుభవాల నుండి జ్ఞానం సాధించి, 'గులామగిరి' వంటి గ్రంథాలు రాశారు.వ్యక్తిగతంగా ఆయన సార్ధకతను స్వీయ అభివృద్ధి, పోరాటంలో చూశారు.సామాజికంగా పూలే జన్మ సార్ధకతను దమనితుల ఉద్ధరణలో చూశారు.

**బీ.ఆర్.అంబేద్కర్**

భారత రాజ్యాంగ నిర్మాత (1891-1956) అంబేద్కర్ దళిత ఉద్యమానికి నాయకుడు. ఆయన పూనా ఒప్పందం, రాజ్యాంగంలో సమానత హక్కులు కల్పించడం ద్వారా సమాజాన్ని మార్చారు. చిన్ననాటి నుండి అస్పృశ్యత బాధలు అనుభవించిన బీ.ఆర్.అంబేద్కర్,విద్యావంతుడై,లా,ఎకనామిక్స్ లో డాక్టరేట్ సాధించారు.వ్యక్తిగతంగా ఆయన జన్మ సార్ధకతను స్వీయ సాక్షాత్కారం,బౌద్ధ మత దీక్ష ద్వారా పొందారు.ఈ మార్గంలో వ్యక్తిగత అన్వేషణ ద్వారా మన జన్మ అర్ధవంతమవుతుంది.

సామాజికంగా అంబేద్కర్ జన్మ సార్ధకతను అన్యాయాలపై పోరాటంలో చూశారు.ఈ మహానుభావుల మార్గంలో సామాజిక సేవ ద్వారా మన జన్మ సమాజానికి ఉపయోగపడుతుంది.

వ్యక్తిగత దృక్కోణం స్వీయ అన్వేషణలో సార్ధకత వ్యక్తిగత దృక్కోణంలో మానవ జన్మ సార్ధకమవడం అంటే,తన బాధలు,అనుభవాల నుండి జ్ఞానం సాధించి,సంతృప్తి పొందడం.ఈ మహనీయులు తమ వ్యక్తిగత ప్రయాణాల ద్వారా దీన్ని సాధించారు. మహనీయుల మార్గం అనుసరించండి,బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావ్ పూలే, బీ.ఆర్.అంబేద్కర్ వంటి మహానుభావులు సామాజిక సంస్కరణ,వ్యక్తిగత జ్ఞానం ద్వారా తమ జన్మలను సార్ధకం చేసుకున్నారు.మనం కూడా వారి మార్గంలో నడిస్తే,సమాజానికి మంచి చేస్తూ,స్వీయ సంతృప్తి పొందవచ్చు.రోజువారీ జీవితంలోని సంబంధాలు, బాధ్యతలు,సాఫల్యాలతో ముడిపడి ఉంటుంది.సామాజిక దృక్కోణంలో,మన జీవితం సమాజానికి ఎంతమేరకు ఉపయోగపడుతుందో అంత సార్ధకమవుతుంది.వ్యక్తిగత దృక్కోణంలో మాత్రం,స్వీయ సంతృప్తి,లక్ష్యాల సాధన, ఆనందం అనేవి కీలకం.ప్రతి మనిషి జీవితంలో ఈ దృక్కోణాలను అనుసరించాలి, అప్పుడు మనిషి జన్మ నిజంగా సార్ధకమవుతుంది.

గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.

# అజాగ్రత్త-నిర్లక్ష్యం వల్లే అధిక రోడ్డు ప్రమాదాలు





**ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలి.**
**జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ముగింపు సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.**

ధర్మఘంట, జనవరి 31, కరీంనగర్:

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మనందరి గురుతరమైన బాధ్యతని, భారం అనుకోవద్దని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. వాహనదారులతో పాటు ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణం సాగించాలని సూచించారు. సురక్షితమైన ప్రయాణం ద్వారా మన కుటుంబంతోపాటు ఇతరుల కుటుంబాలకు నష్టం కలగకుండా చూసుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. శనివారం తిమ్మాపూర్ లోని ఆర్టిఏ కార్యాలయంలోని జువ్వాడి చొక్కా రావు (సారథి) చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ఆడిటోరియంలో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ముగింపు సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారుల అజాగ్రత్త నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఎవరికివారు తమ బాధ్యతగా భావిస్తూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎక్కడా వాటిని బ్రేక్ చేయవద్దని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.



ఆయా పాఠశాలల విద్యార్థులు తల్లిదండ్రులు చుట్టుపక్కల వారికి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. తిమ్మాపూర్ సారథి చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ లో ఇప్పటివరకు దాదాపు 22,000 మంది విద్యార్థులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు తిమ్మాపూర్ చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ను సందర్శించి రూల్స్ పై శిక్షణ పొందాలని సూచించారు. అడిషనల్ డిసిపి వెంకట రమణ ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించవచ్చున్నారు. అతివేగము నిర్లక్ష్యం అజాగ్రత్త తో నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. పోలీస్ శాఖ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల భాగస్వా మ్యంతోనే పూర్తిగా రోడ్డు ప్రమాదాలు నియంత్రించవచ్చ న్నారు. ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా నెలరోజులపాటు జిల్లాలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై వివిధ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. పోలీస్ శాఖ, ఆర్ అండ్ బి శాఖ, వైద్యశాఖ, వివిధ శాఖలతో కలిసి ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. నెలలో ఒకరోజు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన తరగతులు నిర్వహించాలని ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ సూచించారు. రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ అవేర్నెస్ లో భాగంగా నిర్వహించిన క్విజ్ రంగోలి పోటీల్లో ప్రథమ చూపిన పలు పాఠశాలల విద్యార్థులకు మహిళలకు బహుమతులు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, ఆర్ అండ్ ఈ ఈ నరసింహ చారి, ఎంవీఐ రవికుమార్, తిమ్మాపూర్ సిఐ సదన్ కుమార్, ఏఎంవీఐ లు స్రవంతి, హరిత చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ఇన్స్ట్రక్టర్ హారిక తో పాటు పలువురు అధికారులు, ఆర్టిఏ పోలీస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచార ఖర్చులపై పకడ్బందీ నియంత్రణ

**అనుమానాస్పద లావాదేవీలపై గట్టి నిఘా**
**జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు**

నిజామాబాద్, జనవరి 31 ధర్మ ఘంట

జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రచార ఖర్చులపై పకడ్బందీగా నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు కిషన్ పమర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఏఈఓల బృందాలు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ లో ఏం.సి.సి., ఎం.సి.ఎం.సి. నోడల్ అధికారులు, ఏఈఓలు తదితరులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల వ్యయ నియంత్రణలో అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు (ఏఈఓ)లు కీలక పాత్ర పోషించాలన్నారు. ఎన్నికల ప్రచార ఖర్చులు ప్రతి అభ్యర్థి ఖాతాలో ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎన్నికలను ప్రభావితం చేసే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా డబ్బు, మద్యం, విలువైన వస్తువులు తదితరాలను అక్రమంగా పంపిణీ చేయకుండా గట్టి నిఘా



ఉంచాలన్నారు. అనుమానాస్పద లావాదేవీలు, బల్క్గా సరఫరా అవుతున్న వస్తువులు, నగదు కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వ్యయ నియంత్రణలో భాగంగా ఆయా బృందాలు పరస్పర సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ను పకడ్బందీగా అమలు చేయాలని, ఏ చిన్న ఉల్లంఘనకైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా అధికారులు సమిష్టిగా పని చేసినప్పుడే ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ ఫర్ ఎక్స్ పెండిచర్ ఆనంద్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దేశీ వంగడాలను కాపాడుకుందాం సేంద్రియ వ్యవసాయంతో భూమిని రక్షించుకుందాం


**యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం రాష్ట్ర కో.ఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి**

ధర్మ ఘంట జనవరి 31, సూర్యాపేట జిల్లా ప్రతినిధి



దేశీ వంగడాలను కాపాడుకుందాం సేంద్రియ వ్యవసాయంతో భూమిని రక్షించుకుందామని కద్తాల్ మండలం అన్మాసపల్లి ఎర్త్ సెంటర్ లో ఫిబ్రవరి 6 నుంచి 8 వ తారీకు వరకు తెలంగాణ ద్వితీయ విత్తన పండుగ కు జిల్లా నలుమూలల నుండి రైతులు, విద్యావంతులు, మేధావులు,విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం రాష్ట్ర కో.ఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించే స్థానిక సంప్రదాయ విత్తనాలు దేశీయ వంగడాల సంరక్షణ ప్రదర్శన కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గత సంవత్సరం 2025 లో సిజిఆర్ ఆధ్వర్యంలో తొలి విత్తన పండుగను నిర్వహించినట్లు అది సత్ఫలితాలు ఇవ్వడంతో మళ్ళీ ఇప్పుడు నిర్వహణకు కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా 75 పైగా స్టాలను మూడు రోజులపాటు ప్రదర్శన ఉంటుందని వివరించారు. అంతరించిపోతున్న వ్యవసాయ పద్ధతులను విద్యార్థినీ విద్యార్థులకు మెలుకువలు నేర్పిస్తూ, వ్యవసాయాన్ని కాపాడుకోవడం ఎలా, వ్యవసాయం పద్ధతుల మీద ప్రతిరోజు రైతులకు సంబంధించిన ఒక అంశం మీద సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## మేడారంలో గవర్నర్కు ఘనస్వాగతం పలికిన కరీంనగర్ పోలీసు కమిషనర్.



ధర్మఘంట, జనవరి 31, కరీంనగర్

ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలక్క వనదేవతల దర్శనార్ధం విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ గారికి పూల మొక్కను అందజేసి వారు సాదరంగా ఆహ్వానించారు. అమ్మవార్ల దర్శనానికి వచ్చిన గవర్నర్ వెంట, మంత్రి సీతక్క, జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కరీంనగర్లో ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం.




ధర్మఘంట, జనవరి 31, కరీంనగర్:

కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంపాటు విశేష సేవలందించిన ఐదుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం శనివారంనాడు కరీంనగర్ కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కమీషనరేటు కార్యాలయం ఏవో వై.వి. మునిరామయ్య, మహిళా పోలీసు స్టేషన్ ఎస్సై చల్ల రాజన్న, ట్రాఫిక్ పి.ఎస్. మహమ్మద్ ముస్తఫా, ఏ.ఆర్. పోలీస్ హెడ్ క్వార్టర్స్ విభాగం ఏఆర్ ఎస్సైలు ఖలీల్ , మహమ్మద్ బాషు పదవీ విరమణ పొందారు.కరీంనగర్ అడిషనల్ డీసీపీ పరిపాలన వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ, అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.అడిషనల్ డీసీపీ స్వయంగా పదవీ విరమణ పొందిన వారికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లు వెంకటరమణ, సిఎస్బి ఏసీపీ శ్రీనివాస్, సిఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, రిజర్వు ఇన్స్పెక్టర్ అడ్మిన్ రజినీకాంత్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై శ్రీ మామిడి సురేందర్ ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# నోడల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

**అదనపు కలెక్టర్ అంకిత్**

**ఎన్నికల పరిశీలకులతో కలిసి అధికారులతో సమీక్ష**

**నిజామాబాద్, జనవరి 31 ధర్మ ఘంట:**

మున్సిపల్ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అంకిత్ సూచించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్. సత్యనారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిరణ్ కుమార్ లతో కలిసి శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకుని, పోలింగ్, కౌంటింగ్ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనందున ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, పారదర్శకంగా, సాఫీగా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ నెల 11న పోలింగ్, 13న కౌంటింగ్ జరగనున్న దృష్ట్యా ఎన్నికల సిబ్బంది, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం గురించి చర్చించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఎస్.ఎస్.టీ, ఎఫ్.ఎస్.టీ బృందాలతో గట్టి నిఘా ఉంచాలన్నారు. సరిహద్దు ప్రాంతాలలో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు జరిపించాలన్నారు. పోలింగ్



కేంద్రాలలో తగిన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పరిశీలన చేసుకోవాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలకు సంబంధించిన వివిధ రిపోర్టులను తప్పులు లేకుండా ఎప్పటికప్పుడు టీ.పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడుతూ, వెబ్ క్యాస్టింగ్ జరిపించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్ల వద్ద తగిన భద్రత, సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చివరి సమయంలో హడావుడి పడకుండా ముందస్తుగానే ఏర్పాట్లను చక్కబెట్టుకోవాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళిని తు.చ తప్పక పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు.

ఎక్కడా అలసత్వానికి తావివ్వవద్దని, ఎన్నికల విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందన్నారు. నోడల్ అధికారులు మరోసారి ఎన్నికల నియమ, నిబంధనలను క్షుణ్ణంగా సరిచూసుకొని పొరపాట్లు దొర్లకుండా విధులు నిర్వహించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా

**నిజామాబాద్, జనవరి 31 ధర్మ ఘంట**



మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున జిల్లా కలెక్టరేట్ నందు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని. తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు, పిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## కార్పొరేషన్ ఎన్నికల టికెట్ల కేటాయింపులో క్రిష్టియన్ తగిన ప్రాధాన్యనివ్వాలి

**నగరంలో 50 నుండి 60 వేల క్రిష్టియన్ ఓటర్ల మేజార్టీ కలిగి ఉన్నాం**

**క్రిష్టియన్ లకు చికెట్టు కేటాయించండి**

**గెలిపించికుని తమ సత్తా చాటుకుంటాం**

**కాంగ్రెస్ పార్టీ అధిష్టానికి క్రిష్టియన్ లవిన్నం**



**ధర్మఘంట, జనవరి 31 కరీంనగర్**

ఆది నుండి కాంగ్రెస్ పార్టీతో సత్సంబందాలు కలిగి ఉండి పార్టీని అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోశించిన క్రిష్టియన్ లకు ఈ పురపాలక ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత ఇచ్చి తమకుంటూ తగిన గుర్తింపు ఇవ్వాలని క్రిష్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్మీ జాతీయ అధ్యక్షుడు ఫాస్టర్ ఏలిషా,ఫాస్టర్ రెవరెండ్ క్రిష్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సంతోష్ కుమార్ లు కాంగ్రెస్ పార్టీ అదిష్టానికి విజ్ఞప్తి చేశారు.వారు శనివారం స్థానిక విద్యానగర్ కాలనీలో ఏర్పాటు మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కరీంనగర్ లో దాదాపు 40 వేల నుండి 60వేల వరకు ఓట్ల శాతం ఉంటుందన్నారు.కాంగ్రెస్ పార్టీ తమ ఓటు శాతాన్ని తమ ప్రాధాన్యతను గుర్తించి క్రిష్టియన్ లకు టికెట్లు కేటాయించి తగిన గుర్తింపునివ్వాలన్నారు. కరీంనగర్ కార్పోరేషన్ పరిదిలో ఎంతో మంది క్రిష్టియన్ జనాభా ప్రాతిపదికన క్రిష్టియన్ లకు టికెట్లు కేటాయించి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పథంలో తీసుకపోవడానికి కృషిచేయాలని కోరారు. ఈ మేరకు ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధిష్టానంతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ను కోరడం జరిగిందన్నారు.అలాగే రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు.పొన్నం ప్రభాకర్,అడ్లూరు లక్ష్మణ్ లను కోరడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో క్రిష్టియన్ లకు పార్టీ టికెట్లు కేటాయంచని పక్షంలో నలపై,నుండి ఏబది శాతం ఉన్న క్రిష్టియన్ ఓటర్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే క్రిష్టియన్ లనుండి అనేక మందిని స్వతంత్ర అభ్యర్థులను ఈ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రిష్టియన్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. అత్యధిక జనాభా, ఓటర్లు ఉన్న క్రిష్టియన్ లకు పార్టీ టికెట్టు కేటాయిస్తే వారిని గెలిపించుకుని క్రిష్టియన్ ప్రాధాన్యతను నిరుపిస్తామన్నారు..

# అందుబాటులోకి మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ యాప్

**జిల్లాలో ప్రయోగాత్మక అమలుకు శ్రీకారం**


**మ్యానువల్ విధానానికి ఇకపై చెల్లుచీటీ**

**కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**

**ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక కేటాయింపు**

**నిజామాబాద్, జనవరి 31 ధర్మ ఘంట:**

ఇసుక అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా ప్రవేశపెట్టిన మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ యాప్ విధానాన్ని నిజామాబాద్ జిల్లాలో అందుబాటులోకి తెచ్చామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శనివారం ఆమె సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మైనింగ్, గ్రౌండ్ వాటర్ తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఈ నూతన విధానం అమలుకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. మ్యానువల్ విధానానికి స్వస్తి పలుకుతూ, ఇక నుండి పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే ఇసుక బుకింగ్ చేసుకునేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రయోగత్మకంగా నిజామాబాద్ జిల్లాలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టినందున, పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యేలా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఇసుక అవసరమైన వారందరూ ఆన్లైన్ బుకింగ్ యాప్ ను సద్వినియోగం చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, రవాణా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారా ఆన్లైన్ లో ఇసుక బుకింగ్ విధానం వల్ల మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వినియోగదారులకు మరింత పారదర్శకంగా, నేరుగా ఇసుక అందుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల కోసం లబ్దిదారులకు ఉచితంగా ఇసుకను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఇసుక లోడింగ్, విలేజ్ ఫండ్ కింద ఒక ఇసుక ట్రాక్టర్ లోడ్ కు కేవలం 612 రూపాయలను మాత్రమే ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులు




చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర గృహ నిర్మాణదారులు, ప్రభుత్వ పనులకు అవసరమైన ఇసుక కోసం 1173 రూపాయలు చెల్లించాలన్నారు. ఆన్లైన్ లోనే యూ.పీ.ఐ పేమెంట్ చేయాలని సూచించారు. అయితే ఇసుక తరలింపు కోసం వినియోగదారులే ట్రాక్టర్ వాహనాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. స్మార్ట్ ఫోన్ కలిగి ఉన్న వినియోగదారులు ప్లేస్టోర్ నుండి మన ఇసుక వాహనం యాప్ ను డౌన్ లోడ్ చేసుకుని నేరుగా ఇసుక బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఆ వివరాలు పంచాయతీ కార్యదర్శికి చేరుతాయని, ఆయన వాటిని పరిశీలించి తహసిల్దార్ కు ఫార్వార్డ్ చేస్తారని అన్నారు. ఇసుక పరిమాణంకు అనుగుణంగా యూపీఐ ద్వారా చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం డిజిటల్ విధానంలో క్యూఆర్ కోడ్ ద్వారా అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. స్మార్ట్ ఫోన్లు లేని వారు గ్రామ పంచాయతీ కార్యదర్శులని సంప్రదించి వారి లాగిన్ ద్వారా ఇసుక బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యానువల్ రసీదులు, అనుమతులు ఇవ్వకూడదని అధికారులకు సూచించారు. ఇసుకను ట్రాక్టర్ ద్వారానే తీసుకెళ్లెందుకు అనుమతించాలని, టిప్పర్లు, లారీలు వంటి వాహనాలకు అనుమతి లేదని అన్నారు. అదేవిధంగా ఇసుక రీచ్ లలో కూడా జే.సీ.బీలు, డోజర్లు వంటి యంత్రాలను వినియోగించకూడదని, కూలీల ద్వారానే ట్రాక్టర్ ట్రాలీలో నిర్ణీత పరిమాణం మేరకు ఇసుక లోడింగ్ చేయాలని సూచించారు.

మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ విధానం అమలు కోసం జిల్లాను ఎంపిక చేసినందున అధికారులు నిబద్ధతతో పనిచేసి నూటికి నూరు శాతం విజయవంతం అయ్యేలా చొరవ చూపాలన్నారు. తహశీల్దార్లు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని, ఆర్డీవోలు కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, మైనింగ్ శాఖ ఏ.డీ జి.సంజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పైశాచికంగా మారుతున్న వివాహేతర సంబంధాలు!

**ధర్మఘంట జనవరి 31 నాంపల్లి**

**ప్రియుడి భార్యపై పెట్రోల్ పోసి తగలబెట్టిన ప్రియురాలు**

**ఆరు నెలల బాబుకు పాలు పట్టిస్తుండగా దాష్టికానికి వడిగట్టిన సుజాత**

**మమత మంటల్లో కాలిపోగా 80% కాలడంతో బాలుడి పరిస్థితి విషమం**

**నల్గొండ జిల్లా నాంపల్లి మండలం కేతపల్లి గ్రామంలో ఘటన**

**నగేష్ యాదవ్ కు మీసాల సుజాతతో అక్రమ సంబంధం**

**తన కూతుర్లలో ఒకరిని పెళ్లి చేసుకోవాలని నగేష్ పై సుజాత ఒత్తిడి**

**మమతను పెళ్లి చేసుకోవడంతో తరుచూ గొడవలు**

**మమతను అడ్డు తొలగించేందుకు సుజాత మాస్టర్ ప్లాన్**

ఇదొక పైశాచిక దుర్మార్గం, వివాహేతర సంబంధాలు సమాజాన్ని కబళిస్తున్న విషసర్పాలు,అమానవీయతకు అంతులేని రూపాలు. సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న వివాహేతర సంబంధాలు ఇప్పుడు పైశాచిక రూపం ధరిస్తున్నాయి.ఇంటి పునాదులను పెకలించి, అమాయక జీవితాలను బలి తీసుకుంటున్న ఈ దుర్మార్గాలు మన సామాజిక విలువలను, నైతికతను ప్రశ్నిస్తున్నాయి. నల్గొండ జిల్లా నాంపల్లి మండలం కేతపల్లి గ్రామంలో శనివారం జరిగిన ఈ దారుణ ఘటన సభ్య సమాజాన్ని సిగ్గుతో తల దించుకునేలా చేసింది.ఇది కేవలం ఒక వార్త కాదు, సమాజానికి ఒక హెచ్చరికగా భావించాలి.

**అసలేం జరిగింది...?**

**గ్రామస్తుల కథనం మేరకు...**

నల్గొండ జిల్లా నాంపల్లి మండలం కేతపల్లి గ్రామానికి చెందిన నగేష్ యాదవ్ అదే గ్రామానికి చెందిన మీసాల సుజాత అనే వివాహితతో వివాహేతర సంబంధం ఉంది.సుజాత తన ఇద్దరి కూతుర్లలో ఒకరిని ప్రియుడు నగేష్ యాదవ్ పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసేది. కానీ,నగేష్ యాదవ్ సుజాత మాట కాదని మమతను పెళ్లాడడంతో గొడవలు మొదలయ్యాయి.ఇదే విషయంలో నగేష్,మమత భార్యభర్తల మధ్య,నగేష్ ప్రియురాలు సుజాత మధ్య తరచూ గొడవలు జరుగుతూనే ఉండేవి.ఈ నేపథ్యంలో ప్రియురాలు సుజాత ప్రియుడు నగేష్ యాదవ్ భార్య మమతను అడ్డు తొలగించాలని మాస్టర్ ప్లాన్ వేసింది.శనివారం మధ్యాహ్నం ప్రియుడు నగేష్ యాదవ్ భార్య మమత (25) కూర్చొని తన కుమారుడికి (ఆరు నెలల బిడ్డ)పాలు పట్టిస్తుండగా, సుజాత పక్కా ప్రణాళికతో మమతను హతమార్చేందుకు కత్తి,పెట్రోల్ తో వెళ్ళింది. పసిగుడ్డుకు పాలు ఇస్తుందన్న కనికరం కూడా లేకుండా పెట్రోల్ పోసి నిప్పంటి మహా దారుణానికి పాల్పడింది.ఒక్కసారిగా ఉలిక్కిడ్డ మమత పిల్లాడిని దూరంగా విసిరేసింది.తాను మాత్రం కేకలు వేస్తూ మంటల్లో కాలి బూడిదైపోయింది.ఆమె శరీరం పూర్తిగా కాలిపోగా, అమాయక బాలుడు కూడా 80% కాలిపోయాడు.మమత అరుపులు విని స్థానికులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని తల్లి కొడుకును ఆసుపత్రికి తీసుకెళ్లారు.కానీ, అప్పటికే మమత ప్రాణాలు పోవడంతో కాపాడలేకపోయారు. గాయాలతో ప్రాణాపాయ స్థితిలో బాలుడు నాంపల్లి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు.

ఈ ఘాతుకానికి పాల్పడిన సుజాత నాంపల్లి పోలీస్ స్టేషన్లో లొంగిపోయింది.సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు,ఎస్ఐ లింగారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇది ఎందుకు జరిగింది? నగేష్ యాదవ్కు సుజాతతో పెళ్లికి ముందు నుంచే అక్రమసంబంధం ఉండడమే ప్రధాన కారణం.ఇది కేవలం ఒక కుటుంబంలో జరిగిన విషాదం కాదు. సమాజంలోని నైతిక పతనానికి దర్పణం. వివాహేతర సంబంధాలు ఎంత భయంకరంగా మారుతున్నాయో ఈ ఘటన చూపిస్తోంది. అమాయక మహిళలు, పసిపిల్లలు ఈ దుర్మార్గాలకు బలవుతున్నారు.మన సామాజిక విలువలు,కుటుంబ బంధాలు, నమ్మకం,నైతికత ఇవన్నీ రగిలిపోతున్నాయి.ఇలాంటి సంబంధాలు సమాజాన్ని విషపూరితం చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.అక్రమ సంబంధాల నుండి బయటపడే చైతన్యం ప్రజలకు అవసరం.దాని కోసం మనమందరం మేల్కొనాలి.

**కుటుంబ విలువలను గౌరవించండి**

వివాహేతర సంబంధాలు ఆకర్షణీయంగా కనిపించినా, అవి విధ్వంసానికి దారి తీస్తాయి. నమ్మకాన్ని కాపాడుకోవాలి, మహిళల భద్రతపై,గ్రామాల్లో మహిళలు ఎదుర్కొంటున్న హింసను గుర్తించి,పోలీసులు, సమాజం కలిసి పని చేయాలి. పిల్లల భవిష్యత్ ను బలిచేస్తున్న ఘటనలు కోకొల్లలుగా కనిపిస్తాయి.ఈ ఘటనలో ఆరు నెలల బాలుడు ఇలాంటి





దుర్మార్గానికి బలైపోయాడు. పిల్లల రక్షణకు మనమందరం బాధ్యులమేచట్టపరమైన చర్యలు కూడా చాలా కఠినంగా ఉండాలి.ఇలాంటి నేరాలకు కఠిన శిక్షలు విధించి,సమాజంలో భయాన్ని కలిగించాలి.ఈ ఘటన దేశ ప్రజలను ఆలోచింపజేయాలి.మన సమాజం ఎటు పోతోంది? అనే విషయాన్ని అందరూ గుర్తించాలి. వివాహేతర సంబంధాలు 'ప్రేమ' పేరుతో దాచిన విషం.ఇప్పుడు మార్పు మన చేతుల్లోనే ఉంటుంది.చైతన్యవంతులై, సామాజిక విలువలను పునరుద్ధరిద్దాం,మరొక ఘటన జరగకుండా,మరో మమత,మరే పిల్లలు బలికాకుండా సమాజం జాగ్రత్త పడాలని హెచ్చరిస్తోంది.

# కేసీఆర్‌కు నోటీసులు ప్రతీకార రాజకీయాలకు పరా కాష్ట

**ఆర్మూర్, జనవరి31 ధర్మ ఘంట**

సీఎం రేవంత్ రెడ్డి విచారణల పేరుతో ప్రతీకార రాజకీయా లకు తెరతీశారని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆరోపించారు. ఇందులోభాగంగాగానే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను విచారణకు రావాలని నోటీసుల మీద నోటీసులు జారీ చేయిస్తూ శాడిజాన్ని ప్రదర్శిస్తున్న రేవంత్ రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని చేత కాని దద్దమ్మ కాంగ్రెస్ అని ఆయన దుయ్యబట్టారు. వైఫల్యాల నుచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్ డైవర్షన్ పోలిటిక్స్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇందులోభాగంగానే తలతోకలేని ఫోన్ ట్యాపింగ్ కేసు అని ఆయన విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో లబ్దిపొందేందుకు కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. ఈ క్రమంలోనే కేసీఆర్ కు సిట్ పేరుతో నోటీసులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. విచారణకు సహకరిస్తానని, సిట్ బృందం ఎర్రవల్లి లోని తన ఫార్మ్ హౌస్ కి వచ్చి విచారించాలని కేసీఆర్ అభ్యర్థించినా పరిగణనలోకి తీసుకోకుండా హైదరాబాద్ లోనే విచారణకు రావాలని మళ్లీ నోటీసులు జారీ చేయడం వెనుక కుట్రకోణం దాగిఉందని జీవన్ రెడ్డి ఆరోపించారు. చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని సంకల్పంతో సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్ అని ఆయన గుర్తుచేశారు. కేసీఆర్ దేశాన్నే కదిలించిన గొప్ప ఉద్యమ నేత, తెలంగాణ జాతిపిత అని కొనియాడారు. తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప నాయకుడు కేసీఆర్



అని ఆయన అన్నారు. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన కేసీఆర్ దేశం గర్వపడే గొప్ప ముందుచూపున్న లీడర్ అని జీవన్ రెడ్డి అభివర్ణించారు. ఇలాంటి గొప్పనేతకు సిట్ నోటీసులు ఏంటని ఆయన మండిపడ్డారు. అబద్ధాల పునాదులపై పేక్ హామీలతో ప్రజను మభ్యపెట్టి రేవంత్ రెడ్డి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చారన్నారు. రెండేళ్లలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు.తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనమని జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఇది విచారణ కాదు, ఇది ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న రేవంత్ రెడ్డి రాక్షస రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం అని ఆయన తెలిపారు. ఓటుకు నోటు కేసులో పట్టుబడి చిప్పకూడు తిన్న రేవంత్ రెడ్డి ఒక ప్రిజనరీ అని, తన దార్శనిక పాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టిన కేసీఆర్ ఒక విజనరీ అని ఆయన వ్యాఖ్యానించారు. తాను జైలు పాలయ్యాను కాబట్టి కేసీఆర్ ను కూడా జైలులో పెట్టాలన్న దుష్ట తలంపుతో రేవంత్ రెడ్డి ఉన్నారన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని విష రాజకీయాలు చేసినా తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచి గొప్ప నేతగా విలసిల్లుతున్న కేసీఆర్ నీడను కూడా తాకలేరని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. కేసీఆర్ ను టచ్ చేస్తే తెలంగాణ అగ్నిగుండంలా మారి ఆ నిప్పుల సెగకు కాంగ్రెస్ పార్టీ మాడి మసై పోతుందన్నారు. గతంలో కేసీఆర్ తో గోక్కున్నోళ్లు ఎవరూ బాగుపడలేదన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలన్నారు. కేసీఆర్ పై, ఆయన కుటుంబంపై పగ పెంచుకొని రాక్షస పాలనతో పైశాచిక ఆనందం పొందుతున్న రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర చివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా హీనమైన చరిత్ర మూటగట్టుకోవడం ఖాయమన్నారు.

ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తామని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

# సకల జనులను అమ్మవార్లు చల్లగా చూడాలి



**ధర్మఘంట, జనవరి31,రామగుండం**



> రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్
>
> దశాబ్దాల కేసీఆర్ పాలనలో సుభిక్షంగా తెలంగాణ రాష్ట్రం
>
> బీ.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థులకు సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదం ఇవ్వాలి
>
> నియతృత్వ రాక్షస పాలనకు రామగుండం ప్రజలు చరమగీతం పాడాలి

వన దేవతల పోరాట స్ఫూర్తితోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించారని పదేళ్ల కేసీఆర్ పాలనలో సుభిక్షంగా తెలంగాణ రాష్ట్రం ముందుకు సాగిందని ప్రతి ఇంటికి సంక్షేమ పథకం ప్రతి ముఖంలో అనందం నింపినా ఘనత కేసీఆర్ దని యావత్తూ తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గారు అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతర కమిటి స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తోలి సిఎం కేసీఆర్ పాలనలో ప్రజలంతా సుభిక్షంగా వర్ధిలారన్నారు. రెండేళ్ల రెవంత్ రెడ్డి పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప చేసింది ఎమి లేదని అబద్ధాల హామిలిచ్చి ప్రజలను మెసం చేసిన ఘనత రెవంత్ రెడ్డి కే దక్కుతుందన్నారు. రామగుండం నియోజకవర్గం లో రాక్షస పాలన సాగుతోందని అభివృద్ధి సాకుతో విధ్వంసం సృష్టించారని చిరు వ్యాపారులు దుకాణాలు కుల్చి వారి జీవితాలను రోడ్డుపై పడేశారన్నారు. రెండు సంవత్సరాల కాలంగా అభివృద్ధి సాకుతో కుల్చవేతలు కమీషన్ల కోసం పాలకులు పనిచేస్తున్నరని ఇక్కడ జరిగిన అభివృద్ధి శు న్యం అన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రజల కష్టాలు ఇబ్బందులు తోలగాంటే ఇక్కడ బీ.ఆర్.ఎస్ పార్టీ మేయర్ పీఠం గెలువాల్సిన అవసరం ఉందన్నారు. బీ.ఆర్.ఎస్ పార్టీ ఈ ప్రాంతానికి శ్రీరామ రక్ష అని కార్పోరేషన్ ఎన్నికల్లో బీ.ఆర్.ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను ప్రజలు గెలిపించి దుర్మారపు పాలనకు చరమగీతం పాడాలన్నారు. రామగుండం నియోజకవర్గం లోని సకల జనులందరికి సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల ఆశీస్సులుండాలనీ ప్రజలందరు సుఖ సంతోషాలతో వర్ధిలాలన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాలుగోన్నారు.

# జిల్లాలో ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ త్వరలోనే పూర్తి చేయాలి

## వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

**ధర్మఘంట, జనవరి 31, కరీంనగర్:**

ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లాలని తద్వారా సత్వరమే మ్యాపింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ, తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా కలెక్టరేటు కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు.రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. 2002 వివరాలతో, ప్రస్తుత వివరాలు సరి పోల్చి మ్యాపింగ్ ప్రక్రియను తర్వాతగతిన పూర్తి చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బి.ఎల్.ఓలు) తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. బిఎల్ఓ లు రోజువారీగా చేపట్టి ప్రోజెని మ్యాపింగ్ వివరాలను తమకు అందిస్తూ ఉండాలని పేర్కొన్నారు. బిఎల్ఓ లకు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎబిఎల్ఓ లు సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని






సూచించారు. ఎక్కడైనా పోలింగ్ బూత్ లలో ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురైతే సంబంధిత బూత్ లకు చెందిన బిఎల్ఓ లు అందరూ సమన్వయం చేసుకుంటే ఇబ్బందులు తొలుగుతాయని చెప్పారు. నిర్ణిత గడువులోగా ఈ ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియలో తప్పులు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 2002 ఓటర్ లిస్టు ప్రకారం కొత్త ఓటర్ లిస్టు మ్యాపింగ్ త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బిఎల్వోలతో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ పై సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ అర్బన్ లో మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎక్కడైతే మ్యాపింగ్ చేసుకొని వారు ఉంటారో వారిని వెంటనే మ్యాపింగ్ చేసుకునే విధంగా ప్రోత్సహించాల న్నారు. బి ఎల్ వో సూపర్వైజర్లు మ్యాపింగ్ తక్కువ ఉన్నచోట బీఎల్ఓ లతో కలిసి డోర్ టు డోర్ విజిట్ చేస్తూ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియ లక్ష్యసాధనకు అధికారులంతా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కుందారపు మహేష్, రమేష్ బాబు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డబ్ల్యూజేఐ మీడియా డైరీని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**ధర్మఘంట జనవరి 31,కరీంనగర్**



ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో మీడియా పాత్ర ముఖ్యమైనదని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని తన కార్యాలయంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (బిఎంఎస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన మీడియా డైరిని ఆమె ఆవిష్కరించారు.వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు దారం జగన్నాథ రెడ్డి, కార్యదర్శి గుడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కలెక్టర్ కు తొలుత పూల మొక్కను అందజేసారు.డైరీ ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డైరీ ముద్రణకు సంబంధించి డబ్ల్యూజెఐ ప్రయత్నాన్ని అభినందనీయమన్నారు. యూనియన్ జిల్లా కమిటీకి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు వాస్తవిక దృక్పథంతో ఆలోచించాలని, సమాజానికి ఉపయోగపడే రచనలు చేయాలని కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగురం రమేష్, కోశాధికారి చిట్టిమల్ల మహేందర్,కార్యవర్గ సభ్యులు కంది శ్రీనివాస్ రెడ్డి, గంగం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

**ధర్మఘంట జనవరి 31కరీంనగర్**





ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షునిగా ఎండి ఉస్మాన్ పాషా, ప్రధాన కార్యదర్శిగా జాలి మహేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో ఓకే ప్యానల్ నుండి 18 పదవులకు నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఫైనాన్స్ సెక్రటరీగా పోలాస రామచంద్రం,అసోసియేట్ అధ్యక్షులుగా పి. నాగమోహన్ ఉపాధ్యక్షులుగా జి వి. రమణారావు,ఎస్.శంకర స్వామి, మహిళా ఉపాధ్యక్షులుగా ఎన్. రాజమణి, సెక్రటరీలుగా కర్ర రాజిరెడ్డి, చీకోటి రమణయ్య, జాయింట్ సెక్రటరీలుగా వి.రాజిరెడ్డి ఈ. వీరస్వామి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఖాజా శంషుద్దీన్, కె.మహేందర్ రెడ్డి కె.వెంకటరమణ జిల్లా ప్రచురణ ప్రచార కార్యదర్శిగా ఏ. శ్రీధర్ రావు రాష్ట్ర కౌన్సిలర్ గా జి వి.మనోహర్ కుమార్, కె.మొగిలయ్య, చోటే మియా ఎన్నికయ్యారు.ఎన్నికల అధికారిగా జగిత్యాల జిల్లా అధ్యక్షులు కరబూజ రవీందర్,పరిశీలకులుగా టి.ప్రభాకర్ సహాయకులుగా ఎం.మల్లికార్జున్ వి.బాలమురళీకృష్ణ, జి.గంగాధర్, జి రవీందర్ వ్యవహరించారు. తమపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన సభ్యులకు జిల్లా అధ్యక్షులు ఉస్మాన్ పాషా, ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగుల పెన్షన్లకు, డి.ఎ లను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులకు నగదు రహిత వైద్య చికిత్సను అందించాలని, నూతన పిఆర్సిని అమలుపరచాలని, మార్చి 2024 నుండి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలను ఏక మొత్తంలో చెల్లించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## లెంకలపల్లిలో పాత బాట పునరుద్ధరణ

**సర్పంచ్ పద్మ వెంకటయ్య చొరవ**


**ధర్మ ఘంట,జనవరి 31 మర్రిగూడ :**



నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామంలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు సర్పంచ్ అయితగోని పద్మ వెంకటయ్య ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గ్రామంలోని నాగులమ్మ దేవాలయాల నుంచి పాకగూడెం వరకు కొన్ని సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉన్న పాత బాటను జేసీబీ సహాయంతో పునరుద్ధరించే పనులను శనివారం ప్రారంభించారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నాగులమ్మ గుడి నుంచి పాకగూడెం వెళ్లే ఈ మార్గంలో పిచ్చిమొక్కలు,గుంతలతో నిండిపోయి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు.ఈ పాత బాటను పునరుద్ధరించడం ద్వారా రవాణా సౌకర్యం సులభతరం కావడమే కాకుండా,పొలాలకు వెళ్లే రైతులకు కూడా ఎంతో మేలు చేకూరనుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేతరి శంకర్,వార్డు మెంబర్లు మల్లేష్,శ్రీను,శేఖర్,నర్సింహా,కాంగ్రెస్ నాయకులు శేఖర్, వెంకటేష్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అండర్ 16 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ ఎంపికైనా కోదాడ క్రీడాకారుడు

**కోదాడ జనవరి 31(ధర్మఘంట)**




హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న క్రికెట్ అండర్ 16 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ కు ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టుకు కోదాడకు చెందిన యువ క్రీడాకారుడు షేక్ అర్హాన్ ఎంపికైనాడు.హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల కోసం ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టుకు ఎంపికైన షేక్ అర్హాన్, కోదాడ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతూ తన ప్రతిభతో సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు. అతని క్రమశిక్షణ, కఠిన సాధన, ఆటలో ప్రతిభ కారణంగా ఈ అవకాశం దక్కింది. ఈ సందర్భంగా కోదాడ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి సురేష్,మండల విద్యాశాఖ అధికారి మహమ్మద్ సలీం షరీఫ్, కోదాడ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఖాజా మియా,తుమ్మల సురేష్, షేక్ మీరా,డాక్టర్స్ క్రికెట్ జట్టు కోదాడ రాయల్స్ క్రీడాకారులు డాక్టర్ నందకిషోర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ దిలీప్, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ వినయ్, డాక్టర్ విజయ్, డాక్టర్ కలాం, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సాంబ, డాక్టర్ వెంకటేష్, అసోసియేషన్ సభ్యులు బడుగుల సైదులు, నాయిని నాగేశ్వరరావు, జబ్బార్, శ్రీకాంత్, బాలరాజు తదితరులు హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు.తల్లిదండ్రులు అతనిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్ర స్థాయిలో కూడా కోదాడ క్రీడాకారులు రాణించడం గర్వకారణమని వారు తెలిపారు.

ధర్మఘంట

# విధి నిర్వహణలో వెంకటేశం అందించిన సేవలు అభినందనీయం

**ధర్మ ఘంట జనవరి 31, నల్గొండ**

సాంఘిక సంక్షేమ శాఖ లో చిలుకూరు వెంకటేశం వివిధ హోదాలో అందించిన సేవలు చాలా అభినందనీయమని టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి జె.శేఖర్ రెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు రణదేవ్ అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హెచ్ డబ్ల్యు ఓ డి.ఐ రాజు,కార్యదర్శి ఏ సత్యనారాయణ,రామకృష్ణారెడ్డి, టీఎన్జీవోస్ మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర మూర్తి,ఏడు దొడ్ల వెంకట్రాంరెడ్డి, సంక్షేమ అధికారి సంజీవయ్య ల తోపాటు పలువురు మాట్లాడుతూ తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచే విధంగా పనిచేస్తూ విధి నిర్వహణలో పేరు ప్రతిష్టలు పొందారని కొనియాడారు. వారి సేవలు పలువురు ఉద్యోగులు ఆదర్శంగా తీసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పదవి విరమణ శు భాకాంక్షలు ప్రతి ఒక్కరు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ఓ ఇంద్రసేనారెడ్డి, కరుణ శ్రీ, రమ్య సుధా, సుమలత, సోమేశ్వరి,దూసరి భారతమ్మ, స్వప్న,విజయలక్ష్మి, సౌజన్య, సునీత, రాధ,శోభన్ బాబు, ఉష,లింగయ్య, యాదగిరి, కార్తీక్ రెడ్డి,ప్రవీణ్, అశోక్, కాశయ్య, శంకర్ రెడ్డి, సుమన్, సైదులు,డి.స్వామి, శ్రీనివాస్, నరసయ్య, సుధీర్, జయపాల్, శ్యామ్, కిషోర్, క్రాంతి, భాస్కర్, మురళి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి కార్యక్రమం రద్దు : కలెక్టర్ పమేలా సత్పతి.

**ధర్మఘంట, జనవరి 31, కరీంనగర్:**

కరీంనగర్ కలెక్టరేట్ లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని వెల్లడించారు.

## సిద్ధార్థ హైస్కూల్‌లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు



**ధర్మ ఘంట జనవరి 31,సూర్యాపేట**

జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ లో శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు తమదైన శైలిలో పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు.విద్యార్థులు వివిధ పాత్రలను పోషించి, ఉపాధ్యాయుల,విద్యార్థుల మెప్పును పొందారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అండ్ హెచ్ఎం ఎం.హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించవద్దని అన్నారు.అనంతరం ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు.విద్యార్థుల పలు వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజం

**ఘనంగా ఇర్ల వెంకన్న ఉద్యోగ పదవి విరమణ మహోత్సవం**

**ధర్మ ఘంట జనవరి 31సూర్యాపేట**



ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమని సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ సీహెచ్.హన్మంత రెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సూర్యాపేట మున్సిపాలిటీ ఆపరేటర్ గ్రేడ్ త్రీ ఇర్ల వెంకన్న ఉద్యోగ పదవి విరమణ మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఉద్యోగ బాధ్యతలలో ఉన్నప్పుడు చేసిన సేవలు పదవి విరమణ పొందిన రోజు గుర్తుకొస్తాయని అన్నారు.ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదని అన్నారు. ఇర్ల వెంకన్న తనకు కేటాయించిన విధులలో అంకిత భావం, నిబద్ధతతో అందించిన సేవలు అభినందనీయమని అన్నారు.38 సంవత్సరాలుగా మున్సిపల్ వాటర్ సప్లై విభాగంలో అత్యున్నత సేవలు ప్రజలకు అందించారని అన్నారు.ఆయన శేష జీవితం భగవంతుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఇర్ల వెంకన్న లక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ సత్యరావు, ఏఈ తిరుమలయ్య, టిపిఓ సోమయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, షఫీ వుల్లా, వాటర్ సప్లై ఇన్చార్జ్ సయ్యద్ సమ్మి, గుండు నాగరాజు, కనుకు రమేష్, శ్రవణ్,తండు వెంకటేష్, దండు నాగరాజు,సోమమ్మ, గంగమ్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## సాందీప్ పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**ధర్మ ఘంట జనవరి 31, నల్గొండ**

నల్లగొండ పట్టణంలో డి వి కే రోడ్ లో సాందీప్ హైస్కూల లో విద్యార్థులు శనివారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు.విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి ఒకరోజు పాఠాలు బోధించి ఉపాధ్యాయులుగా భావించి ఆనందం వ్యక్తం చేశారు.విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా అన్ని సబ్జెక్టులు బోధించారు.ఈ స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ గా కే.వరుణ్,జాయింట్ కలెక్టర్ గా ఆఫ్రిన్,డిఇఓగా అబ్జర్, ఎంఈఓ గా తరుణప్రియ,పరిశీలనాధికారి గా ఆఫ్రోజ్,పాఠశాల చైర్మెన్ గా ఎం.లోకేష్,హెడ్మాస్టర్ గా హర్షిత, హై స్కూల్ ప్రిన్సిపల్ గా ఆర్ దీక్షిత ప్రైమరీ ప్రిన్సిపల్ గా సి.హెచ్. శ్రీజ లు ఒకరోజు అధికారులుగా ఉండి తమ విధులు చక్కగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాందీప్ పాఠశాల కరస్పాండెంట్ గానూతుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల కంటే చాలా గొప్పదని దేశానికి ఎంతో గొప్ప మేధావులు అందించే ఈ వృత్తిని ఎంచుకోవడం చాలా అదృష్టంగా భావించాలని,ప్రతి ఒక్కరూ జీవితంలో ఇటువంటి ఉన్నత పదవులలో స్థిరపడాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను, సహకరించిన వారి తల్లిదండ్రులను ఈ సందర్భంగా అభినందించారు.

## చేనేత కార్మికుల రుణమాఫీ నిధులు విడుదల చేయండి... వనం శాంతి కుమార్



**ధర్మ ఘంట, శనివారం 31 మోత్కూర్**

చేనేత కార్మికులకు ప్రకటించిన రుణమాఫీని ప్రభుత్వం పూర్తిగా అమలు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్ డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల పోరాటంతో ప్రభుత్వం 33 కోట్లు విడుదల చేసిందిగానీ, మిగిలిన 16 కోట్లు 27 లక్షలు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. వెంటనే జీవో జారీ చేసి నిధులను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.మున్సిపాలిటీ ఎన్నికలలో లాభం పడే ఎందుకు పట్టణ ప్రాంత కార్మికులకు మాత్రమే రుణమాఫీ అమలు చేయడం దారుణమని, గ్రామీణ ప్రాంత చేనేత కార్మికులను విస్మరించడం ఓట్లు కొనుగోలు చేసే ప్రయత్నమేనని అన్నారు. 48 కోట్ల రుణమాఫీ హామీ అమలు చేయడానికి ఏడాదిన్నర పట్టడం, అది కూడా ఎన్నికల ముందు విడుదల చేయడం సిగ్గుచేటు విషయమన్నారు.చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రుణమాఫీతో పాటు కొత్త రుణాలు మంజూరు చేసి, సంఘాలను బలోపేతం చేయాలని, 12 ఏళ్లుగా నిలిచిపోయిన చేనేత సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని వనం శాంతి కుమార్ కోరారు. జియో ట్యాగ్ చేసిన ప్రతి చేనేత కార్మికునికి రూ.2,000, అనుబంధ కార్మికునికి రూ.1,000 చేనేత భరోసా కింద చెల్లించాలని డిమాండ్ చేశారు.త్రిఫ్ట్ పథకం నిధులు, పెండింగ్‌లో ఉన్న చేనేత భీమా మొత్తాలను తక్షణం విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గుండు వెంకట నర్సు, కూరపాటి రాములు, పసునూరి యాదయ్య, వంగరి బుగ్గ రాములు, వేముల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒకసారి గోపు మల్లారెడ్డికి అవకాశం ఇవ్వండి అల్లునూరు ఓటర్లను కోరిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

**ధర్మఘంట, జనవరి 31 కరీంనగర్**



నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోపు మల్లారెడ్డి కార్పొరేటర్ గా అవకాశం కల్పించాలని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అల్లునూరు ఓటర్లను కోరారు. శనివారం అల్లునూరు లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్న పథకాలు అమలు చేస్తున్నదని చెప్పారు.ఈ ఎన్నికల్లో కార్పొరేటర్ గా గోపు మల్లారెడ్డిని గెలిపిస్తే శీఘ్రగతిన డివిజన్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో 8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, డివిజన్ మాజీ కార్పొరేటర్ సల్ల రవీందర్, పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణరెడ్డి, చిందం కిష్టయ్య, కంది అశోక్ రెడ్డి, దాసం నాగేందర్, జాప రాఘవరెడ్డి, జాప మల్లారెడ్డి,మామిడి నరేందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్, ముంజ స్వాతి-శ్రీకాంత్ గౌడ్, అట్ల అనిల్ కుమార్, తొర్తి అరవింద్, ఐతం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వెటరినేరియన్స్ హ్యాండ్ బుక్, క్యాలెండర్ ఆవిష్కరణ



**ధర్మ ఘంట జనవరి 31, నల్గొండ**

జిల్లా నాన్ గెజిటెడ్ వెటరినేరియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డి అజీముద్దీన్ అధ్యక్షతన జరిగిన వెటరినేరియన్స్ జిల్లా హ్యాండ్బుక్ 2026 ను క్యాలెండర్ ను జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్.జి.వి. రమేష్,సహాయ సంచాలకులు డాక్టర్.జె.వెంకట్ రెడ్డి,జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షులు నాగిళ్ల మురళి,కార్యదర్శి జే.శేఖర్ రెడ్డి లు జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి కార్యాలయంలో ఆవిష్కరించారు.అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ జిల్లా అసోసియేషన్ మొదటిసారిగా హ్యాండ్ బుక్ ను పారావెట్ ఉద్యోగులకు కావలసిన ఉపయోగపడు అంశములను పొందుపరిచి చాలా చక్కగా రూపొందించారని కొనియాడారు. జిల్లా టీఎన్జీవి అసోసియేషన్ మంచి కార్యక్రమాలను చేస్తూ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండడం హర్షించదగిన అంశం అని అన్నారు.శాఖ ఎదుర్కొంటున్న సమస్యలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని జిల్లా అధ్యక్షులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా టీ ఎన్ జి వి ఏ కార్యదర్శులు జాని పాష,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్యామ్,నల్లగొండ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత,కోశాధికారి డి.నాగరాజు యాదవ్,ఉపాధ్యక్షులు జీవన్, శ్రీనివాస్, జనార్ధన్, స్వాతి,జ్యోతిలత,లక్ష్మణ్,,సంయుక్త కార్యదర్శులు అనిత, అసీమ్,నిర్మలా,సమీన,అరుణ, హనీఫ్,కార్యవర్గ సభ్యులు శ్రావ్య, కౌసర్, భానుచందర్ మరియు మహేష్,నరేష్, సురేష్,శివ నాగ మల్లీశ్వరి,రాధిక,శ్రీలత, ఫసి,నాగయ్య తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీ అభ్యర్థులకే సాధ్యం

**ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో బుర్రి చైతన్య రెడ్డి**



**ధర్మ ఘంట జనవరి 31, నల్గొండ:**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే అధికార పార్టీకి సాధ్యమవుతుందని అందుకు పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మేయర్,32వ కార్పొరేటర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తూ నల్లగొండ పట్టణంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. పట్టణ అభివృద్ధి జరగాలని మంత్రి నల్గొండ మున్సిపాలిటీ కార్పొరేషన్ గా చేయడం జరిగిందని తెలిపారు. పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు చెయ్యి గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి 32వ వార్డులో మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ వెంకట్ రెడ్డి,వంగాల అనిల్ రెడ్డి,సంతోష్,రఫీ,భాష,నాగమణి రెడ్డి,వంగాల సుమతి,మహిళలు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూర్ మున్సిపాలిటీ బరిలో 80 మంది అభ్యర్థులు.

**నామినేషన్ల పరిశీలన పూర్తి.**




**ధర్మ ఘంట,జనవరి 31 మోత్కూర్:**

మోత్కూరు పురపాలక సంఘ రెండో సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం నామినేషన్ల పరిశీలన ముగిసింది. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ స్క్రూటినీలో మొత్తం 107 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. వివిధ వార్డుల నుంచి అభ్యర్థులు దాఖలు చేసిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఈ జాబితాను ఖరారు చేశారు. ప్రస్తుతం బరిలో మొత్తం 80 మంది అభ్యర్థులు ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ కె. సతీష్ కుమార్ అధికారికంగా వెల్లడించారు. నామినేషన్ల పరిశీలన అనంతరం తొలిరోజున అభ్యర్థులెవరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకోలేదని కమిషనర్ స్పష్టం చేశారు. అభ్యర్థుల తుది జాబితా, గుర్తుల కేటాయింపు వంటి తదుపరి ప్రక్రియలు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం కొనసాగుతాయని ఆయన వివరించారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నందున అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

## మేడారంలో గవర్నర్‌కు ఘనస్వాగతం పలికిన కరీంనగర్ సీపీ

**ధర్మఘంట,జనవరి 31 మేడారం**



సమ్మక్క-సారలక్క వనదేవతల దర్శనార్థం విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ కి పూల మొక్కను అందజేసి వారు సాదరంగా ఆహ్వానించారు. అమ్మవార్ల దర్శనానికి వచ్చిన గవర్నర్ వెంట, మంత్రి సీతక్క, జిల్లా ఉన్నతాధికారులు మరియు పోలీస్ సిబ్బంది ఉన్నారు.